DATE: 03-02-2022

prajamantalu, Jagitial

# ప్రజా మంటలు

తెలుగు జాతీయ దినపత్రిక

ఎడిటర్: సిహెచ్.వి. ప్రభాకర్ రావు

prajamantalu.com

సంపుటి(Volume) : 2
సంచిక(Issue) : 223

పేజీలు - 10
వెల: రూ 5/-

గురువారం

03 ఫిబ్రవరి, 2022

tPublished From Jagithyal, Circulated to Jagtial, Jangaon,Jayashankar Bhoopalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahabubnagar, Mancherial, Medak, Medchal, Nagarkurnool, Nalgonda, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla, Rangareddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal (Rural), Warangal (Urban), Yadadri Bhuvanagiri,



రాజ్యాంగం మార్చాలనడం మూర్ఖత్వం
కేసీఆర్ ప్రకటనపై మండిపడ్డ కోదండరామ్

2లో



రాజ్యాంగం రద్దు బీజేపీ ఎజెండా
బీజేపీ ఎజెండాను అమలు చేసేపనిలో కేసీఆర్

5లో



## దేశ ఎగుమతులు 4.7లక్షల కోట్లు

- ఆత్మనిర్భర భారత్‌కు అనుగుణంగా బడ్జెట్
- భారత్ పట్ల ప్రపంచ దేశాల దృష్టికోణం మారింది
- పటిష్టమైన ఆర్థిక దేశంగా రూపొందించడమే లక్ష్యం
- బీజేపీ కార్యకర్తలతో వర్చువల్‌గా ప్రసంగించిన ప్రధాని మోడీ

న్యూఢిల్లీ,ఫిబ్రవరి2: ప్రపంచదేశాలు భారత్‌ను చూసే దృష్టికోణం మారిందని ప్రధాని నరేంద్రమోడీ అన్నారు. ప్రపంచం బలమైన భారతదేశాన్ని చూడాలని కోరుకుంటోందని అన్నారు. బడ్జెట్, ఆత్మ నిర్భర్ భారత్‌పై బీజేపీ కార్యకర్తలు, నేతలతో మోడీ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. ఆర్థిక స్వావలంబనతో పాటు దేశాభివృద్ధికి బడ్జెట్ ఎంతో ఉపయోగపడుతుందని ప్రధాని అభిప్రాయపడ్డారు. గత ఏడేళ్లలో తాము తీసుకున్న నిర్ణయాలతో ఆర్థిక వ్యవస్థ బలోపేతమవుతూ వస్తోందన్న ఆయన.. ఏడేళ్ల క్రితం లక్షా 10వేల కోట్లుగా ఉన్న జీడీపీ.. ప్రస్తుతం 2లక్షల 30వేల కోట్లు దాటిందని చెప్పారు. వ్యవసాయరంగాన్ని ఆధునీకరించేందుకు బడ్జెట్లో ప్రాధాన్యమిచ్చినట్లు

- మిగతా 2లో

రామానుజ జపంతో మార్మోగిన

## ముచ్చింతల్

సహస్రాబ్ది ఉత్సవాలకు అంకురార్పణ

శోభాయాత్రతో మొదలైన కార్యక్రమాలు

హైదరాబాద్,ఫిబ్రవరి2: సమతకు చిహ్నమైన దివ్య మూర్తి శ్రీరామానుజాచార్య.. సహస్రాబ్ది సమారోహానికి శంషాబాద్‌లోని ముచ్చింతల్ దివ్యక్షేత్రం వేదికయ్యింది. బుధవారం ఉదయం

- మిగతా 2లో



## రాజ్యాంగ పదవుల్లో ఉంటూ అపహాస్యం చేస్తారా

- అంబేడ్కర్‌ను అవమానించేలా కేసీఆర్ వ్యాఖ్యలు
- ప్రధాని మోడీపై విమర్శలు అర్థరహితం
- హుజూరాబాద్ ఫలితం తరవాత బీజేపీపై విషప్రచారం
- కేసీఆర్ తీరుపై మండిపడ్డ కేంద్రమంత్రి కిషన్ రెడ్డి



న్యూఢిల్లీ,ఫిబ్రవరి2: ప్రధాన మంత్రి గురించి మాట్లాడేటప్పుడు భాష హుందాతనంగా ఉండాలని.. సీఎం కేసీఆర్‌ను ఉద్దేశించి కేంద్ర మంత్రి కిషన్ ÷– రెడ్డి వ్యాఖ్యానించారు. ఆయా ప్రాంతాల ఆచార, సంప్రదాయాల మేరకు ప్రధాని మోదీ నడుచుకుంటే కేసీఆర్ విమర్శిస్తున్నారని ఆరోపించారు. రాజ్యాంగ పదవుల్లో ఉన్న వ్యక్తులు సంయమనం పాటించాలని.. ప్రధాని వ్యక్తిగత విషయాలపై విమర్శలు తగదన్నారు. రాజ్యాంగ పదవిలో ఉండి రాజ్యాంగాన్ని మార్చాలని మాట్లాడటం సరైంది కాదని.. అన్నారు. రాజ్యాంగ నిర్మాత డా. బీఆర్ అంబేడ్కర్‌ను అవమానించే విధంగా కేసీఆర్ వ్యాఖ్యలున్నాయని దుయ్యబట్టారు. దిల్లీలో నిర్వహించిన మీడియా సమావేశంలో కిషన్ రెడ్డి ఈ మేరకు వ్యాఖ్యలు చేశారు. హుజూరాబాద్ ఉపఎన్నిక ఫలితాల తర్వాత భాజపాపై..

- మిగతా 2లో

## కేసీఆర్ వ్యాఖ్యలపై ఎందుకీ ఉలికిపాటు

తెల్లారేసరికి రాజ్యాంగం మారిపోయిందా

- చర్చించాలంటే రచ్చచేస్తారెందుకు
- వందకు పైగా రాజ్యాంగాన్ని మార్చింది ఎవరు
- నేటికీ ఎస్సీ, ఎస్టీలకు ఎందుకు న్యాయం జరగడం లేదు
- మీడియా సమావేశంలో మండిపడ్డ టిఆర్ఎస్ దళిత నేతలు

హైదరాబాద్,ఫిబ్రవరి2: కేంద్ర బడ్జెట్‌పై విమర్శలు గుప్పించిన తెలంగాణ సీఎం కేసీఆర్.. ఇదే సమయంలో భారత రాజ్యాంగంపై చేసిన వ్యాఖ్యలు పెద్ద రచ్చగా మారాయి.. రాజ్యాంగాన్ని మార్చాని సిఎం కెసిఆర్ వ్యాఖ్యానించగానే కాంగ్రెస్, బిజెపి నేతలు ఎందుకు ఉలిక్కి పడుతున్నారని టిఆర్ఎస్ మండిపడింది. ఇదేదో అంబేద్కర్‌ను అవమానిం చడం అన్న ధోరణిలో మాట్లాడడం దారుణమని ఆ పార్టీ ఎమ్మెల్సీ కడియం శ్రీహరి, ఎమ్మెల్యేలు క్రాంతి కిరణ్, బాల్క సుమన్‌లు అన్నారు. ఈ రెండు పార్టీలు వందకు పైగా సార్లు రాజ్యాంగాన్ని మార్చిన విషయం మరువరాదన్నారు. దేశంలో అసమానతలు ఇంకా తొలగకపోవడంతో పాటు, ఎస్సీఎస్టీలకు నేటికీ సమానహక్కులు దక్కకపోవడంతోనే కెసిఆర్ ఈ వ్యాఖ్యలు చేయాల్సి

- మిగతా 2లో

## ప్రమాదంలో కేంద్ర విదేశాంగ విధానం

మోడీ తీరుతో దగ్గరైన పాక్, చైనాలు

పేదలు, ధనవంతుల మధ్య పెరుగుతున్న అంతరం

లోక్‌సభలో ధన్యవాద తీర్మానంపై రాహుల్ విమర్శలు



న్యూఢిల్లీ,ఫిబ్రవరి2: కేంద్ర విదేశాంగ విధానంలోని పొరపాటు వల్లే పాకిస్థాన్, చైనా దగ్గరయ్యా యని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ అన్నారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై రాహుల్ బుధవారంనాడు లోక్‌సభలో మాట్లాడుతూ మోదీ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. మన విదేశాంగ విధానంలో ప్రాథమిక పొరపాట్ల వల్ల భారత్, చైనా దగ్గరయ్యాయి. భారత ప్రజల పట్ల మీరు చేసిన అతిపెద్ద పాపం ఇది. చైనాకు చాలా స్పష్టమైన ప్లాన్ ఉంది. దానిని డోక్లాం, లద్దాఖ్‌లలో వాళ్లు అమలు చేశారు. భారతదేశానికి ఇది చాలా తీవ్రమైన ముప్పులాంటిది. విదేశాంగ విధానంలో మనం చాలా పెద్ద పొరపాటు చేశామని రాహుల్ అన్నారు. భారతదేశాన్ని రెండు భారతదేశాలుగా

- మిగతా 2లో

## కేంద్ర బడ్జెట్‌తో ఒరిగిందేమీ లేదు

- తెలంగాణపై కేంద్రం సవతి తల్లి ప్రేమ
- ప్రజల ఆశిస్సులతో కేసీఆర్ అద్భుత పాలన
- అభివృద్ధికి ప్రజల సహకారం అందించాలి
- మేడ్చెల్ పర్యటనలో పలు కార్యక్రమాలకు కేటీఆర్ శ్రీకారం
- మంత్రి పర్యటనను అడ్డుకున్న కాంగ్రెస్ శ్రేణులు

2లో







తెరాస జిల్లా అధ్యక్షులుగా నియమింపబడ్డ తరువాత విద్యాసాగర రావు, ఎమ్మెల్సీ గా ఎన్నికైన ఎల్ రమణ మొదటిసారి జిల్లాకు వచ్చిన సందర్భంలో బతకమ్మతో జిల్లాపరిషత్ చైపర్సన్ దావా వసంత సురేశ్ స్వాగతం , తరువాత అందొ కలిసి బతకమ్మ ఆడిన తెరాస నాయకులు పునుగోటి ప్రశాంతి, సుంకే రవి శంకర్ తదితరులు

## ప్రజానాడి




## దళితుల వ్యతిరేక పార్టీ బిజెపి

కళ్ళుండి చూడలేని కబోది నాయకులు

మంత్రి కొప్పుల ఈశ్వర్



జగిత్యాల ఫిబ్రవరి 03 (ప్రజా మంటలు) : ఇప్పటివరకు బిజెపి ప్రభుత్వం ప్రవేశపెట్టిన 8 బడ్జెట్ లలో ఎస్సి ఎస్టీ బిసి వర్గాల కోసం ఏ రకంమైన ప్రధాన్యత ఇవ్వలేదని, ఆ పార్టీ నాయకుయాలకు మీకు సోయి, కల్లు ఉంటే.. తెలంగాణకు ఏమిచేసిందో చెప్పాలని మంత్రి కొప్పుల ఈశ్వర్ ప్రశ్నించారు. బండి సంజయ్ వి పచ్చి అబద్దాలు..చేతగాని మాటలు.. ధైర్యం దమ్ము ఉంటే ప్రజాక్షేత్రం లోకి రావాలని, వాపును చూసి బలుపు అనుకోవద్దు అని బండి సంజయ్ కి సూచిస్తున్నాని అంటూ బండి వ్యాఖ్యలను ఖండించారు.

క్యాంప్ కార్యాలయం లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి ఆయన మాట్లాడుతూ బిజెపి దిగజారుడుకు పరాకష్ట గుజరాత్ లో ఎస్సి లను ఊచకోత చేసిన చరిత్ర మీ పాలకులదని, దళితుల గురించి మాట్లాడే హక్కులు లేదని, దళిత ద్రోహులు బిజెపి వారని, దళితుల వ్యతిరేక పార్టీ బిజెపి అనీ విమర్శించారు.

మనువాద సిద్దాంటానికి అనుగుణంగా నడుచుకునే ఆర్ఎస్ఎస్, బిజెపిలు ఎస్సి, ఎస్టీ రిజర్వేషన్ లను కలరాసే కుట్ర చేస్తున్నారని, ప్రయివేటికరణ ద్వారా బడుగు బలహీన

- మిగతా 5లో

## అంబారిపేటలో దారుణ హత్య.



జగిత్యాల ఫిబ్రవరి 02 (ప్రజా మంటలు) : జగిత్యాల అర్బన్ మం. అంబారిపేట గ్రామంలో వీర్ల శంకర్ దారుణ హత్యకు గురయ్యాడు. పొలాస పోయస్తేశ్వరాలయం అభివృద్ధి కమిటీ అధ్యక్షులు చీర్ల శంకర్ ను స్వంత బావ వెంకటేశ్, అంబారీపేట గ్రామంలో పెళ్లి వేడుకలు జరుగుతుండగానే, గొడ్డలితో తీవ్రంగా గాయపరిచాడు. తీవ్రగాయాలైన శంకర్‌ను జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా దారిలోనే మృతి చెందినట్లు తెలుస్తుంది.

బావ, బావమరిది ల మధ్య భూ తగాదాలే హత్యకు కారణమని కుటుంబ సభ్యుల ఆరోపిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసుని దర్యాప్తు చేస్తున్నారు.

# దేశ ఎగుమతులు 4.7లక్షల కోట్లు

మొదటిపేజీ తరువాయి..

నరేంద్రమోడీ చెప్పారు. ప్రభుత్వ చర్యల ఫలితంగా దేశ ఎగుమతులు 4.7 లక్షల కోట్లుకు చేరాయని ప్రకటించారు. కేంద్ర బడ్జెట్ రాజకీయాలకు అతీతంగా అందరి మన్ననలు పొందిందని చెప్పారు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ. ఆత్మనిర్భర్ పునాదులతో నవభారత్ నిర్మాణానికి ఇది దోహదపడుతుందన్నారు. పేదలు, మధ్యతరగతి ప్రజలకు మౌలిక వసతులు కల్పించడం పైనే కేంద్రం ప్రధానంగా దృష్టి సారించిననట్లు పేర్కొన్నారు. మన ఆర్థికవ్యవస్థను అత్యంత వేగంగా బలోపేతం చేయాల్సిన అవసరం ఉంది. కరోనా తర్వత ప్రపంచ స్థితిగతులు మారాయి. భారత్‌ను మరింత పటిష్ఠంగా చూడాలని ప్రపంచ దేశాలు కోరుకుంటున్నాయి . భారత్‌ను స్వయంసమృద్ధ, ఆధునిక దేశంగా తీర్చిదిద్దడం అత్యంత కీలకం. ఈ బడ్జెట్ నవభారత్ నిర్మాణానికి మార్గం. కేంద్రం గత ఏడు
సంవత్సరాలుగా తీసుకుంటున్న సరైన నిర్ణయాల వల్లే భారత ఆర్థిక వ్యవస్థ అంతకంతకూ విస్తరిస్తోంది. ఏడేళ్ల క్రితం భారత జీడీపీ రూ.లక్షా 10వేల కోట్లుగా ఉంది. ఇప్పుడు రూ.2లక్షల 30వేల కోట్లకు పెరిగింది. దేశ విదేశీ మారక నిల్వలు 200 నుంచి 630 బిలియన్ డాలర్లకు పెరిగాయి. ప్రభుత్వ సమర్థవంతమైన విధానాల వల్లే ఇది సాధ్యమైందని ధాని మోదీ అన్నారు. సరిహద్దు గ్రామాల నుంచి వలసలు దేశ భద్రతకు మంచిది కాదని మోదీ అన్నారు. అందుకే ఆ ప్రాంతాలను అభివృద్ధి చేసేందుకు బడ్జెట్ లో కేటాయింపులు చేసినట్లు పేర్కొన్నారు.

# ప్రమాదంలో కేంద్ర విదేశాంగ విధానం

మొదటిపేజీ తరువాయి..

కాంగ్రెస్ పార్టీ కీలక నేత రాహుల్ గాంధీ వర్ణించారు. ఒకటి ధనవంతుల దేశం కాగా మరొకటి పేదల దేశమని, అయితే ఈ రెండు దేశాల మధ్య విభజన నానాటికీ పెరుగుతోందని ఆయన అన్నారు. ఈ సందర్భంలో మోదీ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. మనకు రెండు భారతదేశాలు ఉన్నాయి. ఒకటి పూర్తిగా ధనవంతుల



భారతదేశం. వీరికి వాస్తవానికి ప్రభుత్వం నుంచి నీటి సదుపాయం, విద్యుత్ సదుపాయం, ఉద్యోగాలు కల్పించాల్సిన అవసరం లేదు. వాళ్ల దగ్గర చాలా డబ్బు ఉంటుంది. అధికారం కూడా ఉంటుంది. కానీ ప్రభుత్వం నుంచి వీరికి అన్ని సదుపాయాలు అందుతున్నాయి. వాస్తవానికి ప్రభుత్వమే వారి కోసం పని చేస్తోంది. ఇంకొక భారతదేశం పూర్తిగా పేద ప్రజలది. వీరికి ప్రభుత్వం నుంచి ఆపన్న హస్తం అందాలి. కానీ వీరి గురించి ప్రభుత్వం ఆలోచించడం లేదు. మోదీ ప్రభుత్వ విధానాల వల్ల ఈ రెండు దేశాల మధ్య విభజన నానాటికీ పెరుగుతోంది. దేశంలోని 10 మంది ధనవంతుల వద్ద ఉన్న డబ్బు దేశంలోని 40 కోట్ల భారతీయుల ఆదాయంతో సమానమని రాహుల్ గాంధీ అన్నారు. ఇక బడ్జెట్‌లో రైతులు, నిరుద్యోగులు, పేద వర్గాల గురించి కేంద్ర ప్రభుత్వం పట్టించుకోలేదని రాహుల్ గాంధీ విమర్శించారు. 'రైల్వే పరీక్షల గురించి కేంద్ర ప్రభుత్వం ఒక్క మాట కూడా మాట్లాడలేదు. ఉద్యోగ కల్పన గురించి బ్జడెట్‌లో ఎలాంటి ప్రతిపాదన చేయలేదు. ప్రతి రాష్ట్రంలో యువత ఉద్యోగాల కోసం ఎదురు చూస్తున్నారు. కానీ ప్రభుత్వం వారికి ఉద్యోగాలు కల్పించడంలో విఫలమైందని రాహుల్ విమర్శించారు.

# రాజ్యాంగ పదవుల్లో ఉంటూ అపహాస్యం చేస్తారా

మొదటిపేజీ తరువాయి..

సీఎం కేసీఆర్, తెరాస నాయకులంతా విష ప్రచారం చేస్తున్నారు. కేంద్ర బడ్జెట్‌పై ప్రజలను తప్పుదారి పట్టించేందుకు యత్నిస్తున్నారు. నలుగురిని ఆకట్టుకునేలా మాట్లాడితే అబద్దాలు నిజం కావన్నారు. . సీఎం విషయంలో అభద్రతా భావం స్పష్టంగా కనిపిస్తోంది. రాజ్యాంగ పదవిలో ఉండి రాజ్యాంగాన్ని మార్చాలని సీఎం చెబుతున్నారు. సీఎం ప్రకటన పట్ల రాజకీయాలకు అతీతంగా ఖండించాలని కిషన్ రెడ్డి అన్నారు. బడ్జెట్‌పై ప్రజలను తప్పుదారి పట్టించేందుకు కేసీఆర్ యత్నిస్తున్నారని.. భాజపా నాయకత్వంపై విష ప్రచారం చేస్తున్నారని దుయ్యబట్టారు. రాష్ట్రం ఇచ్చిన హామీలు ఎంత వరకు పూర్తి చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి కేసీఆర్ చేసిన వ్యాఖ్యలపై కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తీవ్రంగా స్పందించారు. ముఖ్యమంత్రి స్థాయి ఇలా రాజ్యంగా వ్యవస్థలను అవమానపరిచే విధంగా మాట్లాడడం సరికాదన్నారు. తెలంగాణ ప్రభుత్వ వైఫల్యాలను దాచిపెట్టేందుకు సీఎం కేసీఆర్ రెండున్నర గంటలు ఏకాపాత్రాభినయం చేశారని దుయ్యబట్టారు. ప్రజలను ఆకట్టుకుని మాట్లాడినంత మాత్రాన అబద్దాలు నిజాలు కావాని స్పష్టం చేశారు. కేంద్రాన్ని విమర్శిస్తున్న సీఎం కేసీఆర్ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలు ఏమేరకు అమలు పరిచారో చెప్పాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగ బద్ధమైన పదవిలో ఉన్న కేసీఆర్.. అంబేద్కర్ అవమానించేలా మాట్లాడటం దురదృష్టకర మన్నారు. కనీసం సెక్రటరీయట్ కూడా వెళ్లని సీఎం.. దేశంలో గుణాత్మకమైన మార్పు తీసుకువస్తారని చెప్పడం హాస్యాస్పదంగా ఉందని కిషన్ రెడ్డి విమర్శించారు. ప్రధాని మోడీ పట్ల శత్రుదేశం పాకిస్తాన్ కూడా మాట్లాడని విధంగా సీఎం కేసీఆర్ మాట్లాడడం చాలా బాధకరంగా ఉందని చెప్పారు. తెలంగాణలో ధర్నా చౌక్ ఎత్తివేసిన సీఎం రైతుల ఉద్యమం గురించి మాట్లాడతారా అంటూ ప్రశ్నించారు. సంవత్సర కాలం పాటు రైతులు ఉద్యమం చేసినా వారికి అన్ని సౌకర్యాలు కల్పించామని, రాష్ట్ర ప్రభుత్వ అవినీతిని ప్రశ్నిస్తున్న జర్నలిస్టులను సైతం జైల్లో పెట్టించిన ఘనత సీఎం కేసీఆర్‌దని దుయ్యబట్టారు. ఈ సంధర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన అనేక హామీలను ఎందుకు అమలు చేయాలేదని ప్రశ్నించారు. రైతులకు అన్యాయం చేస్తున్నారని చెప్పిన రాష్ట్ర ప్రభుత్వం యూరియాపై ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని అన్నారు. కేంద్రం యూరియా కోసం లక్ష కోట్ల రూపాయలు కేటాయింపులు చేసిందన్నారు. ఈ సబ్సీడి గత సంవత్సరం కంటే 33 శాతం ఎక్కువని అన్నారు.

# కేసీఆర్ వ్యాఖ్యలపై ఎందుకీ ఉలికిపాటు

మొదటిపేజీ తరువాయి..

వచ్చిందని బుధవారం నాడిక్క మీడియా సమావేశంలో అన్నారు. కేంద్రం ప్రవేశపెట్టిన వార్షిక బడ్జెట్‌లో ఎస్సీ, ఎస్టీలకు చేసిన కేటాయింపులపై టీఆర్ఎస్ ఎమ్మెల్సీ కడియం శ్రీహరి విమర్శలు చేశారు. ఎస్సీ, ఎస్టీలకు రాష్ట్ర ప్రభుత్వం పెట్టినంత బడ్జెట్ కూడా కేంద్రం కేటాయించలేదని ఆయన ఆరోపించారు. దేశంలో షెడ్యూల్ క్యాస్ట్‌కు చెందినవారు 28 శాతం ఉంటే కేంద్ర ప్రభుత్వం రూ.20వేల కోట్లు కేటాయించిం దని.. అదే దళితబంధు కోసం ఒక్క తెలంగాణ ప్రభుత్వం రూ.25వేల కోట్లు ఖర్చుపెడుతోందని కడియం శ్రీహరి వివరించారు. బీజేపీకి చేతనైతే దళిత బంధును దేశమంతా అమలు చేయాలని సవాల్ విసిరారు.

కేంద్ర ప్రభుత్వ విధానాల వల్ల దేశంలో ధనికులు మరింత ధనికులుగా.. పేదవారు మరింత పేదవారుగా మారుతున్నారని కడియం శ్రీహరి ఆవేదన వ్యక్తం చేశారు. బీజేపీ నేతలు చిల్లర మాటలు మాట్లాడు తున్నారని ఇప్పటివరకు విభజన చట్టం హామీలు నెరవేర్చలేదని మండిపడ్డారు. సమ్మక్క సారక్క జాతరను జాతీయ పండగగా గుర్తించాలని అడిగితే ఇప్పటివరకు స్పందించలేదని.. బీజేపీ నేతలు చేతగాని సన్నాసులు అని విమర్శించారు. అంబేద్కర్ గురించి మాట్లాడే అర్హత బీజేపీ నేతలకు లేదన్నారు. రాజ్యాంగంపై కేసీఆర్ చేసిన వ్యాఖ్యలతో బీజేపీ నేతల్లో వణుకు మొదలైందని వ్యాఖ్యానించారు. అనవసరంగా నోరు పారేసుకుంటే బీజేపీ నేతలను తెలంగాణ ప్రజలు తరిమికొడతారని కడియం శ్రీహరి జోస్యం చెప్పారు. రాజ్యాంగం విషయంలో సీఎం తప్పు మాట్లాడినట్లు విమర్శిస్తున్నారని.. కానీ దేశం అభివృద్ధి చెందాలంటే రాజ్యాంగాన్ని మళ్లీ రచించుకోవాలన్నారు. అంబేద్కర్ రచించిన రాజ్యాంగానికి అనేక సవరణలు జరిగాయన్నారు. దేశ అవసరాలను దృష్టిలో పెట్టుకుని రాజ్యాంగానికి సవరణలు చేశారని ఆయన గుర్తు చేశారు. అంబేద్కర్ నిజమైన వారసులం తామేనన్న కడియం శ్రీహరి.. విమర్శలు చేసే భాజపా నేతలు గాడ్సే వారసులని ఆరోపించారు. అంబేద్కర్ పేరు ఎత్తేందుకు కూడా వారు అర్హులు కాదన్నారు. అంబేద్కర్ స్ఫూర్తి, ఆశయాలను భాజపా ముందుకు తీసుకెళ్లలేదని ఆరోపించారు. రాజ్యాంగానికి అడుగడుగునా తూట్లు పొడిచారని మండిపడ్డారు. దేశ సంపద లూటీ చేసిన వాళ్లకు దోచి పెడుతున్నారని ఆయన ఆరోపించారు.దేశంలో అసమానతలు పెరుగుతున్నాయని ఆయన అన్నారు. దేశంలో ఎస్సీ జనాభా 19, ఎస్టీ జనాభా 9 శాతం ఉందన్న ఆయన.. కేంద్ర బ్జడెట్‌లో ఎస్సీలకు తీవ్ర అన్యాయం చేశారని మండిపడ్డారు. దళితుల కోసం రాష్ట్ర బ్జడెట్‌లో దళితబంధు కోసం తెలంగాణ సర్కారు రూ.25 వేల కోట్లు పెట్టబోతోందని తెలిపారు. ఎస్సీలు, ఎస్టీలకు బ్జడెట్‌లో రూ.35 వేల కోట్లు పెట్టబోతున్నామన్నారు. విభజన హామీలను కూడా భాజపా ప్రభుత్వం నెరవేర్చలేదని ఆయన ధ్వజమెత్తారు. ముఖ్యమంత్రి కేసీఆర్ లేవనెత్తిన అంశాలపై సమాధానం చెప్పారా అంటూ భాజపా నేతలను కడియం శ్రీహరి ప్రశ్నించారు. అయితే, కేసీఆర్ వ్యాఖ్యలపై ఆందోళన దేనికి అని ప్రశ్నించారు ప్రభుత్వ విప్ బాల్క సుమన్.. దేశానికి ఏం కావాలో అది కేసీఆర్ చెప్పారన్న ఆయన.. కాంగ్రెస్, బీజేపీ ప్రభుత్వాలు దేశాన్ని అర్థం చేసుకోవడంలో విఫలం అయ్యాయని విమర్శించారు.. ఇక, దేశానికి కొత్త రాజ్యాంగం అవసరం అని మాత్రమే సీఎం కేసీఆర్ అన్నారని.. కేసీఆర్ మాట్లాడిన తెల్లారికే రాజ్యాంగం మారిపోయినట్టు కాచుకు కూర్చున్నారంటూ మండిపడ్డారు.. కేసీఆర్ ఆలోచన సమాజం ముందు పెట్టారు.. దానిపై చర్చ పెట్టాలి.. కానీ, ఆందోళనలు ఎందుకు అని అని ప్రశ్నించారు. ఇక, కేసీఆర్ ఆలోచనపై చర్చ చేయడం ఇష్టం లేని వాళ్లు, చర్చ పక్కదోవ పట్టించే చిల్లర ప్రయత్నం చేస్తున్నారని ఎమ్మెల్యే క్రాంతి మండిపడ్డారు. మారిన పరిస్థితుల నేపథ్యంలో చర్చ చేయాలి, డైనమిక్ గా ఉండాలన్నారు. 105 సార్లు రాజ్యాంగ సవరణ చేసింది బీజేపీ..కాంగ్రెస్ కాదా..? అని ప్రశ్నించిన ఆయన.. అంబేద్కర్ విధానం అమలుకు నోచుకోక దళితుల మీద దాడులు చేస్తుంది బీజేపీ కాదా.. అని మండిపడ్డారు.. కేసీఆర్ చర్చ పెట్టిన వెంటనే రాజ్యాంగం మారిందా? అని ప్రశ్నించిన ఆయన రాజ్యాంగ ఫలాలు పేదలకు అందకపోతే నేనే రాజ్యాంగం తగలబెడ్త అని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాజ్యసభలో చెప్పిన మాటలు వినాలని సూచించారు.. ఇక, రాజ్యాంగం సమీక్ష చేయాలని కమిషన్ వేసింది బీజేపీ అన్న విషయం మరచి పోయారా అన్నారు.


# రామానుజ జపంతో మార్మోగిన ముచ్చింతల్

మొదటిపేజీ తరువాయి..

వేడుకలు వేదోక్తంగా ప్రారంభమయ్యాయి. రామానుజచార్యుల సహస్రాబ్ది సమారోహ ఉత్సవాల్లో భాగంగా జీయర్ ఆస్పత్రి ప్రాంగణం నుంచి యాగశాల వరకు శోభాయాత్ర నిర్వహించారు. ముచ్చింతల్‌లో రామానుజా చార్యుల సహస్రాబ్ది వేడుకలు బుధవారం ప్రారంభమయ్యాయి. సహస్రాబ్ది వేడుకల్లో భాగంగా శోభాయాత్ర కు వేలాదిగా భక్తులు తరలివచ్చారు. ఈ కార్యక్రమానికి జీయర్ స్వాములు, రుత్వికులు హాజరయ్యారు. ఈ సహస్రాబ్ది వేడుకలు 12 రోజులపాటు సాగనున్నాయి. ఈ వేడుకలకు 7 వేల మంది పోలీస్ సిబ్బందితో భద్రత ఏర్పాట్లు చేశారు. 45 ఎకరాల విస్తీర్ణంలో రూ.12 వేల కోట్లతో సమతామూర్తి స్ఫూర్తి కేంద్రం నిర్మాణం చేశారు. ముచ్చింతల్‌లో చినజీయర్ స్వామి సమక్షంలో జరిగిన శోభాయాత్రలో పలువురు మఠాధిపతులు,రుత్వికులు, వాలంటీర్లు పాల్గొన్నారు. శ్రీ రామానుజాచార్య సహస్రాబ్ది సమారోహం నేటినుంచి ఫిబ్రవరి 14 వరకు జరగనున్న ఈ వేడుకల్లో.. సమతామూర్తి స్ఫూర్తి కేంద్రాన్ని జాతికి అంకితం చేయనున్నారు. 216 అడుగుల ఎత్తున నిర్మించిన రామానుజాచార్య విగ్రహాన్ని వైభవంగా ఆవిష్కరించ నున్నారు. స్వయంగా త్రిదండి చినజీయర్ స్వామి పర్యవేక్షణలో ఈ సహస్రాబ్ది వేడుకలు జరుగుతు న్నాయి. వేడుకల్లో సేవలందించేందుకు వికాస తరంగిణి సంస్థ ఆధ్వర్యంలో సుమారు 12 వేల మంది వాలంటీర్లు వివిధ దశల్లో భక్తులకు సేవలందిస్తున్నారు. బుధవారం నుంచి ఉత్సవాల్లో అత్యంత కీలకమైన హోమాలు ప్రారంభం అయ్యాయి. ప్రతి రోజు సాయంత్రం 5 గంటల నుంచి అరగంట పాటు విష్ణు సహస్రనామ పారాయణం ఉంటుంది. సాయంత్రం ఐదున్నర గంటల నుంచి ఏడున్నర గంటల వరకు ముఖ్య అతిథుల ప్రసంగాలు ఉంటాయి. ఆ తర్వాత రాత్రి తొమ్మిదిన్నర గంటల వరకు సాంస్కృతిక కార్యక్రమాలు కొనసాగుతాయి. 12 రోజుల మహాక్రతువు లో ప్రధానమైన యాగశాలలో 1035 కుండాలలో మహాయజ్ఞం జరగుతుంది. ఈ మహాయాగాన్ని 5 వేల మంది రుత్వికులు నిర్వహిస్తున్నారు. వీరంతా... తమిళనాడు, మహారాష్ట్ర, ఉత్తర్‌ప్రదేశ్, కేరళ, కర్ణాటక సహా అమెరికా నుంచి వచ్చారు. యాగానికి అవసరమైన పదివేల పాత్రలను రాజస్థాన్ నుంచి తెప్పించారు. యాగశాలను.. వాలంటీర్లు అందమైన రంగవల్లులతో తీర్చిదిద్దారు. పోలీసులు పూర్తిగా సమతామూర్తి కేంద్రాన్ని తమ ఆధీనంలోకి తీసుకున్నారు. భద్రత, భక్తుల సేవ కార్యక్రమాలపై పోలీసులు ఉన్నతాధికారులు, సిబ్బందితో సమీక్షించిన చిన్నజీయర్ స్వామి.. పోలీసులు, వాలంటీర్లు సమన్వయంతో కలిసి పనిచేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రాంగణంలో వైద్య ఆరోగ్యశాఖ మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేసింది. అమెరికాలోని 15 రాష్ట్రాలతో పాటు.. ఆంధ్రప్రదేశ్, తెలంగాణలోని 20 జిల్లాలు సహా మరో 18 రాష్ట్రాల నుంచి సేవకులు వచ్చారు. యాగశాల, సమతామూర్తి విగ్రహం, ఆహారశాలలు, మరుగుదొడ్లు వంటి వేర్వేరు చోట్ల వాలంటీర్లు సేవలు అందించనున్నారు. శ్రీరామానుజాచార్య సహస్రాబ్ది సమారోహానికి రాష్ట్రపతి, ప్రధాని సహా ముఖ్య అతిథులు హాజరుకానున్న వేళ... ప్రత్యేక హెలిప్యాడ్‌ను సిద్ధం చేశారు. శంషాబాద్ విమానాశ్రయం నుంచి రోడ్డు మార్గం లేదా హెలికాప్టర్‌లో వచ్చే అవకాశాలు ఉండటంతో రెండు మార్గాలను అధికారులు సిద్ధం చేస్తున్నారు. గొల్లపల్లి వద్ద విమానాశ్రయం వెనకభాగంలో ఉన్న గోడను తొలగించిన అధికారులు... వీఐపీ మార్గాన్ని మూడు వరుసల్లో సిద్ధం చేస్తున్నారు. వీవీఐపీ మార్గంలోని పల్లెల్లో కొత్త కళ సంతరించుకుంది. నిన్నమొన్నటి వరకు సింగిల్ రోడ్డుగా ఉన్న మార్గాలన్నీ నాలుగు వరుసలుగా వెడల్పు చేయటం, కొత్త రోడ్లు వేయడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ నెల 5న ప్రధాని మోదీ, 13న రాష్ట్రపతి రాంనాథ్ కొవింద్ ముచ్చింతల్ రానున్నారు. వీవీఐపీ మార్గంతో పాటు జీవా ప్రాంగణం సమతామూర్తి కేంద్రం వద్ద సర్కార్ పటిష్టమైన భద్రతను ఏర్పాటు చేసింది.

## రాజ్యాంగం మార్చాలనడం మూర్ఖత్వం

**కేసీఆర్ ప్రకటనపై మండిపడ్డ కోదండరామ్**
**తప్పులు కప్పిపుచ్చుకునేందుకే అని వ్యాఖ్య**
**317 జీవోను మార్చాల్సిందే అని డిమాండ్**
**ఉద్యోగాల భర్తీ దయాదాక్షిణ్యం కాదని హెచ్చరిక**
**కేసీఆర్ వ్యాఖ్యలపై మందకృష్ణ ఆగ్రహం**
**ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసిన కేసీఆర్**
**మూర్ఖుల నుంచి రాజ్యాంగాన్ని కాపాడుకోవాలి**
**బిఎస్పీ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ విమర్శలు**
**అంబేద్కర్ రాజ్యాంగానికి కేసీఆర్ అవమానం**
**సీఎంగా కొనసాగే నైతిక హక్కుకెసిఆర్‌కు లేదు**
**దుబ్బాక బీజేపీ ఎమ్మెల్యే రఘునందన్ రావు**



హైదరాబాద్,ఫిబ్రవరి2: రాజ్యాంగాన్ని మార్చాలన్నసిఎం కెసిఆర్ వ్యాఖ్యలపై తీవ్రనిరసనలు వ్యక్తం అవుతున్నాయి. అంబేద్కర్‌ను కెసిఆర్ అవమానిస్తున్నారని పలువురు నేతలు మండిపడ్డారు.

మరోసారి రాజ్యాంగం మారుస్తామనే చర్చ తెస్తే తీవ్ర నిరసన ఎదుర్కోవాల్సి వస్తుందని టీజేఎస్ అధ్యక్షుడు కోదండరాం హెచ్చరించారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ పోరాటాలతో తెచ్చుకున్న రాజ్యాంగం మార్చి ఏ రాజ్యాంగం తెస్తా అనుకుంటున్నారని ప్రశ్నించారు. ఈ కుట్రలకు వ్యతిరేకంగా పోరాటాలు ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. 317 జీవోను సవరించాలని డిమాండ్ చేశారు. ఫ్యూడల్ ఆలోచనలు ఉన్న కేసీఆర్‌కు ఈ రాజ్యాంగం ఏం అర్థం అవుతుందని యెద్దేవా చేశారు. నిరంకుశ పాలనకు చట్టబద్ధత కల్పించాలని రాజ్యాంగం మార్పు చేస్తాం అంటున్నారని ఆయన మండిపడ్డారు. ప్రజాస్వామిక.. అరాచక పాలనను ఎదుర్కునేందుకు త్వరలోనే ప్లీనరీ నిర్వహించుకుని.. తీర్మానాలు చేయనున్నట్లు తెలిపారు. ఇరిగేషన్ సెక్రటరీ రజత్‌కుమార్‌పై వచ్చిన ఆరోపణలపై ఎందుకు విచారణ చేయడం లేదని ప్రశ్నించారు. కూడబలుక్కుని విలాసాలు.. విందులకు ఖర్చు చేస్తా అంటే చూస్తూ ఊరుకోమని ఆయన అన్నారు. బడ్జెట్ కరోనా తరువాత ఆర్థిక అసమానతలు పెంచేలా ఉ ందన్నారు. పేదరికాన్ని నిర్మూలిం చేందుకు బ్జడెట్ రావాల్సి ఉందని చెప్పుకొచ్చారు. మనుషుల మధ్య అంతరాలు తొలగించేందుకు రాజ్యాంగం ఉపయోగ పడుతుందని అంబేద్కర్ చెప్పారని టీజేఎస్ అధినేత గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వంను తిడుగుతున్నట్టు కనిపించే కేసీఆర్ అదే పంథాను రాష్ట్రంలో అమలు చేస్తున్నారని వ్యాఖ్యానించారు. రాజ్యాంగం మారాలని చెప్పడాన్ని తీవ్రంగా ఆక్షేపిస్తున్నట్లు తెలిపారు. ఎప్పుడు ప్రజలకు ముఖ్యమంత్రి అందుబాటులో ఉ ండరని... ప్రజలు అణిచివేతకు గురవుతున్నారని అన్నారు. భూ నిర్వాసితులకు న్యాయం చేయకుండా లాఠీ చార్జి చేశారన్నారు. ముఖ్యమంత్రికి చెప్పుకుందాం అని బయలుదేరితే మధ్యలోనే అడ్డుకుని అరెస్టు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మల్లనసాగర్ బాధితులను 144 సెక్షన్ పెట్టి లాఠీ ఛార్జ్ చేయించారని ఆరోపించారు. యువకులు ఉ ద్యోగాలు కోసం పోరాటం చేస్తే పట్టించుకోలేదన్నారు. పీజీ.. పీహెచ్డీ చేసిన వారు ఖాళీగా ఉన్నారని తెలిపారు. 50 వేల ఉద్యోగాలు ఇస్తా అంటున్నారని.. దానమా ధర్మమా అని ప్రశ్నించారు. ఎన్ని ఖాళీలు ఉంటే అన్ని భర్తీ చేయాల్సిందే అని ఆయన తేల్చిచెప్పారు. ఇప్పటికీ బతుకు దెరువు లేక దబాయ్.. ముంబాయి పోయి అవస్థ పడుతున్నారన్నారు. కేసీఆర్ రాజ్యాంగం రాస్తా అంటే అది నిరంకుశ రాజ్యాంగం అయి ఉంటుందని విమర్శించారు. అడ్డగోలుగా జిల్లాలు ఏర్పాటు చేసారని.. ఆ తప్పుని కప్పిపుచ్చు కోవడం కోసం స్థానికత అంటున్నారని మండిపడ్డారు. స్థానికతకు గుర్తింపు లేకుండా చేసేందుకే 317 జీవో అని అన్నారు. ఉద్యోగులు నీ సెక్యూరిటీ గార్డులు కాదు.. నీ ఫాం హౌస్‌లో కూలీలు కాదని అన్నారు. 317జీవో రాజ్యాంగ విరుద్ధమని.. ప్రజాస్వామిక విలువలకు తూట్లు పొడిచారని కోదండరాం వ్యాఖ్యలు చేశారు. రాజ్యాంగంపై సీఎం కేసీఆర్ చేసిన వ్యాఖ్యలకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ డిమాండ్ చేశారు. ఇది అహంకారంతో కూడుకున్న వ్యాఖ్యలని, అంబేద్కర్‌ను అవమానించడమేనని అన్నారు. ఖమ్మం ప్రెస్‌క్లబ్‌లో మంద కృష్ణ మాదిగ ప్రెస్ మీట్ నిర్వహించారు. సీఎం కేసీఆర్ రాజ్యాంగ పై చేసిన వ్యాఖ్యలకు నిరసనగా నుండి ఈ నెల 10వ తేదీ వరకు అంబేద్కర్ విగ్రహాల వద్ద నిరసనగా కార్యక్రమలు చేపడతామన్నారు. సీఎం కేసీఆర్ తో రాజ్యాంగ పై చర్చించేందుకు , ఎమ్మార్పీఎస్ సిద్ధంగా ఉందన్నారు. పాలకులు వైఫల్యాలను, రాజ్యాంగంపై ఆపాదించడం సీఎం కేసీఆర్ నిరంకుశత్వానికి నిదర్శనమన్నారు. సీఎం కేసీఆర్ ఒక నియంతృత్వ రాజ్యాంగాన్ని తీసుకురావటానికి ముందు వరుసలో ఉన్నారని మందకృష్ణ విమర్శించారు.భారత రాజ్యాంగాన్ని మార్చాలంటూ కేసీఆర్ చేసిన వ్యాఖ్యలపై బెస్పీ నేత,మాజీ ఐపిఎస్ ఆర్ ఎస్ ప్రవీణ్ కుమార్ మండిపడ్డారు. కేసీఆర్ లాంటి మూర్ఖపు నాయకుల నుండి రాజ్యాంగాన్ని కాపాడుకోవాలన్నారు. ముఖ్యమంత్రి కేసీఆరే రాజ్యంగంపై చేసిన వ్యాఖ్యలు ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసే విధంగా ఉ న్నాయన్నారు. ఎంతో మంది మహనీయుల త్యాగాలతో రాజ్యాంగ రూపొందించిందన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ తన ఆస్తులు , కమిషన్లు పెంచుకునేందుకే రాజ్యాంగాన్ని మార్చలనుకుంటున్నారా? అంబేద్కర్ రచించిన రాజ్యాంగం కారణంగానే తెలంగాణ రాష్ట్ర ఏర్పడి , ఆయన ముఖ్యమంత్రి అయిన విషయాన్ని మరిచిపోయారన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ యావత్ దేశ ప్రజలకు క్షమాపణలు చెప్పాలన్నారు. ఆయన వ్యాఖ్యలకు నిరసనగా రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలను ఉధృతం చేస్తామన్నారు. భారత రాజ్యాంగంలో ఉన్న ఆర్టికల్ 3 వల్లనే తెలంగాణ ఏర్పడిందన్నారు. ఎందుకు భారత రాజ్యాంగాన్ని మార్చాలో దేశ ప్రజలకు కేసీఆర్ చెప్పాలన్నారు. ముఖ్యమంత్రి పదవికి కేసీఆర్ అనర్హుడు అంటూ ఆయన మండిపడ్డారు. కాళేశ్వరం లో లక్ష 15 వేల కోట్ల రూపాయలు ఒకటే కంపెనీకి ఇచ్చి తిరిగి దొడ్డిదారిన కేసీఆర్ సంపాదిస్తున్నాడని విమర్శించారు. ఒక ఎం÷ూ ఇంట్లో ఒక కార్యక్రమానికి మెగా సంస్థ 50 లక్షల రూపాయలు ఇచ్చారని ఆరోపణలు చేశారు ప్రవీణ్ కుమార్. కొన్ని జీవోలు రహస్యంగా తీసుకొస్తున్నారన్నారు. ప్రజల సొమ్ముతో కట్టిన ప్రగతిభవన్ కి ఎవరినీ రానివ్వడం లేదని విమర్శించారు. లక్షలాది ఎకరాల అసైన్డ్ భూములను లాక్కొని మీకు సంబంధించిన వాళ్ళకి కట్టబెట్టడానికా రాజ్యాంగాన్ని మార్చాలంటున్నారు? అంటూ నిలదీశారు. బీజేపీ బాహాటంగా ముస్లింలను ఏరివేయలని ప్రకటించిందన్నారు. నిరంకుశ పాలన కొనసాగించడానికే రాజ్యాంగాన్ని మార్చాలంటున్నారా? అంటూ కేసీఆర్ వైఖరిపై మండిపడ్డారు. రాజ్యాంగం పవిత్రమైనది... రాజ్యాంగాన్ని సవరించాల్సి వచ్చినపుడు చట్టసభల ద్వారా మారుస్తున్నారన్నారు. దేశవ్యాప్తంగా ప్రజలంతా ఏకమై రాజ్యాంగాన్ని కాపాడుకోవాలన్నారు. కేసీఆర్ బాధ్యతరహితమైన ప్రకటనలు మానుకొని అంబేద్కర్ విగ్రహం దగ్గరికి వచ్చి దేశ ప్రజలకు క్షమాపణలు చెప్పాలని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ డిమాండ్ చేశారు. కేసీఆర్ క్షమాపణ చెప్పేవరకు రాష్ట్రవ్యాప్తంగా బీఎస్పీ తరపున ఆందోళనలు నిర్వహిస్తున్నా మన్నారు. రిటైర్డ్ ఐఏఎస్‌లతో కేసీఆర్ మీటింగ్ పెడతా అంటున్నారు... దానికి తనను ఆహ్వానిస్తే అస్సలు వెళ్ళనని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు. అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని సీఎం కేసిఆర్ అవహేళన చేస్తూ మాట్లాడడం తగదని దుబ్బాక బీజేపీ ఎమ్మెల్యే రఘునందన్ రావు అన్నారు. రాజ్యాంగం పట్ల విశ్వాసం లేని వ్యక్తి ఒక్క నిముషం కూడా సీఎం కుర్చీలో కూర్చోవద్దన్నారు. దుబ్బాకలో సిఎం కేసీఆర్ దిష్టి బొమ్మను బీజేపీ నాయకులు దగ్ధం చేశారు. సిద్దిపేట పట్టణంలోని శివాను భవమండపంలో ప్రధాని మోడీ వర్చువల్ ప్రసంగాన్ని బీజేపీ నాయకులతో కలసి దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్ రావు వీక్షించారు. 0వేల పుస్తకాలు చదివిన వ్యక్తికి ఏం మాట్లాడాలో కూడా తెలవడం లేదని ఎమ్మెల్యే రఘునందన్ రావు ఆందోళన వ్యక్తం చేశారు. కేసీఆర్ భాష సభ్య సమాజం తలదించుకునేలా ఉందన్నారు. ప్రధానిపై కేసీఆర్ మాట్లాడిన భాష అభ్యంతరకరమని.. దేశ యువత కేసీఆర్ వ్యాఖ్య ల పై నిరసన తెలపాలని కోరారు.

÷రిత్త రాజ్యాంగాన్ని రాయాలన్న కేసీఆర్ వ్యాఖ్య లపై కమ్యునిస్ట్ నాయకులు స్పందించాలని ఆయన డిమాండ్ చేశారు. రాజ్యాంగంలో ఆర్టికల్ 3లేకుంటే తెలంగాణ రాష్ట్రం ఎలా వచ్చిందని ఎమ్మెల్యే రఘునందన్ రావు ప్రశ్నించారు. కేసీఆర్‌కు ప్రధాని కావాలనే కోరిక ఉంటే ప్రజలను ఒప్పించుకోవాలి కానీ బూతు పురాణం ద్వారా కాదని హితవు పలికారు. కేసీఆర్‌కి ప్రజలపై, వ్యవస్థలపై దేనిపై కూడా విశ్వాసం లేదన్నారు. డీజీపీ మహేందర్ రెడ్డి సీఎం కేసీఆర్ పై దేశ ద్రోహం కేసు పెట్టాలని ఎమ్మెల్యే రఘునందన్ రావు డిమాండ్ చేశారు. ప్రధానిపై అసభ్యంగా మాట్లాడిన వ్యక్తిపై సుమొటోగా కేసు నమోదు చేయాలన్నారు. కేంద్రం ఎన్ ఆర్ ఈ జి ఎస్ నిధులను జిల్లాకు 53కోట్లు మంజూరు చేస్తే అన్ని నియోజక వర్గాలకు సమానంగా ఎందుకు పంచలేదని ఆయన నిలదీశారు. మోడీ గుజరాత్ కి మాత్రమే ప్రధాని అయితే తెలంగాణ ట్రైబల్ యూనివర్సిటీకి 44కోట్లు ఎలా వచ్చాయి ? అని ఆయన నిలదీశారు. కేసీఆర్ వెంటనే రాజ్యాంగాన్ని రాసిన అంబేద్కర్ కి క్షమాపణ చెప్పాలని ఎమ్మెల్యే రఘునందన్ రావు డిమాండ్ చేశారు.

## అత్యుత్తమ టూరిజం పాలసీ రూపొందించాలి

**తెలంగాణలో అనేక పర్యాక కేంద్రాలు ఉన్నాయి**
**అధికారులతో సమీక్షలో మంత్రి శ్రీనివాసగౌడ్ ఆదేశాలు**

హైదరాబాద్,ఫిబ్రవరి2: ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాల మేరకు అత్యుత్తమ టూరిజం పాలసీనీ రూపొందించటానికి టూరిజం అధికారులు తగిన ప్రతిపాదనలు, ప్రణాళికలను సిద్ధం చేయాలని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్ టూరిజం అధికారులకు దిశానిర్దేశం చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు రాష్ట్రంలో పర్యాటక రంగం అభివృద్ధికి అనేక కార్యక్రమాలు చేపట్టామన్నారు. తెలంగాణ రాష్ట్రం లో అద్భుతమైన పర్యాటక ప్రదేశాలు ఉన్నాయన్నాయి. బుధవారం తన కార్యాలయంలో రాష్ట్రంలో టూరిజం అభివృద్ధి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన అతికొద్ది సమయంలోనే రెండు అంతర్జాతీయ స్థాయి అవార్డుల ను సాధించాము. తెలంగాణ రాష్ట్రం లో ఇంటర్నేషనల్ స్టాండర్డ్ లో పర్యాటకులను రాష్ట్రానికి ఆకర్షించేందుకు, విదేశీ పర్యాటకులు రాష్ట్రాన్ని సందర్శించేందుకు టూరిజం అధికారులు తగిన ప్రణాళికలు రూపొందించాలన్నారు. దేశంలోనే అత్యుత్తమ టూరిజం పాలసీని రూపొందించేందుకు టూరిజం అధికారులు అవసరమైన ప్రతిపాదనలు, ప్రణాళికలను రూపొందించాలని మంత్రి శ్రీనివాస్ గౌడ్ పర్యాటక శాఖ అధికారులను ఆదేశించారు. టూరిజం పాలసీ రూపకల్పన పై టూరిజం అధికారులు వివిధ టూరిజం నేపథ్యంలో ఉన్న దేశాలైన సింగపూర్, మలేసియా, దుబాయ్ లాంటి దేశాల్లో ఉన్న పాలసీలను పరిశీలించాలన్నారు. ÷శంలోని వివిధ రాష్ట్రాలైనా గోవా, కేరళ లాంటి రాష్ట్రాల టూరిజం పాలసీలను పరిశీలించి, అధ్యయనం చేసి, తెలంగాణ రాష్ట్రం లో అత్యుత్తమ టూరిజం పాలసీ డ్రాఫ్ట్ రూపకల్పన పై దృష్టి సారించాలని మంత్రి అధికారులకు సూచించారు. రాష్ట్రంలో ట్రైబల్, ఎకో, మెడికల్, టెంపుల్, హెరిటేజ్ టూరిజం ఉందన్నారు. తెలంగాణ రాష్ట్రం లో ఉన్న పర్యాటక ప్రదేశాలను పర్యాటకుల దృష్టికి తీసుకెళ్లేలా తగిన ప్రచారం నిర్వహించేలా కార్యక్రమాలు పాలసిలో ఉండేలా మంత్రి అధికారులకు దిశానిర్దేశర చేశారు.



కరీంనగర్ జిల్లా తెరాస అధ్యక్షులుగా నియమింపబడిన జీ.వి. రామకృష్ణారావును కలిసి శుభాకాంక్షలు తెలిపిన మహదేవ్ పూర్ విజయ్ కుమార్, పూసల సాయి రామ్ (మున్నా), అనంతుల రమేశ్ పటేల్

## ఖాళీ ఉద్యోగాలు పూరించాలని బిజీవైఏం నిరసన

**ధర్మపురి ఫిబ్రవరి 02 (ప్రజామంటలు):** రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయాలని, నిరుద్యోగ భృతి ఇవ్వాలని రాష్ట్ర బిజేపి శాఖ పిలుపు మేరకు కోటి సంతకాల కార్యక్రమంలో భాగంగా ధర్మపురి బిజీవైఏం పట్టణ శాఖ ఆద్వర్యంలో కోటి సంతకాల కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో బిజీవైఏం పట్టణ అధ్యక్షులు గాజు భాస్కర్, జిల్లా కార్యదర్శి పిల్లి శ్రీనివాస్, బీజేపీ పట్టణ అధ్యక్షులు



బెజ్జరపు లావణ్, బిజీవైఏం పట్టణ ప్రధాన కారుదర్శి మండలోజి సూరజ్, సంగి మాధవ్, ఉపాధ్యక్షుడు చితినొజి శ్రవణ్, మామిడి శ్రీనివాస్, కొండవేని నర్సింహులు, బీజేపీ, బీజేయం నాయకులు శేషి కుమార్, శ్యామరవ్ నాగులు, వేమన హిందూ, విల్లు, వికాస్, సీనియర్ నాయకులు ఆకుల శ్రీనివాస్, పానుగంటి రవి, స్తంభంకాడి శ్యామ్, అల్లం ప్రసాద్ మరియు తదితరులు పాల్గొన్నారు.

## కొండగట్టు ఆంజనేయ స్వామిని దర్శించుకున్న మంత్రి కొప్పుల, టిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు విద్యాసాగర్ రావు

**కొడిమ్యాల ఫిబ్రవరి 02 (ప్రజామంటలు):** జగిత్యాల జిల్లా కొండగట్టు ఆంజనేయ స్వామి ఈ క్షేత్రాన్ని తెలంగాణ రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల



ఈశ్వర్, నూతన ఎమ్మెల్సీగా ఎన్నికైన ఎల్. రమణ, టిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన కోరుట్ల ఎమ్మెల్యే కె. విద్యాసాగర్ రావు, చొప్పదండి శాసన సభ్యులు సుంకే రవిశంకర్, జడ్పీ చైర్మన్ దావ వసంత, కొడిమ్యాల మండల ఎంపీపీ స్వర్ణలత రాజ నరసింగరావు, మండల జెడ్ పి టి సి ప్రశాంతి కృష్ణారావు లు స్వామివారిని దర్శించుకున్నారు. అలాగే వీరితో పాటు కొడిమ్యాల మండల టిఆర్ఎస్ అధ్యక్షులు పులి వెంకటేష్, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, టిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ప్రజలు అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

## రాజ్యాంగం మార్చాలన్న కె.సి.ఆర్. వ్యాఖ్యలపై బిఎస్పీ నిరసన

**జనగామ ఫిబ్రవరి 02 (ప్రజామంటలు):** సిఎం కెసిఆర్ రాజ్యాంగానికి మార్చాలంటూ చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ జనగామలో బహుజన్ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం అంబేద్కర్ విగ్రహం ముందు నిరసన తెలిపారు. బి.జె.పి.



కనుసన్నల్లో ఆర్.ఎస్.ఎస్. అజెండా అమలు పర్చడానికే ఈ వ్యాఖ్యలు చేశారని నాయకులు ఈ సందర్భంగా ఆరోపించారు. ఈ కార్యక్రమంలో బి.ఎస్.పి. రాష్ట్ర కార్యదర్శి కటికల శ్రీహరి, జిల్లా కో ఆర్డినేటర్ నిర్మల రత్నం, జిల్లా అధ్యక్షుడు తాళ్లపల్లి వెంకటస్వామి, ప్రధాన కార్యదర్శి రంగు అనిల్ గౌడ్, కోశాధికారి కాల్వల దయా సాగర్, జిల్లా ఆర్గనైజేషన్ బస్వాగన్ల సిద్ధయ్య, మహిళా నాయకురాలు అల్లూరి సావిత్రి, జనగామ నియోజకవర్గ ఇంచార్జి జేరిపోతుల కుమార్, స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ ఇంచార్జ్ మడిపడిగ చంద్రశేఖర్, పాలకుర్తి నియోజకవర్గ ఇంచార్జ్ సోమరపు ఉపేందర్, స్టేషన్ ఘనపూర్ అధ్యక్షుడు ఆకారపు దేవన్న, జనగామ నియోజకవర్గ అధ్యక్షుడు తుర్కపల్లి కుమార్, జిల్లా నాయకులు గద్దె అనిల్ గౌడ్, పిడుగు ఉపేందర్, చింతల చేరతేజ్, మొకినపల్లి చక్రపాణి, ఆకారపు శరత్ పాల్గొన్నారు.

## అంగన్వాడీ కేంద్రంలో పౌష్టికాహారం పంపిణీ

**ఇబ్రహీంపట్నం ఫిబ్రవరి 02 (ప్రజామంటలు):** మండల పరిధిలోని వర్ష కొండ



గ్రామంలో అంగన్వాడి కేంద్రంలో మూడు నెలల పిల్లల నుండి ఏడు నెలల పిల్లల వరకు బాలామృతం, కోడి గ్రుడ్డు పంపిణీ చేసినారు. పిల్లలకు బాలామృతం ఉగ్గుపిండి తినిపించాలని తెలిపారు. మరియు పిల్లలందరికీ వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దొంతుల శ్యామల తుకారాం, అంగన్వాడీ టీచర్లు పద్మావతి, నీలిమ, గంగు, త్రివేణి, పాల్గొన్నారు.

# 2 కోట్ల 36 లక్షల విలువైన గంజాయి పట్టివేత

**జనగామ ఫిబ్రవరి 02 (ప్రజామంటలు):** ఆంధ్ర-ఒడిషా సరిహద్దు నుండి 2 కోట్ల 36 లక్షల విలువైన గంజాయిని డిసియం వ్యాన్లో హైదరాబాద్ కు తరలిస్తున్న ముఠా లోని ఇద్దరు నిందితులను టాస్క్ ఫోర్స్, లింగాల ఘన్ పూర్ పోలీసులు సంయుక్తంగా అరెస్టు చేసారు. అరెస్టు చేసిన ఇద్దరు నిందితుల నుండి పోలీసులు 2 కోట్ల 36 లక్షల 55 వేల రూపాయల విలువ గల 1577 కిలోల గంజాయితో పాటు ఒక డిసియం వ్యాన్, రెండు సెల్ ఫోన్ల పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు అరెస్టు చేసిన వారిలో అడుల ప్రభాకర్ రెడ్డి, తండ్రి పేరు శివారెడ్డి, వయస్సు 35, పెబ్బేరు గ్రామం కోల్లాపూర్ మండలం, మహబూబ్ నగర్ జిల్లా. ప్రస్తుతం జీడిమెట్ల, హైదరాబాద్ కు చెందిన వాడు కాగా మరో నిందితుడు నటేకర్ మహేష్, తండ్రి పేరు మల్లయ్య, వయస్సు 32, కర్నాటక రాష్ట్రం. ప్రస్తుత నివాసం బోరబండ, హైదరాబాద్ లో నివాసం వుంటున్నాడు. వీరితో పాటు గంజాయి అక్రమ రవాణాకు పాల్పడుతున్న మరో ఐదుగురు నిందితులైన ఖాజా (ప్రధాన నిందితుడు), జాన్, మల్లికార్జున్, కృష్ణ, సన్యాసిరావులు ప్రస్తుతం పరారీలో వున్నారు. ఈ అరెస్టుకు సంబంధించి వరంగల్ పోలీస్ కమిషనర్ డా. తరుణ్ జోషి వివరాలను వెల్లడిస్తూ ప్రస్తుతం పరారీలో వున్న ఖాజా గతంలోను ఆంధ్ర ఒడిషా సరిహద్దు ప్రాంతం నుండి రహస్యంగా గంజాయిని హైదరాబాద్ మీదుగా మహరాష్ట్రకు తరలించాడు. ఇదే తరహలో మరో మారు పెద్ద మొత్తంలో గంజాయిని మహరాష్ట్రకు తరలించేందుకుగాను సిద్ధపడ్డ ప్రధాన నిందితుడు ఖాజా హైదరాబాద్ కు చెందిన మల్లికార్జున్ అనే వ్యక్తికి సంబందించిన డిసియం వ్యాన్లో ఆంధ్ర ఒడిషా సరిహద్దు ప్రాంతంలోని సీలేరు నుండి గంజాయిని తరలించేందుకుగాను ప్రణాళికను రూపోందించు కున్నాడు. ఇందులో భాగంగా పోలీసులు ప్రస్తుతం అరెసు చేసిన డిసియం వ్యాన్ డ్రైవర్లు ప్రభాకర్ రెడ్డి, మహేష్ తో పాటు మరో నిందితుడు జత కల్సి రాజమండ్రిలోని అమలాపురం ప్రాంతంలో నిందితులు ముందుగా తమ డిసియం వ్యాన్లో 123 కోకాపీట్ కంపోస్ట్ బ్యాగ్లను వేయించుకోని అక్కడి నుండి సీలేరు ప్రాంతం నుండి 70 కిలోమీటర్ల దూరంలోని గుర్తు తెలియని ఆంధ్ర, ఒడిషా సరిహద్దు ప్రాంతానికి డిసియం వ్యాన్లో చేరుకున్న నిందితులు మరో ఇద్దరు నిందితులు వరుసకు తండ్రి కొడుకులైన కృష్ణ, సన్యాసిరావు ఇరువురు కల్సి రెండు కేజీల ప్యాకేట్ల చోప్పున మొత్తం 1577 కిలోల గంజాయి 56 బ్యాగులను డిసియంలో అనుకున్న ప్రకారం కోకాపీట్ కంపోస్ట్ బ్యాగుల క్రింది గంజాయి బ్యాగులను రహస్యంగా భద్రపర్చడం జరిగింది. తిరుగు ప్రయాణం నిందితుడు జాన్ అక్కడే ఉండిపోగా, మిగితా ఇద్దరు నిందితులు గంజాయి బ్యాగులను డిసిపి వ్యానులో రహస్యంగా డొంకరాయి, మోతుగూడెం, చింతూరు, భద్రాచలం, ఖమ్మం, తోర్రూర్,పాలకుర్తి, నెల్లుట్ల మీదుగా హైదరాబాద్ కు వెళ్ళుతున్నట్లుగా టాస్క్ ఫోర్స్ పోలీసులకు అందిన సమాచారం మేరకు నిన్నటి రోజు సాయంత్రం ఐదుగంటల సమయంలో నెల్లుట్ల సర్కిల్ వద్ద టాస్క్ ఫోర్స్ మరియు లింగాల ఘనపూర్ పోలీసులు సంయుక్తంగా వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా పోలీసులు అనుమానంతో డిసియంను ఆపి తనీఖీ చేయగా కోకాఫీట్ కంపోస్ట్ బ్యాగ్ క్రింద రహస్యంగా దాచిన గంజాయి బ్యాగులను గుర్తించిన పోలీసులు డిసియం డ్రైవర్ ప్రభాకర్ తో పాటు మరో నిందితుడు మహేష్ను పోలీసులు అరెస్టు చేసి విచారించగా నిందితులు ప్రధాన నిందితుడు ఖాజా ఆదేశాల మేరకు గంజాయి అక్రమ రవాణాకు పాల్పడుతున్నట్లుగా పోలీసుల ఎదుట అంగీకరించారు.

పెద్ద ఎత్తున గంజాయి పట్టుకోవడం ప్రతిభ కనబరిచిన వెస్ట్ జోన్ డిసిపి సీతారాం, టాస్క్ ఫోర్స్ ఇంచార్జ్ అదనపు డిసిపి వైభవ్ గైక్వాడ్, ఘన్ పూర్ ఎసిపి రఘుచందర్, టాస్క్ ఫోర్స్ ఇన్స్ స్పెక్టర్లు శ్రీనివాజీ, సంతోష్, జనగాం సర్కిల్ ఇన్స్ స్పెక్టర్ ప్రవీణ్ కుమార్, జనగామ రూరల్ సిఐ వినయ్ కుమార్, లింగాలఘన్ పూర్ ఎస్.ఐతో పాటు టాస్క్ ఫోర్స్ సిబ్బందిని పోలీస్ కమిషనర్ అభినందించారు.

# మట్టి గొంతుక 'తాటి రేణుక'

**తరిగొప్పుల ఫిబ్రవరి 02 (ప్రజామంటలు):** విధి బలమైనది కాలం కఠినమైనది కష్టాలను నష్టాలను తరచుగా మనపై ప్రయోగిస్తూ కఠిన పరీక్షలతో కూడిన పరిస్థితులు కల్పిస్తూ ఊపిరి కూడా తీసుకోలేని నిత్యం సంఘర్షణతో కూడిన యుద్ధాన్ని మనపై చేస్తుంది అలాంటి సమయంలో మనమే సహనంతో ఓర్పుతో ప్రతి క్షణాన్ని ఎదుర్కొంటూ ప్రతి పరీక్షలో ఉత్తీర్ణత పొందుతూ రేపటి మన భవిష్యత్తును పటిష్టంగా నిర్మించుకోవాలి, కాలంతో సమానంగా ప్రయాణించి విజేతగా నిలువాలి అందుకు నీవే ఒక ఆయుధమై నీవు నమ్ముకున్న కళ కలం గళం పట్టుకుని కాలముతో సరిసమానంగా పరిగెత్తాలి. అప్పుడే నీవు విజయాన్ని సాధించినట్లు. సరిగ్గా ఇలాంటి కోవకు చెందిన తరిగొప్పుల గ్రామ నివాసి పుట్టినిల్లు. మెట్టినిల్లు ఒకటే తాటి రేణుకది.

చిన్నప్పుడే నాన్న దూరమవడం అమ్మ చేతిలో పెరగడం ఇంటికి పెద్దది కావడం బాధ్యతలతో పనులు చేయడం చదువుకు దూరం కావడం సమస్యలు చుట్టుముట్టి తను ఎటు వెళ్లకుండా ఆపి వేశాయి. చదువు చదువుకున్నది అంతంత మాత్రమే. వ్యవసాయ పనులకు పోయి వాళ్లు వీళ్లు పాడుతుండగా ఈ పాటలు విని తను కూడా నేర్చుకుని ఒకనాడు సరదాగా నేర్చుకున్న పాట ఈరోజు ఒక పూట గడవడానికి అన్నం అవుతుంది. తన జీవిత గమనంలో ఇప్పుడు పాట ప్రధాన భూమిక మట్టి పాటనే మట్టిలోంచి అన్నం పుట్టినట్లు తన జీవితానికి ఇప్పుడు జీవనాధారం తెలంగాణ జానపదం అంటేనే జనుల నవనాడులు ఉత్తేజితమవుతాయి అది తెలంగాణ పాట అది తెలంగాణ మట్టి పాట జీవితం ఎన్ని సవాళ్లు విసిరిన సడలని సంకల్పంతో నమ్ముకున్న వ్యక్తి జీవిత భాగస్వామి సహకారంతో తనకు వచ్చిన పాటలతో తనకంటూ ఒక స్థానాన్ని నిర్మించుకున్నది. ఒక స్థానంలో ఉన్నప్పటికీ పుట్టింటి వాళ్ళు తనతో ఇంకా మాట్లాడకపోవడం తను చేసింది పరిస్థితులకు తల వంచి ప్రేమ వివాహం చేసుకోవడం తన కళని నమ్ముకున్న రేణుకకు



మన వంతు సహకారం ఇచ్చి తెలంగాణ జానపదంలో ఒక స్థానంలో నిలబెట్టాలని ఆ స్థానాన్ని చూసిన పుట్టింటివారు ఆదరించాలి. తన మనసులో రేగుతున్న వేదనకు మనం ఒక చరమగీతం పాడాలని కోరుకుందాం....

### సమ్మక్క- సారలమ్మ జాతర

# ఏర్పాట్లు పరిశీలించిన జడ్పీ చైర్మన్

**భీమదేవరపల్లి ఫిబ్రవరి 02 (ప్రజామంటలు):** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండల ములుకనూర్ లో ఫిబ్రవరి 16, 17, 18 తేదీల్లో జరగనున్న సమ్మక్క సారలమ్మ జాతరకు సంబంధించిన పనులను బుధవారం హనుమకొండ జడ్పీ చైర్మన్ డా. మారపల్లి సుధీర్ కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతరకు హాజరయ్యే



భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. సమ్మక్క- సారలమ్మ జాతర జరిగే స్థలాన్ని, సౌకర్యాలను ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా జడ్పీ చైర్మన్ మాట్లాడుతూ తెలంగాణ ప్రజల ఆరాధ్య దైవమైన సమ్మక్క సారలమ్మ జాతర ప్రజలందరూ అంగరంగవైభవంగా జరుపుకుంటారన్నారు. ఫిబ్రవరి నెలలో 16 వ తేదీ నుండి 18 వ తేదీ వరకు 3 రోజులు జరిగే అతిపెద్ద జాతర సమ్మక్క సారలమ్మ జాతర అన్నారు. ఈ జాతరకు వచ్చిపోయే ప్రజలకు ఎలాంటి అసౌకర్యాలు లేకుండా చూడాలని జాతర కమిటీ చైర్మన్ దొంతరవేన వెంకటేశ్వర్లు మరియు పాలక వర్గానికి సూచించారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మేడారంలో జరిగే ఈ కుంభమేళా జాతరకు వెళ్లలేని భక్తులు స్థానికంగా ఉన్న ములుకనూర్ సమ్మక్క సారలమ్మ జాతరలకు పెద్ద ఎత్తున వచ్చే అవకాశం ఉన్నందున కావలసిన ఏర్పాట్లు సత్వరమే పూర్తి చేయాలన్నారు. ములుకనూర్ పోలీస్ శాఖ పక్షాన మండలంలో నిర్వహించే సమ్మక్క సారక్క జాతర ప్రదేశాల్లో పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎస్సై సురేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ వంగ రవి, చైర్మన్ దొంతరవేన వెంకటేశ్వర్లు, ములుకనూర్ సర్పంచ్ మాడుగుల కొమురయ్య, ఎంపీటీసీలు అప్పని పద్మ, బొల్లంపల్లి రమేష్, మాడుగుల అశోక్, జి. రాజు, దార్న శ్రీనివాస్, మార్పాటి మహేందర్ రెడ్డి, నవాబ్ పాషా, జక్కుల రాజు తదితరులు పాల్గొన్నారు.

# దళితుల అణచివేతకే రాజ్యాంగం మార్పు

### కేసీఆర్ తీరుపై బిజెపి దళిత మోర్చా నిరసన

**జగిత్యాల ఫిబ్రవరి 02 (ప్రజామంటలు):** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కెసిఆర్ భారత రాజ్యాంగాన్ని మార్చాలనే వెనక దళితుల అణచివేత కుట్ర దాగుందని బిజెపి దళితమోర్చా పట్టణ శాఖ అధ్యక్షుడు నక్క జీవన్ అన్నారు. బుధవారం సాయంత్రం కేసీఆర్ వ్యాఖ్యలకు నిరసనగా భారతీయ జనతా పార్టీ దళితమోర్చా వ్యతిరేకిస్తూ డాక్టర్ బాబాసాహెబ్ అంబేదకర్ విగ్రహానికి క్షిరాఅభిషేకం చేసి పూల మాలలు వేశారు. ఈ సందర్భంగా భారతీయ జనతా పార్టీ దళిత మోర్చా పట్టణ శాఖ అధ్యక్షుడు నక్క జీవన్ మాట్లాడుతూ భారత రాజ్యాంగాన్ని మార్చడం కెసిఆర్ తరం కాదన్నారు. అనంతరం జిల్లా అధ్యక్షులు ఆలగుర్తి లక్ష్మినారాయణ మాట్లాడుతూ భారత రాజ్యాంగాన్ని మార్చడం అంటే దలితున్ని అనగా తొక్కడం అని ఆ కార్యక్రమాన్ని వెంటనే మానుకోవాలని లేదంటే దళితులు ఓటు హక్కు ద్వారా కెసిఆర్ మంచి గుణపాఠం చెపుతారని అన్నారు ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షులు వీరబత్తి ని అనిల్ కుమార్, బిజెపి జిల్లా సీనియర్ నాయకులు మదన్మోహన్, ప్రధాన కార్యదర్శి సుద్దాల విజయ్, ఉపాధ్యక్షులు ఓరగంటి హరికృష్ణ, బాపురపు చెంద్ర శేఖర్, చెందొలి హరికిరణ్, కోశాధికారి కంటే జెశ్వంత్, కార్యదర్శి సిరిగిరి అశోక్, బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు మెరుగు ఉమేష్, బీజేవైఎం పట్టణ అధ్యక్షుడు కొండ్ర




రవితేజ, ఉపాధ్యక్షుడు బోదనపు వినీత్, బీజేవైఎం పట్టణ ప్రధాన కార్యదర్శి చుక్కల ప్రేమ్ సాగర్ తోపాటు దళిత మోర్చా కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.



బయో మైనింగ్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అరవింద్ కుమార్ ఐఏఎస్ నిర్వహించిన జూమ్ మీటింగ్లో పాల్గొన్న కరీంనగర్ నగర మేయర్ యాదగిరి సునీల్ రావు, మున్సిపల్ కమిషనర్ సేవ ఇస్లావత్

## ఉచిత నేత్ర శస్త్ర చికిత్సలు చేసిన ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్

**జగిత్యాల ఫిబ్రవరి 02 (ప్రజామంటలు):** జగిత్యాల పట్టణ పావని కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో జగిత్యాల నియోజకవర్గానికి చెందిన 15 మంది నిరుపేదలకు ఉచిత నేత్ర శస్త్ర చికిత్సలు చేసిన జగిత్యాల ఎమ్మెల్యే డా.



సంజయ్ కుమార్. అనంతరం వారికి ఉచిత కళ్ళ అద్దాలు, మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ బోడ్ల జగదీష్, రాయికల్ మండల కో ఆప్షన్ సభ్యులు ముకీథ్, నాయకులు సమిండ్ల శ్రీనివాస్, కూతురు శేఖర్, ఆసుపత్రి సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ఫ్లెక్సీల నివారణపై చర్యలు తీసుకోవాలి

### రుద్ర విఘ్నేష్ డిమాండ్

**కోరుట్ల టౌన్ ఫిబ్రవరి 02 (ప్రజామంటలు):** ఫ్లెక్సీల నివారణపై మున్సిపల్ సిబ్బంది చర్యలు తీసుకోవాలని బిజేవైఎమ్ సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ రుద్ర విఘ్నేష్ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన మాట్లాడుతూ గతంలో ఉన్న మున్సిపల్ కమిషనర్ వాణి పట్టణాన్ని స్వచ్ఛ భారత్,ప్లాస్టిక్ రహితమైన పట్టణంగా మారుస్తామని తీర్మానించారని దానికి తగ్గట్లు జాతీయ స్థాయిలో గుర్తింపు వచ్చిందని అన్నారు. కానీ నేడు పట్టణంలో ఫ్లెక్సీలు వెలుస్తున్నాయని ఆరోపించారు. పట్టణంలో స్వచ్ఛ సర్వేక్షన్ పేరుతో అనేక కార్యక్రమాలు చేపట్టినప్పటికీ మున్సిపల్ అధికారులు పట్టణంలో వెలుస్తున్న ఫ్లెక్సీలపై చర్యలు తీసు కోవడం లేదన్నారు. ప్లాస్టిక్ రహితంగా మారు స్తామని షాపుల్లో తనికీలు నిర్విహిస్తూ ఫైన్ లు వేసి ప్లాస్టిక్ రహితంగా మారుస్తున్న అధికారులు అనుమతులు లేకుండా ఫ్లెక్సీలు పెడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని అన్నారు. లేదా ఫ్లెక్సీల ఏర్పాటు కొరకు స్థలాలు కేటాయించాలని కోరారు. పట్టణాన్ని ప్లాస్టిక్ రహితంగా మార్చాలని బిజేవైఎమ్ సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ రుద్ర విఘ్నేష్ విజ్ఞప్తి చేశారు.



## యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దగ్ధం

**జగిత్యాల ఫిబ్రవరి 02 (ప్రజామంటలు):** దేశంలోని అనేక మంది కీలక వ్యక్తుల టెలిఫోన్ సంభాషణలను పెగాసస్ అనే సాఫ్ట్వేర్ ద్వారా అక్రమంగా రికార్డు చేస్తూ దేశ భద్రతకే ముప్పు తెచ్చేలా వ్యవహరిస్తున్న నరేంద్ర మోడి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ తెలంగాణ యువజన కాంగ్రెస్



రాష్ట్ర అధ్యక్షులు శివసేన రెడ్డి ఆదేశాల మేరకు జగిత్యాల యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ చౌరస్తాలో కేంద్ర ప్రభుత్వ దిష్టి బొమ్మ దగ్ధం చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గుండ మధు, కౌన్సిలర్ నక్క జీవన్, నేహల్, అనుగందుల కిరణ్, కట్ట శివ, కిషోర్, ఎండి. రియాజ్, పట్టణ అధ్యక్షుడు బీరం రాజేష్, రాగుల ప్రదీప్, అర్బాబ్, రాజశేఖర్ రెడ్డి, జితేందర్ రెడ్డి, అసాధి హరీష్, శ్రీపాద సంతోష్, అశోక్, మారుతి, కళ్ళు శ్రీను, షైబాద్, అథాఉల్లా, షకీల్, కళ్యాణ్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.



జన్నారం మండలం చింతగూడ గ్రామ అభివృద్ధి అధ్యక్షుడిగా మేడమురళి మూడవ సారి ఏకగ్రీవంగా ఎన్నిక. హర్షం వ్యక్తం చేసిన వైస్ ఎంపిపి సుతారి వినయ్, నసాని రాజన్న, బీవీఎస్ నాయక్, గ్రామ ప్రజలు



జగిత్యాల జిల్లా బీర్పూర్ మండలంలోని లక్ష్మీదేవ్ పల్లె, సారంగాపూర్ మండలం బట్టపెల్లి పోతారం గ్రామాల్లో యువతకు ఈజిలఎంఎం సపోర్ట్ ద్వారా ఉచిత డ్రైవింగ్ శిక్షణ, ఉపాధి గురించి వివరించిన తెలంగాణ రాష్ట్ర ప్రచార కర్త గా నియమితులైన సామాజిక కార్యకర్త డా. షేక్ చాంద్ పాషా, మరియు కవయిత్రి, టీచర్, డా. సయ్యదా సమీనా పర్వీన్లు

# మధ్యతరగతి ప్రజ(లు) లకు అక్కరలేని బడ్జెట్

బడ్జెట్ కాకి లెక్కలేనా.. కేటాయింపులు సమగ్రంగా..సక్రమంగా ఉండడం లేదా... అలాగే దాని స్వరూపం మారుతోందా..కేవలం అంకెల గారడీ తప్ప దేశ భవిష్యత్ దర్శనం కనిపించడం లేదా..మేధావులు, ఆర్థిక నిపుణులు ఆందోళన చెందడంలో అర్థం ఉందా..! రాజకీయ నాయకుల పెదవి విరుపుల వెనక బలమైన కారణాలు ఉన్నాయా.. అంటే సర్వత్రా ఔననే వినిపిస్తోంది. బడ్జెట్ ద్వారా లెక్కలు అప్పగించడం తప్ప మరోటి కానరావడం లేదు. దేశంలో అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నచందంగా మారింది. రాష్ట్రాలను విశ్వాసంలోకి తీసుకోవడం లేదు. రాష్ట్రాల్లో అభివృద్ధి కార్యాక్రమాలు ముందుకు సాగడం లేదు. కేటాయింపులు అరకొరగా ఉంటున్నాయి. నిరుద్యోగం తాండవిస్తోంది. వ్యవసాయం పడకేస్తోంది. రైతులు రోడ్డెక్కినా వారికి న్యాయం దక్కడం లేదు. విద్య,వైద్యం ఖరీదైనదిగా మారింది. ఈ క్రమంలో బడ్జెట్ స్వరూపం మారాల్సి ఉంది. మొక్కుబడిగా కాకాకుండా దేశ జనాభా,రాష్ట్రాలు, అవసరాలు,నిధులను బేరీజు వేసుకుని కార్యక్రమాలు రూపోందించేలా బడ్జెట్ రూపకల్పన జరగాలి. ప్రధానంగా మౌళిక వసతుల కల్పన, అభివృద్ధి తదితర అంశాలను ముందుకు తీసుకుని వెళ్లేలా బడ్జెట్ రూపకల్పన జరగడం లేదు. 75 ఏళ్ల స్వాతంత్ర్యం తరవాత కూడా నేటికీ విద్యుత్, వైద్యం, విద్య, రోడ్లు వంటి మౌళిక వసతుల కల్పన అంతంత మాత్రంగానే ఉంది. బడ్జెట్‌తో సంబంధం లేకుండా ప్రజలు తమ మానానా తాము జీవిస్తున్నారు. తాము మిగతా పార్టీలకన్నా భిన్నమని చెప్పుకున్న ప్రధాని మోడీ..చేతల్లో మాత్రం ఎలాంటి కొత్తదనం చూపలేకపోయారు. నేలవిడిచి సాముచేస్తున్న తీరు కళ్లకు కడుతోంది. మాటల గారడీ తప్ప మరోటి గోచరించడం లేదు. పేర్లు మార్చడం..పథకాలకు కొత్త పేర్లు పెట్టడం మినహా ఒరిగిందేమీ లేదు. పేద మధ్య తరగతి ప్రజలకు జీవనం దుర్భరంగా మారింది. బంగారం ధరలు పెరుగుతున్నాయి. సొంతింటి కల కల్లగా మారింది. ఇల్లు కొందామంటే జీఎస్టీ వాయింపులు భారీగా ఉన్నాయి. పేదలు స్వయంగా తమ జీవనం గడుపుకునే పరిస్థితి లేకుండా పోయింది. బ్యాంకులు సామాన్యులకు అందుబాటులో లేవు. ఈ సమస్యలన్నీ తీర్చాలన్న సంకల్పం ప్రభుత్వానికి లేకుండా పోయింది. 2014 సంవత్సరంలో కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు.. ఫిబ్రవరి నెల చివరి తేదీ లేదా ఫిబ్రవరి 28 లేదా 29 తేదీల్లో బడ్జెట్‌ను సమర్పించేవారు. అయితే మోడీ ప్రభుత్వం ఈ సంప్రదాయాన్ని మార్చివేసి.. ఫిబ్రవరి నెలాఖరుకు కాకుండా ఫిబ్రవరి 1న ప్రవేశపెట్టడం ప్రారంభించింది. ఇదో మార్పుగా గమనించాలి. ఇకపోతే రైల్వే బడ్జెట్‌ను మొత్తంగా ఎత్తేశారు. సాధారణ బడ్జెట్‌లో రైల్వే బడ్జెట్‌ను విలీనం చేశారు. ఇదో మార్పుగా మనం చూడాలి.నీతి ఆయోగ్‌ను ఏర్పాటు చేశారు. సంప్రదాయాలను మార్చే రేసులో నరేంద్ర మోదీ ప్రభుత్వం ముందు ఉంటోందనడానికి ఇదే నిదర్శనం. 1924 నుంచి కొనసాగుతున్న రైల్వే బడ్జెట్ సంప్రదాయాన్ని 2016లో మార్చివేసింది. 2016కి ముందు సాధారణ బడ్జెట్‌కు కొన్ని రోజుల ముందు రైల్వే బడ్జెట్‌ను ప్రత్యేకంగా సమర్పించేవారు. అయితే ఈ బడ్జెట్ వల్ల ప్రజలకు లేదా రాష్ట్రాలకు కూడా ఒరిగిందేమీ లేదు. కేవలం రైల్వేల మంత్రులు తమ రాష్ట్రాలకు కొన్ని కేటాయింపులు తప్ప మరోటి సాధించలేదు. రైల్వేలను పటిష్టం చేసే ప్రక్రియ మోడీ హయాంలోనూ కలగడం లేదు. 2016లో అప్పటి కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ రైల్వే బ్జడెట్‌ను సాధారణ బడ్జెట్‌తో పాటు రైల్వే బడ్జెట్‌ను కూడా ప్రవేశపెట్టారు. ఇకపోతే చరిత్రలోని సంప్రదాయాలను పరిశీలిస్తే 1947 నుంచి దేశ సాధారణ బ్జడెట్‌ను పార్లమెంటులో సమర్పించేందుకు ఎరుపు రంగు బ్రీఫ్‌కేస్



వినియోగించేవారు. ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం 2019 సంవత్సరంలో ఈ సంప్రదా యాన్ని మార్చివేసింది. అప్పటి నుంచి ఎరుపు బ్రీఫ్‌కేస్‌కు బదులుగా బడ్జెట్‌ను ఎర్రటి గుడ్డలో చుట్టి, లెడ్జర్ రూపంలో తీసుకువస్తున్నారు. వాజ్‌పేయి ప్రభుత్వంలోనూ..నరేంద్ర మోడీ ప్రభుత్వానికి ముందు బిజెపి నేతృత్వంలోని అటల్ బిహారీ వాజ్‌పేయి ప్రభుత్వం కూడా బడ్జెట్‌కు సంబంధించిన పాత సంప్రదాయాన్ని మార్చివేసింది. 1999కి ముందు అన్ని బడ్జెట్‌లు సాయంత్రం ఐదు గంటలకు సమర్పించేవారు, అయితే 1999లో ఈ సంప్రదాయాన్ని విడిచిపెట్టి, అప్పటి ఆర్థిక మంత్రి యశ్వంత్ సిన్హా తొలిసారిగా ఉదయం 11 గంటలకు సాధారణ బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. అప్పటి నుంచి ఉదయం 11 గంటలకు లోక్‌సభలో బడ్జెట్‌ను ప్రవేశపెడుతూవస్తున్నారు. మార్పులంటే ఇవి మాత్రమే తప్ప బడ్జెట్ కేటాయింపులు, దేశ విధానాల్లో మాత్రం ఎక్కడా కానరావడంలేదు. ఇకపోతే తాజాగా ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ప్రతిపాదించిన 2022-23 సంవత్సర బడ్జెట్ ఎలాంటి మెరుపులు, ఆకర్షణలు లేకుండా సాదాసీదాగా ఉంది. బడ్జెట్ అనే కన్నా ఒక ప్రకటన చేసినట్లుగా ప్రసంగం మొత్తం సాగిపోయింది. ఈ ఏడాదైనా తమకు ఏదో ఒరుగుతుందని గంపెడాశలు పెట్టుకున్న ఆయా రాష్ట్రాలకు ఖేదం మిగిలింది. అలాగే వేతనజీవికి నిరాశే మిగిలింది. ప్రభుత్వ మద్దతు కోసం చకోర పక్షుల్లా ఎదురు చూస్తున్న పలురంగాల ఆశలపై నీళ్లు చల్లారు. దేశంలో అతి పెద్ద రాష్ట్రం ఉత్తరప్రదేశ్ సహా ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో జనాకర్షణ ప్రతిపాదన లు ఉంటాయన్న ఊహాగానాలూ తప్పే అయ్యాయి. ఎవరిపైనా అదనపు వడ్డనలు వేయకపోవడం మాత్రమే కొంత ఊరట కలిగించే అంశంగా చూడాలి. కరోనాతో వైద్యరంగాన్ని మరింత బలోపతేంచేస్తారని అనుకున్నా అలాంటి దాఖలాలు కూడా లేవు. గత కొన్నేళ్లుగా ఐటీ పరిమితి పెంచకపోయినా కనీసం శ్లాబ్‌లలో అయినా మార్పులు చేస్తూ కొంత ఉపశమనం కలిగించారు. ఈ ఏడాది ఆ ప్రయత్నం కూడా జరగలేదు. కరోనా కష్టాల కారణంగా ప్రధాని మోడీ సూచనల మేరకు అదనపు పన్ను ప్రతిపాదనల జోలికి వెళ్లలేదని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించారు. అంటే అవసరమైతే వడ్డించే వారని అర్థంచేసుకోవాలి. తెలంగాణ సిఎం కెసిఆర్ అన్నట్లుగా ప్రభుత్వానికి దూరదృష్టి లేదు. ఆయారంగాలను ఎలా ముందుకు తీసుకుని వెళ్ళాలన్న భవిష్యత్ దృష్టి కానరాలేదు. ఈ బడ్జెట్ తీరు ఇలాగే కొనసాగితే మరో 75 ఏళ్లు గడిచినా భారతదేశ భాగ్యం మారదు. దేశంలో పురోగతి కనిపించదు. సమస్యలపై సమగ్ర దృష్టితో బడ్జెట్ రూపకల్పన జరగాల్సిన అవసరాన్ని అన్ని పార్టీలు గుర్తించాలి.




## సాహితీ ప్రేమికులైన పాఠకులకు ప్రత్యేకం

" ప్రజా మంటలు" తెలంగాణ జాతీయ దినపత్రికలో ప్రతి రోజు, " నేటి కథ" శీర్షికన ఒక కథను ప్రచురించనున్నామని తెలుపుటకు సంతోషిస్తున్నాం. రచయితలు తమ కథలను mantalukathalu@gmail.comకు పంపవచ్చు...

-ఎడిటర్.

## తోడేలు తిప్పలు ... కోతికి ఇక్కట్లు...

అడవిలో ఒక తోడేలు వుండేది. అది ఎవరికీ తెలియకుండ జంతువులను చంపి ఆకలి తీర్చుకునేది. కొన్ని రోజుల తర్వాత ఎంత వెదికినా దానికి ఆహారం దొరకలేదు. అది రాత్రి పూట జనం నిద్ర పోయినప్పుడు అడవికి దగ్గరలో వున్న గ్రామానికి వెళ్లి మేకలను చంపి తినేది.

ఈ వగలమారి తోడైలు రోజూ అడవిని విడిచి వెళ్లివస్తున్న సంగతి ఆరుష్ అనే ఓ కోతి ఆసక్తిగా గమనించిది. విషయం తెలియని తోడేలు ఎంతో తెలివి గా తాను చేస్తున్న ఘన కార్యం గురించి కోతికి గొప్పగా



చెప్తూండేది. యజమానులకు తెలియకుండ మేకలను చంపుతున్న విషయాన్ని వయ్యారంగా వర్ణించి చెప్పేది. ఆ మాటలు విన్న చిలిపి కోతికి తోడేలు గ్రామస్తుల కండ్లుకప్పి జంతువులను ఏ విధంగా చంపితింటుందో అన్న విషయం చూడాలనింపించిది.

ఎప్పటిలాగే ఒక నాడు తోడేలు వూరికి వెళ్తున్న విషయం కనిపెట్టిన కోతి రహస్యంగా దాన్ని వెంబడించింది. తన ముచ్చట తీరబోతునందుకు మనసులో మురిసిపోయింది. అయితే తమ వూరిలో రోజు రోజుకు మేకలు మాయమవుతున్న విషయం ఊరి జనం గమనించారు. దానికి కారణం ఏమిటో తెలుసుకోవాలని రాత్రిపూట కాపలా కాయసాగారు. ఈ విషయం తెల్వని తోడేలు దాన్ని వెంబడించిన కోతి ఓ రోజున మధ్య రాత్రి ఆ ఊరును చేరుకున్నాయి.

మేకలను తినడానికి వాటి దగ్గరకువెళ్తున్న తుంటరి తోడేలును కాపలా కాసే గ్రామస్తులు పసిగట్టారు.మేకలు ఎందుకు మాయమవుతున్నాయో వారికి అర్థం అయింది. వెంటనే తాము తెచ్చుకున్న దుడ్డు కర్రలతో తోడేలు పై దాడి చేశారు. దాంతో నడ్డి విరిగిన తోడేలు బతుకు జీవుడా అంటూ పత్తా లేకుండా అడవికి పారిపోయింది. చెట్టు చాటున దాక్కొని నక్కి నక్కి చూస్తున్న కోతిని కూడా వదలకుండ కొట్టసాగారు.

ఆ దెబ్బలకు తట్టుకోలేని కోతి...." మీ మేకలను తినడానికి వచ్చింది తోడేలు కదా! నేను కాదు, మరి నన్నెందుదుకు కొడుతున్నారు? వదిలేయండి బాబోయ్ " అని వేడుకున్నది.

"తోడేలు కు సహాయంగా వచ్చావు. నిన్ను మాత్రం ఏలా విడిచి పెడతాం". అంటూ జనం మరో రెండు బాదారు. దాంతో వాయ్యో...వామ్మో అంటూ ఆ కోతి అడవికి ఉరికింది.ఇంకెప్పుడూ ఇలాంటి బుద్ది తక్కువ పని చేయకూడదని ,దుష్టుల వెంట వెళ్లొద్దని మనసులో అనుకుంది.

కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి
బాలల కథా రచయిత,
ఫోన్: 9441561655

# ఆరాధ్య దేవత కన్యక

మాఘ శుక్ల విదియ కన్యకా పరమేశ్వరి ప్రాయోపవేశం దినం

వాసవీ దేవి అగ్ని ప్రవేశం చేసి, నేటికి 1000 సంవత్సరాలు గడిచాయి. వాసవీ మాత మాఘ శుక్ల పక్ష విదియ శుక్రవారం శతభిష నక్షత్రం రోజున ప్రాయోపవేశం చేసినట్లు పురాణ కథనం. దుష్టులను శిక్షించి, శిష్టులను రక్షించడమే జగజ్జనని కన్యక అవతారం. బ్రహ్మ, విష్ణు, మహే శ్వర త్రైమూర్య దేవతలకు మూల కారణమైన భువనేశ్వరీదేవిని వాసవీ కన్యకా పరమేశ్వరీ రూపమున పూజించడం సదాచార పరంపరగా కొనసాగుతున్నది. గోదావరీ తీరాన గల 714 గోత్రీకులకు నిలయాలైన 18పట్టణాలకు కేంద్రంగా పెనుగొండ ముఖ్య పట్టణంగా మహా సంపదలతో వైశ్యులలో తలమానిక మైన, వేంగి దేశాన్ని ఏలే వైశ్యులకు రాజైన కుసుమ శ్రేష్ఠి, కుసుంబా దేవి దంపతులకు అనేక జన్మార్జితాలైన పుణ్యాలకు తోడు పుత్ర కామేష్ఠి యాగ ఫలము ఏకమై జగజ్జనని పరమేశ్వరీ దేవి, వైశాఖ శుద్ధ దశమి,శుక్రవారం ఉత్తర నక్షత్రం,కన్య రాశిలో అవతరించింది. అంతకు కొన్ని నిమిషాల ముందే ఒక బాలుడు జన్మించాడు. పరమేశ్వరుని పూజా ఫలమైన కుమారునికి విరూపాక్షుడని, జగజ్జ నని అవతారమైనందున పరమేశ్వరి అని నామకరణాలు చేశారు.

దేవి సర్వప్రాణులలో శక్తి రూపాన వసిస్తున్నందున "వాసవి" అని, పర పురుషులవైపు చూడక, పర మేశ్వరుని యందే మనసు లగ్నం చేసినందున "కన్యక" అని నామాంకితయైనది. ఇరువురు కుల గురువు భాస్కరాచార్యుని వద్ద వేదోక్త సంస్కారాలు, వేదాంగాలు నేర్చుకోగా, పరమేశ్వరి, పండితుల చెంత సంగీత నాట్య సకల కళలలో అసమాన ప్రతిభురాలై, విదుషీమణి యైనది. యుక్త వయస్కుడైన విరూపాక్షునకు, సంపన్న కుబేరుడైన అరిది శ్రేష్టి కూతురు రత్నావళితో వివాహం జరిపించారు. పరమేశ్వరి యౌవన వతియై, విశ్వమయుడైన మృత్యంజయుడి యందే మనసు లగ్నం చేసి నిరంతర ధ్యానం చేస్తున్నది. ఇలా ఉండగా రాజమహేంద్రవరాన్ని పాలించే దుష్టుడైన విష్ణువర్ధనుడు, పక్క రాజ్యాలను జయించి, తిరిగి వెళుతూ, పెనుకొండ వద్ద ఉద్యానవనంలో బసచేయగా, కుసుమ శ్రేష్ఠి తమ ప్రభువును దర్శింప కట్న కానుకలు, దాస దాసీ జనంతో వెళ్ళాడు. రాజును చూడడానికి మహేశ్వరి, తన తల్లి కుసుంబా దేవితో వెళ్ళి, ఆమె వెనక నిలుచుంది. అపురూప సౌందర్యవతి యైన మహేశ్వరిని రాజు చూసి, కామవాంఛా పరవశుడై తాను వివాహం చేసుకుంటానని, కాదంటే బలవం తంగా తీసుకు వెళతానని ప్రకటిస్తాడు. 714 గోత్రికులు సమావేశమై, ఇట్టి వివాహం వర్ణ సంకరం, వయో వ్యత్యాసముచే అనుచితమని నిర్ణయించారు. అయితే రాజుకు నచ్చ చెప్పి పంపుతారు.

కొద్ది దినాలకు విష్ణువర్ధనుడు తిరిగి వివాహ యత్నం చేయగా, పరమేశ్వరిని ఇవ్వడానికి సిద్ధంగా లేమని సమాధానం పంపుతారు. ఇది విన్నంతనే రాజు సందేశ హరులను ఖైదు చేస్తాడు. వారు తప్పించుకుని, పెనుకొండకు చేరుతారు. కుల గురువగు భాస్కరాచార్యుడు అక్షయ నామ సంవత్సర ఫాల్గుణ శుక్లపక్ష పాడ్యమి నాడు 18 పట్టణాల 714



గోత్రికులతో నగరేశ్వర మండపాన సమావేశ పరచగా, మహేశ్వరితో పాటు అగ్ని ప్రవేశం చేయ నిర్ణ యించారు. కన్యకను అభిప్రాయం కోరగా, పరంజ్యోతి నుండి తనను ఎవరూ వేరు పరచ జాలరని, అగ్ని ప్రవేశం ద్వారా జ్ఞాన మార్గాన పరమేశ్వరుని చేరుకుని, కైలాస వాసిని కాగలనని తెల్చి చెప్పింది. ఇది విన్న కొంత మంది ప్రాణ భయంతో పారి పోగా, 102 గోత్రికులు కన్యకతో ప్రాణ త్యాగానికి సంసిద్ధులౌతారు. అగ్ని ప్రవేశ సమయాన వాసవి తన తల్లిదండ్రులు నలకూబర దంపతులని, వీరనారాయణ పురవాసులగు ధనగుప్త దంపతులు కైలాస నివాసులు, నందీశ్వర దంపతులని, 102 గోత్రికులు ప్రమథ గణాలకు చెందిన వారని వివరించింది. దేవి మానవ రూపంలో ప్రత్యక్షం అయింది. ఆమె తన నిజ స్వరూపాన్ని దేదీప్యమాన మైన వెలుగుతో చూపించి నేను ఆది పరాశక్తి ఆర్యమహాదేవి యొక్క అవతారాన్ని అని చెప్పింది. ధర్మాన్ని నిల్పేందుకు, స్త్రీల గౌరవాన్ని కాపాడేందుకు, విష్ణువర్ధునుడిని అంతం చేసేందుకు, వైశ్యుల ఔదార్యాన్ని ప్రపంచానికి చాటేందుకు కలి యుగంలో జన్మించానని చెప్పింది. సతీదేవి తనకి జరిగిన అవమానానికి ప్రతిగా చితి మంటల్లో దూకినట్టుగానే నేను కూడా అగ్నిలోకి దూకి పుణ్య లోకాలని చేరుకుంటాను అని చెప్పింది. కుశుమ శ్రేష్ఠి గత జన్మలో సమాధి అనబడే గొప్ప ముని. ఆయన తన 102 గోత్రాలకు చెందిన బంధువులతో సహా మోక్షాన్ని కోరాడు. అందుకే మీ అందరిని కూడా ఆత్మ బలి దానానికి పురి కొల్పాను అని అంది. ఆమె అక్కడ చేరిన వారికి దేశ భక్తి, నిజాయితి, సమాజ సేవ, సహనం మొదలగు వాటి గురించి వివరించింది.

వైశ్యులంతా వేద చోదితమైన మార్గమును వీడవలదని, వేదోక్త సంస్కారాలన్ని ఆచరించాలని, గాయత్రి మంత్ర జపమాచరించాలని, శృతి స్మృతి నిర్దేశిత మార్గాన్ని అనుసరించాలని ధర్మమార్గాన్ని వీడ వలదని బోధించింది. అలా అగ్ని గుండాన ప్రవేశించి, ఆత్మార్పణం ద్వారా నిజ స్థానాన్ని పొందింది. 102 గోత్రికులు ఆమెను అనుసరించి పుణ్యలోక ప్రాప్తులైనారు. నాటి నుండి వైశ్యులు త్రిమూర్తులకు మూల కారణమైన భువనేశ్వరిని కన్యకా పరమేశ్వరీ రూపాన పూజించడం సదాచారంగా, సత్సంప్రదాయంగా మారింది.



రామ కిష్టయ్య సంగన భట్ల...
9440595494

# ఇసుక అక్రమ దందాలకు అడ్డుకట్టేది

## అనధికార తవ్వకాలపై అలసత్వం

## చూసీచూడనట్లుగా రవాణా వ్యవహారం

ఆదిలాబాద్,ఫిబ్రవరి2: జిల్లాలో ఇసుకతో లక్షలు దోచేస్తున్నారు. ఆయా ప్రాంతాల్లో లక్షల్లో దందా కొనసాగుతుండగా, భూగర్భజలాలు అడుగంటిపోతున్నాయి. రైతులకు సాగునీటికి, స్థానికులకు తాగునీటికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వాల్టా చట్టానికి తూట్లు పొడుస్తూ అక్రమార్కుల దందా కొనసాగుతున్నా, అధికారులు పట్టించుకోకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అధికారిక పనులకు కాంట్రాక్టర్లు మంచిర్యాల జిల్లా గోదావరి నుంచి ఇసుకను తీసుకువస్తారు. జిల్లాలో పలు ప్రాంతాల్లో భవనాలు, ఇతర నిర్మాణాలకు అవసరమైన ఇసుకను పెన్‌గంగ నది నుంచి అక్రమంగా తరలిస్తారు. అధికారికంగా ఎలాంటి అనుమతులు లేకున్నా, దళారులు ఈ దందా కొనసాగిస్తున్నారు. సహజసిద్ధంగా ఇసుక లభ్యత ఉన్నా క్వారీలకు అవకాశం లేదని ఉన్నతాధికారులకు మైనింగ్ అధికారులు గతంలో నివేదికలు ఇచ్చారు. భూమి నుంచి రెండు మీటర్ల లోపే ఇసుక నిల్వలు ఉన్నాయని, దీంతో క్వారీలు ఏర్పాటు చేసే అవకాశమే లేదని కలెక్టర్‌కు నివేదించారు. నదిపరీవాహక ప్రాంతాల నుంచి ఇసుకను తోడితే భూగర్భజలాలు ఇంకిపోతాయని, రైతులకు సాగునీటి సమస్యలు ఎదురవుతాయని పేర్కొన్నారు. దీంతో అధికారికంగా ఇసుక క్వారీలకు అనుమతులు లభించలేదు. దీనిని ఆసరా చేసుకుని అక్రమార్కులు దందాకు తెరలేపారు. జిల్లాలో మహారాష్ట్ర సరిహద్దుకు ఆనుకొని పిప్పల్‌కోటి నుంచి 60 కిలో మీటర్లు భీంపూర్, జైనథ్, బేల మండలాల మీదుగా పెన్‌గంగ పరీవాహక ప్రాంతం ఉన్నది. వానకాలంలో ప్రవాహం ఎక్కువగా ఉండడంతో పరీవాహక ప్రాంతాల్లో భారీగా ఇసుక నిల్వలు పేరుకుపోతాయి. డిసెంబర్‌లో ప్రవాహం తగ్గడంతో అక్రమార్కులు ఇసుక నిల్వలపై కన్నేస్తారు. జైనథ్ మండలం డొల్లార, పెండల్‌వాడ, కౌఠ, అనంత్‌పూర్, బేల మండలంలోని సాంగిడి, బెదోడ, కామ్‌గార్‌పూర్, కొద్దూర్, మాగ్లూర్‌కు ఇసుక తీసుకపోతారు. భీంపూర్ మండలం గొల్లఘాట్, తాంసి (కే), వడూర్, అంతర్‌గాం, గుబిడి గ్రామాల్లో నది ప్రవహించిన చోటు నుంచి ఇసుకను తరలించి భారీగా సొమ్ము చేసుకుంటున్నారు. అసలు నది ప్రవహించే చోట భూమి నుంచి రెండు మీటర్ల పైన ఇసుక నిల్వలు ఉంటేనే అధికారికంగా అనుమతులు ఉంటాయి. జిల్లాలో ఎక్కడా రెండు మీటర్లకు పైగా నిల్వలు లేవు. అయినా ఈ రవాణా ఆగడం లేదు. జిల్లాలో 15 గ్రామాల పరిసరాల్లోంచి ఈ ఇసుక దందా సాగుతున్నది. నిత్యం వందల సంఖ్యలో ట్రాక్టర్లలో ఇసుకను తరలిస్తున్నారు. ఈ ప్రాంతంలో నలుగురిని కాపలా ఉంచుతారు. ఒక్కో ట్రాక్టర్‌కు రూ. 400 నుంచి రూ.500 వసూలు చేస్తారు. చలికాలంలో ప్రారంభమయ్యే ఈ అక్రమ వ్యవహారం ఎండాకాలం వరకు కొనసాగుతుంది. మొదట నది నుంచి తీసుకెళ్లే ఇసుకను ఓచోట డంప్ చేసి, అవసరమైన వారికి విక్రయిస్తారు. ఇసుక అక్రమ రవాణాపై తనిఖీలు నిర్వహిస్తున్నామని రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా ఇష్టారాజ్యంగా ఇసుకను తరలిస్తే కేసులు నమోదు చేస్తామని,. ఆయా ప్రాంతాల్లో నిఘా పెట్టామని చెబుతున్నా ఫలితం మాత్రం కానరావడం లేదు.

# పటిష్ట పంచాయితీ వ్యవస్థ అసవరం

## కేరళ తరహా విధానం మేలంటున్న నేతలు

అమరావతి,ఫిబ్రవరి1 : పంచాయతీల్లో పన్నుల వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉన్నట్లు ఇటీవల నిర్వహించిన ఒక పరిశీలనలో వెల్లడైంది. కేరళ తరహా విధానం అవలంబించాలని సిపిఎం నేతలు సూచిస్తున్నారు. కొత్త భవనాలకు ఆస్తి పన్ను విధింపు, ఉన్న పన్నులను ప్రతి అయిదేళ్లకోసారి సవరించాలన్న ఆదేశాలు పంచాయతీల్లో అమలుకు నోచుకోవడం లేదు. ఆర్థిక సంఘ నిధులు, దస్తావేజుల రిజిస్ట్రేషన్లపై వచ్చే స్టాంపు డ్యూటీ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే గ్రాంట్లతోనే అత్యధిక పంచాయతీలు సరిపెట్టుకుంటున్నాయి. కేరళ, కర్ణాటక వంటి రాష్ట్రాల్లో పంచాయతీలు ఆర్థికంగా బలోపేతంగా ఉన్నాయంటే పన్నుల వ్యవస్థ పటిష్ఠంగా ఉండటమే ప్రధాన కారణమని అధికారులు అంటున్నారు. రాష్ట్రంలోని 12,918 పంచాయతీలకు ఆస్తి పన్ను, పన్నేతర రుసుముల కింద ఏటా



రూ.732కోట్లకుపైగా ఆదాయం వస్తున్నట్లు గణాంకాలున్నాయి. కానీ, 50శాతంనుంచి 60శాతానికి మించి అందులో వసూలు కావడం లేదు. పాలకవర్గాలు పట్టించుకోకపోవడం, ప్రజల సహకారం కొరవడటమే ఇందుకు కారణం అని భావిస్తున్నారు. రాష్ట్రంలో గ్రామాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వ సాయం అవసరం కాగా, ఇప్పటికే అనేక కార్యక్రమాలు రూపొందించినప్పటికీ వాటికి నిధుల విడుదలలో జాప్యం జరుగుతోంది. తద్వారా పనులపై ప్రతికూల ప్రభావం పడుతోంది. పట్టణ తరహా గ్రామీణాభివృద్ధి (రూర్బన్) కార్యక్రమం కోసంరాష్ట్రంలోని విశాఖపట్నం, నెల్లూరు, ప్రకాశం, చిత్తూరు, అనంతపురం జిల్లాల్లోని అయిదు పంచాయతీలను గతంలో ఎంపిక చేశారు. రూ.135 కోట్లతో ఆయా గ్రామాల్లో వివిధ పనుల నిర్వహణకు వీలుగా కార్యాచరణ రూపొందించారు. ఇందులో కేంద్రం 60శాతం, రాష్ట్రం మిగతా 40 శాతం నిధులు సమకూర్చేందుకు ఒప్పందం కుదిరింది. అయినా ఈ పనులు పూర్తి చేయని పరిస్థితి నెలకొంది. నిధులు గడువులోగా ఖర్చు చేసేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకోవాలి. కేంద్రం కూడా నిధులు సకాలంలో విడుదల చేయాలి. స్వచ్ఛభారత్‌లో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికే 32 లక్షల కుటుంబాల కోసం వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించారు. ఇళ్ల నుంచి చెత్తతోపాటు పశువుల పేడనూ సేకరించి వాటి ద్వారా ఏటా రూ.600 కోట్ల సంపద సృష్టించేందుకు ప్రణాళికలు రూపొందించారు. పన్నేతర రుసుము వసూళ్లు, అందులోని లొసుగులను సవరిస్తే ఆదాయం పెరిగే అవకాశం ఉన్నా ఆ దిశగా గ్రామ పంచాయతీలు దృష్టి సారించడం లేదు. రెండు జిల్లాలను ఇప్పటికే బహిరంగ మలవిసర్జన రహిత ప్రాంతాలుగా ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం మిగతా 11 జిల్లాలపైనా దృష్టి పెట్టింది. భారీగా మరుగుదొడ్లు నిర్మిస్తున్నా వాటి నిర్వహణ చాలా జిల్లాల్లో అధ్వానంగా ఉంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ పెట్టాల్సిన అవసరం ఉంది. వీటికి కేంద్రం సకాలంలో నిధులు విడుదల చేస్తే మరిన్ని ఫలితాలు సాధించొచ్చని భావిస్తున్నారు.

# కేంద్ర బడ్జెట్‌తో ఒరిగిందేమీ లేదు

### తెలంగాణపై కేంద్రం సవతి తల్లి ప్రేమ
### ప్రజల ఆశీస్సులతో కేసీఆర్ అద్భుత పాలన
### అభివృద్ధికి ప్రజల సహకారం అందించాలి
### మేడ్చెల్ పర్యటనలో పలు కార్యక్రమాలకు కేటీఆర్ శ్రీకారం
### మంత్రి పర్యటనను అడ్డుకున్న కాంగ్రెస్ శ్రేణులు



హైదరాబాద్,ఫిబ్రవరి2: కేంద్రం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో కేంద్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రంపై సవతి తల్లి ప్రేమ చూపించిందని పురపాలకశాఖ మంత్రి కేటీఆర్ విమర్శించారు. ఏ ఒక్కరంగానికి రూపాయి కేటాయించ లేదన్నారు. ఇంతకన్నా దారుణం మరోటి ఉండదన్నారు. బడ్జెట్‌తో పేదలకు ప్రయోజనం లేదన్నారు. కేంద్రం ప్రవేశ పెట్టిన బ్జడెట్‌లో పేదలకు పనికొచ్చేది ఏదీ లేదని, తెలంగాణ లాంటి ప్రగతిశీల రాష్ట్రానికి మరోసారి మొండిచేయి చూపెట్టారని మంత్రి విమర్శించారు. ఎన్ని విజ్ఞప్తులు చేసినా... అన్నింటిని బుట్ట దాఖలు చేశారని అన్నారు. కేంద్రం ఇచ్చినా... ఇవ్వక పోయినా... ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలో.... తెలంగాణ రాష్ట్రం ఇదే రీతిలో అభివృద్ధిలో ముందుకు సాగుతుందని అన్నారు. సంక్షేమ కార్యక్రమాలు ఆగవన్నారు. మేడ్చల్ జిల్లా పర్యటనలో మంత్రి పలు కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. మేడ్చల్ నియోజకవర్గంలోని జవహర్‌నగర్, పీర్జాదిగూడ, బోడుప్పల్ కార్పొరేషన్‌లో పర్యటించిన కేటీఆర్... మంత్రి మల్లారెడ్డితో కలిసి 303 కోట్లతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. జవహర్ నగర్ ప్రాంత వాసుల చెత్త సమస్యను పరిష్కరించామని.... 147 కోట్ల రూపాయలు ఖర్చు పెట్టి ట్యాపింగ్ చేశామని మంత్రి కేటీఆర్ తెలిపారు. మేడ్చల్ నియోజకవర్గంలోని జవహర్‌నగర్, పీర్జాదిగూడ, బోడుప్పల్ మున్సిపాలిటీల్లో పర్యటించిన మంత్రి... మున్సిపాలిటీల్లో పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. అనంతరం బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని చంగిచెర్లలో 110 కోట్లతో చేపట్టనున్న ఎస్ఎన్‌డీపీ పనులకు శంకుస్థాపన చేశారు. బోడుప్పల్‌లో ఎఫ్ఎస్‌టీపీ సెంటర్‌ను... మేడిపల్లిలో వైకుంతధామాన్ని మంత్రి ప్రారంభించారు. జవహర్ నగర్ ప్రాంత పరిధిలో 250 కోట్ల రూపాయలతో మురికినీటిని శుద్ధి చేసే పనులూ జరుగుతున్నాయని వెల్లడించారు. జవహర్‌నగర్‌లో చిన్నాపురం చెరువు సుందరీకరణ పనులకు శ్రీకారం చుట్టారు. ప్రభుత్వ భూమిలో ఇల్లు కట్టుకున్నవారికి న్యాయం చేస్తామని హామీనిచ్చారు. జీవో 58,59 ద్వారా ప్రజలకు ఇళ్ల పట్టాలు అందజేస్తామని వెల్లడించారు. డంపింగ్ యార్డుల్లో రూ.147 కోట్లతో గ్రీన్ క్యాపింగ్ చేశామని పేర్కొన్నారు. చెరువులు కలుషితం కాకుండా రూ.250 కోట్లతో లిచింగ్ చేశామన్నారు. సంక్షేమంలో దేశానికే ఆదర్శంగా నిలిచామని స్పష్టం చేశారు. మౌలిక వసతులకు కేంద్రం బ్జడెట్‌లో నిధులు ఇవ్వలేదన్న మంత్రి... కేంద్రం సహకరించకపోయినా సంక్షేమ కార్యక్రమాలు ఆగవని తెలిపారు. మనఊరు-మనబడి కింద రూ.7289 కోట్లతో మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు వివరించారు. కేంద్ర బ్జడెట్‌లో పేదలకు పనికొచ్చేది ఏదీ లేదు. తెలంగాణ లాంటి ప్రగతిశీల రాష్ట్రానికి మరోసారి మొండిచేయి చూపెట్టారు. ఎన్ని విజ్ఞప్తులు చేసినా.. అన్నింటిని బుట్ట దాఖలు చేశారు. కేంద్రం ఇచ్చినా, ఇవ్వక పోయినా, రాష్ట్రం అభివృద్ధి పథంలో సాగుతుంది. మౌలిక వసతులకు కేంద్రం బ్జడెట్‌లో నిధులు ఇవ్వలేదు. కేంద్రం సహకరించకపోయినా సంక్షేమ కార్యక్రమాలు ఆగవని మంత్రి కేటీ రామారావు అన్నారు. శివారు మున్సిపాలిటీల్లో మంచినీటి పథకాలకు వందల కోట్లు కేటాయిస్తున్నారు మంత్రి కేటీఆర్. చన్నీళ్లకు వేడినీళ్లు తోడు అన్నట్లుగా కేంద్రం నుంచి సహకారం ఆశించామని చెప్పారు. హైదరాబాద్‌లో వరదలు వస్తే ఒక్క రూపాయి ఇవ్వలేదు కానీ... గుజరాత్‌లో వరదలకు మాత్రం రూ.వెయ్యి కోట్లు ఇచ్చారని మండిపడ్డారు. కేంద్రం నిన్న బ్జడెట్ ప్రవేశపెడితే ఏ వర్గానికి ప్రయోజనం కలిగేలా లేదని విమర్శించారు. కేంద్రం సహకరించకపోయినా అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగిస్తామని మరోసారి పునరుద్ఘాటించారు. జవహర్ నగర్ ప్రభుత్వ భూముల్లో ఉన్న వారికి 58, 59 ద్వారా పట్టాలు ఇప్పిస్తామన్నారు. నెల రోజుల్లో 58, 59 జీవోలు తెస్తామన్నారు. డంప్ యార్డ్ సమస్య తగ్గించేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. ఒక్క మేడ్చల్ నియోజకవర్గ పరిధిలో మంచినీటి సరఫరాకు రూ.240కోట్లను ఖర్చు చేస్తున్నాం. 50వేల కనెక్షన్లను 1రూపాయికే ఇస్తాం. రూ.308 కోట్ల రూపాయల అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్నాం. పట్టణ ప్రగతిలో అనేక పనులు చేస్తున్నాం అని పేర్కొన్నారు. ఇదిలావుంటే మేడ్చల్‌లో మంత్రి కేటీఆర్ పర్యటన నేపథ్యంలో కాంగ్రెస్, బీజేపీ నేతలను పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేశారు. జవహర్‌నగర్ మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో మంత్రి కాన్వాయ్‌ను కాంగ్రెస్ నేతలు అడ్డుకున్నారు. జవహర్‌నగర్‌లోని పేదలకు 58, 59 జీఓను తీసుకరావాలని, డంపింగ్ యార్డ్ ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. వెంటనే అప్రమత్తమైన పోలీసులు కాంగ్రెస్ కార్యకర్తలను అరెస్ట్ చేసి జవహర్‌నగర్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

## ఏటా రెండుకోట్ల ఉద్యోగ హామీ ఏమయ్యింది

**ఇప్పటికే 15కోట్ల ఉద్యోగాలు ఇవ్వాల్సింది**
**రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంలో ఖర్గే**

న్యూఢిల్లీ,ఫిబ్రవరి2: ఏటా రెండు కోట్ల ఉద్యోగాలను సృష్టిస్తామని ఇచ్చిన హామీని నెరవేర్చడంలో బీజేపీ నేతృత్వంలోని ప్రభుత్వం విఫలమైందని కాంగ్రెస్ నేత, రాజ్యసభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే ఆరోపించారు. రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ పార్లమెంటు ఉభయ సభలను ఉద్దేశించి చేసిన ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై బుధవారం జరిగిన చర్చలో ఖర్గే మాట్లాడారు. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలను ఇస్తామని బీజేపీ చెప్పిందని, ఇప్పటికి 15 కోట్ల ఉద్యోగాలను ఇచ్చి ఉండవల సిందని చెప్పారు. వాస్తవంగా నేటికి ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ ఏడాది ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రానున్న ఐదేళ్లలో 60 లక్షల ఉద్యోగాలను మాత్రమే కల్పిస్తామని హామీ ఇచ్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలో నిరుద్యోగ సమస్య తీవ్రంగా ఉందన్నారు. పెద్దపెద్ద ఫ్యాక్టరీల మూసివేత, పెట్టుబడులు రాకపోవడం, ప్రభుత్వోద్యోగాల సంఖ్య తగ్గిపోవడం వంటి కారణాల వల్ల యువత తీవ్ర నైరాశ్యంలో ఉన్నారని చెప్పారు. పార్లమెంటు ఉభయ సభలను ఉద్దేశించి రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ జనవరి 31న మాట్లాడుతూ, ప్రపంచంలో అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థల్లో భారత దేశం ఒకటి అని చెప్పారు. 2047 నాటికి అద్భుతమైన, ఆధునిక, అభివృద్ధి చెందిన భారత దేశాన్ని నిర్మించడం కోసం ప్రజలు గట్టి కృషి చేయాలని పిలుపునిచ్చారు. 2047లో భారత దేశం 100వ స్వాతంత్ర్య దినోత్సవాలను జరుపుకుంటుందన్నారు. మనం గట్టిగా శ్రమించి కృషి చేయాలని, తద్వారా సత్ఫలితాలు వచ్చేలా జాగ్రత్తవహించాలని తెలిపారు. ఈ ప్రస్థానంలో మనందరికీ సమాన భాగస్వామ్యం ఉందన్నారు.

బడ్జెట్ సమావేశాల్లో సభ కార్యకలాపాలు సజావుగా జరిగేందుకు సహకరించాలని రాజ్యసభ చైర్మన్ ఎం వెంకయ్య నాయుడు సభ్యులకు విజ్ఞప్తి చేశారు. భారత దేశ పార్లమెంటరీ ప్రజాస్వామ్యంపై ప్రజలకుగల నమ్మకానికి తగినట్లుగా సభ్యులు ప్రవర్తించాలని కోరారు. సభలో అంతరాయాలు కలవరపాటుకు గురి చేస్తున్నాయని పేర్కొన్నారు. పార్లమెంటరీ ప్రజాస్వామ్యంపై ప్రజల విశ్వాసానికి అనుగుణంగా సభ్యులు నడుచుకోవాలని సూచించారు. ఆందోళనల కారణంగా శీతకాల సమావేశాల్లో 52శాతం సభాకాలం వృథా అయిందని గుర్తు చేశారు. ఇదిలావుంటే మలేషియాలో భారీ వరదల కారణంగా మరణించిన వారికి, టోంగా అగ్నిపర్వతం పేలిన ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారికి రాజ్యసభ సభ్యులు సంతాపం తెలిపారు. పార్లమెంటులో బడ్జెట్ ప్రవేశపెట్టిన తర్వాత తొలిరోజు ఉభయ సభలు ప్రారంభమయ్యాయి. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు రాజ్యసభ, సాయంత్రం 4 నుంచి 9 గంటల వరకు లోక్‌సభ సమావేశాలు జరుగుతున్నాయి. బడ్జెట్‌పై రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంతో పాటు రవాణా, పర్యటకం, సాంస్కృతిక అంశాలకు సంబంధించిన 6 నివేదికలను పార్లమెంటరీ కమిటీ ఇవాళ సభ ముందుకు తీసుకురానుంది. అయితే పెగసస్‌పై చర్చ జరపాలని కోరుతూ సీపీఐ రాజ్యసభ ఎంపీ బినోయ్ విశ్వం, సీపీఎం ఎంపీ వాయిదా తీర్మానానికి నోటీసు ఇచ్చారు.

## మతోన్మాదుల గుప్పిట్లో దేశం

చెన్నై,ఫిబ్రవరి2: మతోన్మాదుల గుప్పిట్లోకి వెళ్లి దేశం ప్రమాదంలో ఉందని, మతోన్మాదుల నుంచి దేశాన్ని కాపాడాల్సిన అవసరం ఉందంటూ దేశంలోని 37 మంది జాతీయ, ప్రాంతీయ నేతలకు తమిళనాడు ముఖ్యమంత్రి, డీఎంకే అధినేత స్టాలిన్ లేఖ రాశారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన 'ఆల్ ఇండియా సోషల్ జస్టిస్' వేదికలో తమ పార్టీ నేతలను చేర్చుకోవాలంటూ తాను రాసిన లేఖలో స్టాలిన్ విజ్ఞప్తి చేశారు. సోనియా గాంధీ, లాలూ ప్రసాద్ యాదవ్, ఫారూఖ్ అబ్దుల్లా, శరద్ పవార్, మమతా బెనర్జీ, డి.రాజా, సీతారాం ఏచూరి, చంద్రబాబు నాయుడు, అరవింద్ కేజ్రీవాల్, మెహబూబాముఫ్తీ, కేసీఆర్, ఉద్ధవ్ ఠాక్రే, అఖిలేష్ యాదవ్‌లతో పాటు మరికొందరికి ఈ లేఖలు పంపారు. వీరికే కాకుండా తమిళనాడులోని పార్టీల నేతలకు కూడా పంపారు. ఏఐడీఎంకే కోర్డినేటర్ పన్నీర్‌సెల్వం, పీఎంకే అధినేత రాందాస్, వీసీకే నేత థోల్ తిరుమవలవన్‌లతో పాటు వైకోకి కూడా పంపారు. జాతీయ స్థాయిలో సమాఖ్యవిధానం, సామాజిక న్యాయ సూత్రాలను సాధించే దిశగా కృషి చేసేందుకు అన్ని పార్టీల నాయకులు, పౌర సమాజ సభ్యులు, భావసారూప్యత కలిగిన వ్యక్తులు, సంస్థలను కలిసి ఉమ్మడి వేదికగా ఒక ఫెడరేషన్ తప్పనిసరిగా ఏర్పడింది. ప్రతి ఒక్కటీ ప్రతి ఒక్కరిది అనే సామాజిక న్యాయ భావజాలం చాలా అవసరం. ప్రతి ఒక్కరూ సమానమైన ఆర్థిక, రాజకీయ, సామాజిక హక్కులు, అవకాశాలకు అర్హులని ఈ భావజాలంలో నమ్ముతాం. ఈ సమాన అవకాశాలను అందించిననాడే మన రాజ్యాంగ నిర్మాతల దృష్టిలోని సమానత్వ సమాజాన్ని నిర్మించగలమని లేఖలో స్టాలిన్ పేర్కొన్నారు.

# రాజ్యాంగం రద్దు బీజేపీ ఎజెండా

### బీజేపీ ఎజెండాను అమలు చేసేపనిలో కేసీఆర్
### రాజ్యాంగం రద్దుచేయడమంటే అంబేద్కర్‌ను అవమానించడమే
### యూపిలో బీజేపీని అధికారంలోకి తేవడమే కేసీఆర్, ఓవైసీల లక్ష్యం
### మోడీని, నిర్మలాసీతారమన్‌ను అవమానించేలా కేసీఆర్ వాడిన భాష
### కేంద్ర బడ్జెట్‌తో రైతులు, పేదలకు ఒరిగేదేమీ లేదన్న రేవంత్

న్యూఢిల్లీ,ఫిబ్రవరి2: కేంద్రంలోని బిజెపి మంత్రాన్ని కెసిఆర్ జపిస్తున్నారని, దీన్నిబట్టి కెసిఆర్,బిజెపి ఒకటే అని తేలిపోయిందని పిసిసి చీఫ్ రేవంత్ రెడ్డి అన్నారు. రాజ్యాంగాన్ని తిరగరాయాలన్న బిజెపి నినాదాన్ని కెసిఆర్ ఎత్తుకున్నారని మండిపడ్డారు. ఇది ఓ రకంగా అంబేద్కర్‌ను అవమానించడమే గాకుండా..ఎస్సీ,ఎస్టీల హక్కులు కాలరాయడమే అని అన్నారు. బుధవారం ఆయన ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. రాజ్యాంగం మార్చాలన్నది బీజేపీ కుట్ర... బీజేపీ కుట్రకు కేసీఆర్ వంత పాడారని విమర్శించారు. రాజ్యాంగం రద్దు చేయాలని బీజేపీ ఎన్నో ఏళ్లుగా కుట్ర చేస్తోందన్నారు. కేసీఆర్‌ను ముందుంచి రాజ్యాంగం రద్దు అంశాన్ని తెరమీదికి తెచ్చారని వ్యాఖ్యలు చేశారు. బీజేపీ రాజ్యాంగం రద్దు కుట్రకు కేసీఆర్ మద్దతు తెలిపారని ఆయన ఆరోపించారు. అన్ని జిల్లా, మండల కేంద్రాల్లో అంబేద్కర్ విగ్రహం ముందు కేసీఆర్ దిష్టి బొమ్మలు దగ్ధం చేయాలని పిలుపునిచ్చారు. కేసీఆర్ రాజ్యాంగం రద్దు ఆలోచనను ఉపసంహరించు కునేందుకు రెండు రోజులపాటు గాంధీ భవన్‌లో నిరసన దీక్షలు చేపట్టనున్నట్లు తెలిపారు. రాజ్యాంగం రద్దు ఆలోచనను ఉపసంహరించుకొకపోతే దేశ యువత కేసీఆర్ నాలుక కొస్తారని రేవంత్ హెచ్చరించారు. యూపీలో బీజేపీని గెలిపించాలన్న ఆలోచన కేసీఆర్ చేస్తున్నారన్నారు. కేసీఆర్ అసదుద్దీన్ ఒవైసీ సూపరి గ్యాంగ్ అని వ్యాఖ్యానించారు. యూపీ ఎన్నికల్లో బీజేపీని గెలిపించడానికి సుపారి తీసుకున్నారని తెలిపారు. ఓట్లు చీల్చడానికి ఎంఐఎం పోటీ చేస్తుందని మండిపడ్డారు. మోడీ గెలవడం, రాజ్యాంగం రద్దు ఇవే ప్రధాన అంశాలన్నారు. కేంద్ర బ్జడెట్ గంటన్నర ఉంటే కేసీఆర్ రెండున్నర గంటలు ఏక పత్రాభినయం చేశారని టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి యెద్దేవా చేశారు. కల్తీ మందు తాగి వచ్చినట్లు మాట్లాడారని వ్యాఖ్యానించారు. విభజన చట్టం అంశాలు, కోచ్ ఫ్యాక్టరీ, గిరిజన విశ్వవిద్యాలయం, ఎన్టీపీసీ యూనిట్, రైల్వే లైన్లు, జాతీయ రహదారుల విషయం ఏదీ మాట్లాడలేదన్నారు. మోడీపై యుద్ధం ప్రకటిస్తారని ఆశించినట్లు తెలిపారు. నిర్మలా సీతారామన్, మోడీ గురించి నీచంగా, జుగుప్సాకరంగా కేసీఆర్ మాట్లాడా రన్నారు. రాజ్యాంగాన్ని రద్దు చేయాలని మాట్లాడారని అన్నారు. భూస్వాములు, అగ్రవర్ణాల కోసం రాజ్యాంగాన్ని మార్చాలన్న బీజేపీ మాటలను కేసీఆర్ మాట్లాడినట్లు ఉందని తెలిపారు. రాజ్యాంగాన్ని సవరించుకునే అవకాశం ఉందన టీపీసీసీ చీఫ్... రాజ్యాంగ సవరణ ద్వారా దళితులు, బలహీన వర్గాలకు మేలు చేసే ప్రయత్నం చేయాలని సూచించారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రిగా అసభ్యకరమైన భాష మాట్లాడారని విమర్శించారు. కేసీఆర్ భాషను ఖండిస్తున్నామన్నారు. సిద్ధాంత పరంగా బీజేపీని వ్యతిరేకిస్తాం కానీ... కేసీఆర్ భాషను వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. ప్రధాన మంత్రిని ఉద్దేశించి ముఖ్యమంత్రి అసభ్యంగా మాట్లాడితే తెలంగాణ పరువు ఏం కావాలని ఆయన ప్రశ్నించారు. మహిళలను గౌరవించే సంస్కృతి భారత సంస్కృతి అని చెప్పుకొచ్చారు. కేసీఆర్ భాషను సభ్య సమాజం క్షమించదన్నారు. కేసీఆర్ భాష ఎవరిని ఉద్దేశించి మాట్లాడారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. దేశ ప్రజలకు రాష్ట్ర ప్రజలకు మేలు చేసేది కాంగ్రెస్ పార్టీనే అని స్పష్టం చేశారు. విభజన హామీలు అమలు కావాలంటే కాంగ్రెస్‌తోనే అని రేవంత్ తెలిపారు. ఇకపోతే కేంద్రం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌తో శ్రీమంతులకే ప్రయోజనం చేకూరుతుందని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఆరోపించారు. ఆర్థిక పద్దుతో నిరుపేదలకు ఒరిగిందేమీ లేదన్నారు. జీఎస్టీ సహా ఆదాయపన్ను రేట్లు, స్లాబులు మార్చక పోవడంతో సామాన్యులకు నిరాశే ఎదురైందని పేర్కొన్నారు.సీఎం కేసీఆర్ మాటలు బాధ్యతారహితంగా ఉన్నాయని... రాష్ట్రానికి రావాల్సిన నిధులు గురించి కేసీఆర్ అడగలేదని వ్యాఖ్యానించారు.కొత్త రాజ్యాంగం తేవాలనే కేసీఆర్ ప్రతిపాదన విచిత్రమన్న రేవంత్‌రెడ్డి... భూస్వాములు, పెట్టుబడిదారుల కోసం కొత్త రాజ్యాంగం కోరుతున్నారా.. అని ఆశ్చర్యం వ్యక్తం చేశారు. భాజపా ఆలోచనలనే ఇక్కడ కేసీఆర్ ప్రతిపాదిస్తున్నారని విమర్శించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లు రద్దు చేయాలనేది భాజపా యోచన అన్న రేవంత్... రిజర్వేషన్లు రద్దు కోసం భాజపా కొన్నాళ్లుగా ప్రయత్నిస్తోందని అన్నారు. భాజపా తన ఆలోచనను కేసీఆర్ ద్వారా ప్రతిపాదిస్తోందని ఆరోపించారు. అంబేద్కర్ రచించిన రాజ్యాంగం రద్దు చేసి.. రాజులు, సామంతులు, భూస్వాములు, పెట్టుబడుదారులకు అనుకూలమైన రాజ్యాంగాన్ని రచించాలనే భాజపా ఆలోచనను సీఎం కేసీఆర్ సమర్థించారు. అందుకే నిన్న ఆ ప్రతిపాదన తీసుకొచ్చారు. భాజపా ఒత్తిడితోనే వాళ్ల ఆలోచనను ప్రతిపాదించినట్లు కనిపిస్తోంది. ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లు రద్దు చేయాలని చూస్తున్నారు. అందుకు కేసీఆర్ మద్దతు పలుకుతున్నారు. మోడీ బడ్జెట్‌తో దేశానికి మేలు జరగదని టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి అన్నారు. రైతులకు మేలు, యువకులకు ఉపాధి, మహిళలకు రక్షణ వేటికి ప్రధాన్యత లేదని అన్నారు. మూడు వ్యవసాయ చట్టాలను వ్యతిరేకించి నందుకు రైతులపై కక్షగట్టి వ్యవసాయ రంగానికి కేటాయింపులు తగ్గించారని, ఎరువుల సబ్సిడీ తగ్గించారు. పంటలకు మద్దతు ధర తెస్తారని ఆశించామని ఆయన అన్నారు. రైతుల పోరాటం చూసైనా పంటల మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించ లేదని, కేంద్ర బ్జడెట్ నిరాశ పరిచిందని ఆయన అన్నారు. గోధుమలు, వరికి కొనుగోళ్లకు నిధులు తగ్గించారని, ఉపాధిహామీ పథకానికి నిధులు తగ్గించారని, రైతుల ఆదాయాన్ని రెండింతలు చేయలేదు సరికదా.. పంట పెట్టుబడి రెండింతలయ్యేలా ఎరువుల సబ్సిడీ తగ్గించారు అని ఆయన మండిపడ్డారు.

జిఎస్టీ విధానంలో మార్పులు చేయలేదు.. ఉద్యోగస్తుల కోసం ఎటువంటి నిర్ణయాలు బడ్జెట్‌లో లేవన్నారు.వైద్య మౌలిక వసతుల కోసం నిధుల కేటాయింపులు లేవు.. కరోనా ప్రభావం చూసాక కూడా పేదలకు వైద్యం అందించే చర్యలకు కేటాయింపులు లేవు అని ఆయన వ్యాఖ్యానించారు. వ్యవసాయ రంగం కుంటుపడే పరిస్థితి వచ్చిందని, విద్యార్థులు, రైతులు, ఉద్యోగులు,ఆరోగ్యం ఎవరికి ఉపయోగపడే నిర్ణయాలు లేవని ఆయన అన్నారు.

# ప్రతి పెళ్లిని దౌర్జన్యపూరితంగా పరిగణించలేం

### ప్రతి పురుషుడిని రేపిస్టుగా విమర్శించడం సరికాదు
### రాజ్యసభలో కేంద్రమంత్రి స్మృతిఇరానీ స్పష్టీకరణ

న్యూఢిల్లీ,ఫిబ్రవరి2: ప్రతి పెళ్లినీ దౌర్జన్యపూరితమైనదిగా, ప్రతి పురుషుడినీ రేపిస్ట్‌గా విమర్శించడం సరైనది కాదని కేంద్ర మహిళా, శిశు అభివృద్ధి శాఖ మంత్రి స్మృతి ఇరానీ చెప్పారు. వైవాహిక అత్యాచారం పై సీపీఐ నేత బినయ్ విశ్వం అడిగిన అనుబంధ ప్రశ్నకు సమాధానంగా బుధవారం ఆమె రాజ్యసభలో మాట్లాడుతూ, మహిళలు, బాలలను కాపాడటం అందరికీ ముఖ్యమైన విషయమేనని తెలిపారు. అయితే ప్రతి పెళ్లినీ, ప్రతి పురుషుడినీ విమర్శించాలని చెప్పడం సరైనది కాదన్నారు.

బినయ్ విశ్వం అడిగిన అనుబంధ ప్రశ్నలో, గృహ హింస నిర్వచనంపై గృహ హింస నిరోధక చట్టంలోని సెక్షన్ 3ను, అదేవిధంగా అత్యాచారం పై ఐపీసీ సెక్షన్ 375ను ప్రభుత్వం పరిశీలించిందా? అనే అంశాన్ని తెలుసుకోవాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. దీనిపై స్మృతి ఇరానీ స్పందిస్తూ, ఈ దేశంలో ప్రతి పెళ్ళినీ ఓ దౌర్జన్యపూరితమైన పెళ్లిగానూ, ఈ దేశంలోని ప్రతి పురుషుడినీ ఓ రేపిస్ట్‌గానూ ఈ గౌరవప్రదమైన సభలో విమర్శించడం సరైనది కాదని అన్నారు.



ప్రస్తుతం న్యాయవిచారణలో ఉన్న అంశంపై వివరణాత్మకంగా మాట్లాడటానికి రాజ్యసభ నిబంధనావళిలోని రూల్ 47 ప్రకారం అనుమతి లేదని సీనియర్ సభ్యునికి తెలుసునన్నారు. రాష్ట్రాల సహకారంతో దేశంలోని మహిళలకు రక్షణ కల్పించడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 30 హెల్ప్‌లైన్స్ పని చేస్తున్నాయని, వీటి ద్వారా దాదాపు 66 లక్షల మంది మహిళలకు సహాయం అందిందని చెప్పారు. అదేవిధంగా 703 వన్ స్టాప్ సెంటర్ల ద్వారా 5 లక్షల మందికిపైగా మహిళలు సహాయం పొందారని తెలిపారు. ఇదిలావుండగా వైవాహిక అత్యాచారాన్ని నేరంగా పరిగణించాలంటూ దాఖలైన అనేక పిటిషన్లపై ఢిల్లీ హైకోర్టు విచారణ జరుపుతోంది. భార్యపై భర్త అత్యాచారం చేస్తే, భర్తను భారత శిక్షా స్మృతి ప్రకారం విచారించేందుకు అవకాశం లేదు. భర్తలకు ఇచ్చిన ఈ మినహాయింపును రద్దు చేయాలని ఈ పిటిషన్లు కోరుతున్నాయి. దేశంలోని మహిళలు, చిన్నారులను సంరక్షించడం మన ప్రాథమిక కర్తవ్యం అని అన్నారు కేంద్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి స్మృతి ఇరానీ. అలా అని ప్రతి వివాహం హింసాత్మకం అని ఖండించడం, ప్రతి పురుషుడిని రేపిస్ట్ అని అనడం ఆమోదయోగ్యం కాదని రాజ్యసభలో స్పష్టం చేశారు. గృహ హింస నిర్వచనాన్ని గృహహింస చట్టంలోని సెక్షన్ 3 నుంచి తీసుకుందా? అత్యాచారం నిర్వచనాన్ని ఐపీసీ సెక్షన్ 375 నుంచి తీసుకుందా? లేదా? అని ఎంపీ బినోయ్ విశ్వమ్ ప్రశ్నలు సంధించారు. రూల్ 47 ప్రకారం ప్రస్తుతం న్యాయ విచారణలో ఉన్న అంశాలపై సభలో చర్చించొద్దని సీనియర్ నేతకు తెలుసని స్మృతి ఇరానీ గుర్తుచేశారు. దేశంలోని మహిళల భద్రతకు రాష్ట్రప్రభుత్వాలు తగిన చర్యలు చేపడుతున్నాయని తెలిపారు. 'ప్రస్తుతం దేశవ్యాప్తంగా 30 హెల్ప్‌లైన్ నంబర్లు అందుబాటులో ఉన్నాయి. 66లక్షల మంది మహిళలకు సాయపడ్డాయి. అంతేకాక దేశవ్యాప్తంగా 703 వన్ స్టాప్ సెంటర్లు పనిచేస్తున్నాయి. ఇవి ఇప్పటివరకు 5లక్షల మంది మహిళలు సేవలు అందించాయి.' అని కేంద్రమంత్రి స్మృతి ఇరానీ వివరించారు. వివాహ వ్యవస్థకు అర్థం లేదు..ఒకవేళ భార్యపై బలవంతపు శృంగారాన్ని నేరంగా భావించాలని కేంద్రం భావిస్తే.. వివాహ వ్యవస్థ అన్న పదానికి అర్థం లేదన్నారు భాజపా నేత సుశీల్ మోదీ. గృహహింసపై స్కూల్, కాలేజీ స్థాయిలో అవగాహన కల్పిస్తున్నారా? అని డీఎంకే మహమ్మద్ అబ్దుల్లా రాజ్యసభలో ప్రశ్నించారు.ప్రభుత్వం 'భేటీ బచావో భేటీ పడావో' పథకం ద్వారా విద్యార్థినులకు రాజ్యాంగంలోని హక్కులు, కర్తవ్యాలపై అవగాహన కల్పిస్తున్నట్లు కేంద్రమంత్రి స్మృతి ఇరానీ వివరించారు.ప్రస్తుతం న్యూక్లియర్ కుటుంబాలు అధికమవుతున్న క్రమంలో దేశవ్యాప్తంగా కౌన్సెలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ నేత రజనీ అశోక్‌రావ్ పటేల్ సూచనలు చేశారు. దీనిపై స్పందించిన కేంద్రమంత్రి.. 'సంవాద్' అనే పేరుతో కేంద్రం ఓ హెల్ప్‌లైన్ ప్రారంభించిం దని, దీనిలో భాగంగా మానసిక ఆరోగ్యం సరిగా లేని లక్షమందికిపైగా చిన్నారులకు సేవలు అందించినట్లు తెలిపారు.

# దళితుల వ్యతిరేక పార్టీ బిజెపి

మొదటిపేజీ తరువాయి..

వర్గాల అభివృద్ధికి గొడ్డలి పెట్టనిమంత్రి ఈశ్వర్ అన్నారు.

అబద్దాలు చెప్పి అధికారంలోకి వచ్చి, రాజ్యాంగన్ని మార్చే కుట్రలు చేస్తారు మీరు, శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ స్థాపించిన పార్టీలో ఉండి, దళితుల గురించిమాట్లాడుతారా? దళిత బంధు అమలు అయితే దేశానికి దిక్సూచిగా తెలంగాణ మారుతుందని, పచ్చని రాష్ట్రంలో చిచ్చు పెట్టె కుట్ర చేసింది ఎవరని, నల్ల చట్టాలు ఎందుకు తెచ్చావ్? ఎందుకు వెనకకు తీసుకున్నారాని మంత్రి బిజెపి నాయకులను ప్రశ్నించారు.

జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రుల ఆధునికరణ, డయాలసిస్ సెంటర్, మెడికల్ కాలేజీ తీసుకువచ్చిన విషయం మీకు కనబడకపోతే, అర్థం కాకపోతే మేమేమి చేయలేమని, ఒక్క మెడికల్ కాలేజీ తేని మీరు వైద్యం గురించి. మాట్లాడుతారా? వాస్తవాలకు దూరంగా ఉండి అబద్దాలతో మెప్పించాలని, సోషల్ మీడియా భూతం తో ప్రయత్నం చేస్తే, మీ ఖర్మ..రోజులు దగ్గర పడ్డాయని, ప్రజలు మిమ్మల్ని నమ్మడం లేదని, త్వరలోనే తరిమి కొడతారని ఈశ్వర్ అన్నారు. ఈ సమావేశంలో శాసన సభ్యులు సంజయ్ కుమార్, సుంకె రవిశంకర్, జిల్లాపరిషత్ చైర్పర్సన్ దావా వసంత సురేశ్ పాల్గొన్నారు.

# రాష్ట్రాల హక్కులను కాలరాస్తున్న బీజేపీ

### వాజ్‌పేయ్ హయాంలోనే రాజ్యాంగ కమిటీ వేశారు
### కేంద్రం తీరుతోనే కేసీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు
### బీజేపీ విమర్శలు అసంబద్దంగా ఉన్నాయి

నదుల అనుసంధానం ఓ డ్రామా అన్న వినోద్

హైదరాబాద్,ఫిబ్రవరి2: బీజేపీ అధికారంలోకి వచ్చాక రాష్ట్రాల హక్కులను కాలరాస్తున్నారని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్ కుమార్ మండిపడ్డారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ గోదావరిని కావేరితో ఎలా అనుసంధానం చేస్తారని ప్రశ్నించారు. రాష్ట్రాలతో మాట్లాడకుండ అనుసంధానంపై కేంద్రం నిర్ణయం ఎలా తీసుకుంటుందని నిలదీశారు. యూపీలో ఎన్నికలు ఉన్నాయి కాబట్టి నిధులు ఇచ్చారన్నారు. రేపు కర్ణాటకలో ఎన్నికలు ఉన్నాయి.. అక్కడ కూడా నిధులు ఇస్తారన్నారు. మరి తెలంగాణ పరిస్థితి ఏంటని ఆయన మండిపడ్డారు. ఈ విషయాలన్నీ దృష్టిలో పెట్టుకుని రాజ్యంగాన్ని మార్చాలని సీఎం కేసీఆర్ కోరారని తెలిపారు. రాజ్యంగాన్ని పున:పరిశీలన చేయాలని గతంలో ఎన్డీఏ ప్రభుత్వం 11 మందితో కమిటీ వేసింది నిజం కాదా అని అన్నారు. వాజపేయి ప్రధాని గా ఉండగా రాజ్యాంగం పై సమీక్షకు 11 మందితో కమిటీ వేసింది. వెంకటచలయ్యా కమిషన్ వేసిందన్నారు. ఇది బీజేపీ నేతలకు తెలియదా అని ప్రశ్నించారు. రాజ్యంగ సవరణ కోసమే ఆర్టికల్ 368 పెట్టారని తెలిపారు. కేసీఆర్ మాటలను వక్రీకరించి దళితులను బీజేపీ నేతలు రెచ్చగొడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దళిత, గిరిజనుల కోసం మాట్లాడిన ఏకైక నాయకుడు కేసీఆర్ అన్నారు. హైదరాబాద్ ప్రతిష్టతను తగ్గించేందుకు అహ్మదాబాద్‌లో గిఫ్ట్ సిటీ పెట్టారన్నారు. బీజేపీ అంటే ఉత్తరాది పార్టీ అని ఆయన వ్యాఖ్యానించారు. భారతదేశంలో నదుల అనుసంధానం చేస్తామని 50 ఏళ్ళ నుంచి చెప్తున్నారన్నారు. సౌత్‌లో సుప్రీంకోర్టు బెంచ్ పెట్టాలని ఎన్నిసార్లు అడిగినా పట్టించుకోరని అన్నారు. గవర్నర్ పాత్ర పై చర్చ జరగాలని తెలిపారు. మమతా బెనర్జీపైన అక్కడి గవర్నర్ ట్వీట్ ఎలా చేస్తారని ప్రశ్నించారు. కేంద్ర, రాష్ట్ర సంబంధాలపై చర్చ జరగాలని చెప్పారు. అవసరాన్ని బట్టి రాజ్యంగాన్ని సవరించాలని బీఆర్ అంబేద్కర్ స్పష్టంగా పేర్కొన్నారని వినోద్ కుమార్ గుర్తు చేశారు. తెలంగాణలో ఒక్క ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వడం లేదు కానీ ఎన్నికలు జరుగుతున్న రాష్ట్రాలకు నిధులు జారీ చేస్తుందని ఆయన అన్నారు. గోదావరి నది జలాలను కావేరి లోకి ఎలా తీసుకెళ్తారని ఆయన ప్రశ్నించారు. ప్రధాని కొన్ని స్టబెక్టులకే ప్రధాని.. అన్నింటిలో వేలు పెట్టడానికి లేదని ఆయన అన్నారు. కేసీఆర్ కొత్తగా చెప్పింది ఏమి లేదని, బీజేపీ మాటలు నమ్మొద్దని, రెచ్చగొట్టే మాటలను లెక్క చేయొద్దని వినోద్ అన్నారు. హైదరాబాద్ లో ఆర్బిట్రేషన్ సెంటర్ వస్తే దాన్ని నిర్వీర్యం చేసే ప్రయత్నాలు చేశారు. హైదరాబాద్ ప్రజలు ఆలోచించాలని ఆయన అన్నారు. బీజేపీ ఉత్తర భారత దేశ పార్టీ అని వినోద్ వ్యాఖ్యానించారు. నదుల అనుసంధానం పై డీపీఆర్ తయారు ఆయిందని చెప్పడం బక్వాస్ అని ఆయన అన్నారు. సుప్రీంకోర్టు బెంచ్ దక్షిణాదిలో పెడితే దేశం విచ్ఛిన్నం అవుతుందని గతంలో ఉన్న చీఫ్ జస్టిస్ మాట్లాడారని ఆయన గుర్తు చేశారు.



## కంటి ఆపరేషన్ కోసం హైదరాబాద్ తరలింపు

**జనగామ ఫిబ్రవరి 02 (ప్రజామంటలు):** లయన్స్ క్లబ్ ఆఫ్ జనగామ ఆధ్వర్యంలో గత వారం రోజుల పాటు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించి అందులో 24 మందికి ఆపరేషన్స్ అవసరమని నిర్ణయించి వారిని, గత వారం పరీక్షలు చేసుకున్న18 మందిని ఉచితంగా బస్ లో హైదరాబాద్ లోని ఎం.ఎస్. రెడ్డి లయన్స్ కంటి హాస్పిటల్ కి బుధవారం ఉచిత కంటి ఆపరేషన్స్ కోసం తరలించారు. ఈ కార్యక్రమములో అధ్యక్షులు జైన రమేష్, జోన్ చైర్మన్ తీరుపల్లి కృష్ణా రెడ్డి,యెడమ సంజీవ రెడ్డి, కార్యదర్శి యెడమ మోహన్ రెడ్డి, తొదుపునూరి వెంకట నారాయణ, రేష్మా, నరేందర్, పాల్గొన్నారు.

## విద్యార్థులకు మత్తు పదార్థాలపై అవగాహన సదస్సు

**కామారెడ్డి ఫిబ్రవరి 02 (ప్రజామంటలు):** జిల్లాలోని బాన్స్వాడ పట్టణ కేంద్రంలోని కోన బాన్సువాడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సబ్ ఇన్స్పెక్టర్ సాయికుమార్ ఆధ్వర్యంలో విద్యార్థిని, విద్యార్థులకు మత్తుపదార్థాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు



మత్తు పదార్థాల వాడకం వల్ల బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని మత్తు పదార్థాలకు వినియోగించకూడదు అని వారికి తెలిపారు. అదేవిధంగా గ్రామీణ ప్రాంతాల్లో రైతులు గంజాయి పంటను వేస్తారని ఈ విషయంపై సైతం విద్యార్థిని విద్యార్థులు తల్లిదండ్రులకు అవగాహన కల్పించి మత్తుపదార్థాలను పూర్తిగా నిషేధించాలి అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, అసిస్టెంట్ సబ్ ఇన్స్పెక్టర్ సదాశివ, కానిస్టేబుల్ ఇద్రిస్, హోంగార్డు సంతోష్ రెడ్డి తదితరులు ఉన్నారు.

## బహుజన వారియర్స్ గ్రంథాన్ని బి.ఎస్. రాములుకు అందజేసిన గవర్రాజు

**హైదరాబాద్ ఫిబ్రవరి 02 (ప్రజామంటలు):** దరకమే ఐక్య వేదిక నాయకులు బహుజన వారియర్స్ గ్రంథకర్త రిటైర్డ్ ఎండిఓఎ గవర్రాజు ఫ్లాట్ లో అగ్ని ప్రమాదం



జరిగిన విషయం తెలిసి ఎల్.బి. నగర్ లోని వారి ఇంటికి వెళ్లి సామాజిక తత్వవేత్త బి.ఎస్. రాములు పరామర్శించారు. ఇంటి మరమ్మత్తు పనులు పరిశీలించి అవసరమైన సలహాలు ఇవ్వటం ఇచ్చారు. బి.ఎస్. రాములుతో పాటు హైదరాబాద్ జిల్లా దళిత శక్తి నాయకులు రాములు లెక్చరర్ కృష్ణ, సివిల్ ఇంజనీర్ రవి ప్రకాష్ ఉన్నారు. ఈ సందర్భంగా ఎ. గవర్రాజు తన గ్రంథం బహుజన వారియర్స్ బహుకరించారు.

## నాయకులకు ఆహ్వానం సందడి

### - జర్నలిస్టుల, నాయకుల జేబులు కొట్టిన దొంగలు

**మల్యాల ఫిబ్రవరి 02 (ప్రజామంటలు):** కొండగట్టు టీఆర్ఎస్ ప్రోగ్రాంలో దొంగలు తమ చేతి వాటం ప్రదర్శించారు. దాదాపు 10 మంది నాయకుల, జర్నలిస్టుల జేబులు కొల్లగొట్టి సుమారు లక్ష రూపాయల వరకు దండుకున్నారు. వివరాల్లోకి వెళ్తే... టిఆర్ఎస్ పార్టీ జగిత్యాల జిల్లా అధ్యక్షునిగా విద్యాసాగర్ రావు ఎన్నికైన సందర్భంగా బుధవారం కొండగట్టు అంజన్న ఆలయానికి మరియు జిల్లాకు వచ్చాడు. ఈ సందర్భంగా చొప్పదండి ఎమ్మెల్యే సుంకే రవి శంకర్ భారీ ఎత్తున స్వాగత కార్యక్రమం ఏర్పాటు చేశారు. పూడూర్ లో మంత్రి ఈశ్వర్, ఎమ్మెల్యే విద్యాసాగర్ రావు, ఎమ్మెల్సీ రమణలకు స్వాగతం పలికారు. పెద్ద ఎత్తున కార్యకర్తలు గుమి గూడటంతో దొంగలు తమ చేతులకు పని చెప్పారు. ఓ వైపు లీడర్లను ప్రసన్నం చేసుకునే నాయకుల జేబులు, ప్రోగ్రాం కవరేజ్ కి వెళ్లిన మీడియా వాళ్ళ జేబులు కొల్లగొట్టారు. సుమారు లక్ష రూపాయల వరకు దొంగలు దోచుకున్నారు. దీంతో మింగ లేక, కక్క లేక అన్నట్లుగా ఉంది నాయకుల పరిస్థితి.

## సహాయ నిధి చెక్కులు పంపిణీ

**నర్మెట బల్లారి ఫిబ్రవరి 02 (ప్రజామంటలు):** మండల కేంద్రంలోని మచ్చుపహాడ్ గ్రామానికి చెందిన ఇద్దరి కి ఉశికబాయ్ తండా గ్రామానికి చెందిన ఒక్కరికి సీఎం రిలీఫ్ ఫాండ్ చెక్కులను గ్రామ పంచాయతీ సర్పంచ్ రామిని శివరాజు ఆధ్వర్యంలో టిఆర్ఎస్ జిల్లా నాయకులు పెద్ది రాజిరెడ్డిగారి లబ్ధిదారులకు పంపిణీ చేశారు. బానోత్



కిషన్ కు 60,000 లింగాల ఎల్లయ్య కు 21,000, గుండేటి పర్వతలుకు 11,000 రూపాయల చెక్కులను పంపిణీచేశారు. ఈకార్యక్రమంలో ఎంపిటిసి బానోత్ లలిత సోంల, ఉశికబాయ్ తండా గ్రామ సర్పంచ్ బానోత్ అనిత మంగనియా, మచ్చుపహాడ్ వార్డు సభ్యులు వెలుపుల రాజు, మామిడాల.వెంకటయ్య, గ్రామటిఆర్ఎస్ అధ్యక్షులు వసూపరి రాజు, గజ్జెల్లి రాజు, సుర దేవరాజు, గొల్లపల్లి చిన్న కుమారస్వామి, బొట్టు నగేష్, బానోత్ ఎంసీ, బానోత్ హుస్సేన్, బానోత్ హనుమంతు, తదితరులు పాల్గొన్నారు.

## యువత హక్కులను కాలరాస్తున్న కేంద్ర ప్రభుత్వం

**కరీంనగర్ ఫిబ్రవరి 02 (ప్రజామంటలు):** దేశంలో నిరుద్యోగ యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని నిరుద్యోగులను మోసం చేసిందని వారు విమర్శించారు. ప్రభుత్వరంగ సంస్థలను బలోపేతం చేయకుండా బడా కార్పొరేట్ యాజమాన్యాలకు ప్రభుత్వరంగ సంస్థలను




డివైఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుపతి విమర్శించారు. కరీంనగర్ పట్టణం కమాన్ చౌరస్తా వద్ద డివైఎఫ్ఐ గిరిజన సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిన్న ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో నిరుద్యోగ యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా నల్ల గుడ్డ తో నిరసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం డివైఎఫ్ఐ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు నరేష్ పటేల్ తిరుపతి మాట్లాడుతూ అధికారంలోకి రాకముందు మోడీ ప్రభుత్వం సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు భర్తీ చేస్తామని హామీ ఇచ్చి నేడు లక్ష ఉద్యోగాలు కూడా భర్తీ చేయకుండా అప్పజెప్పి నిరుద్యోగ యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు లేకుండా మోడీ ప్రభుత్వం యువత హక్కులను కాలరాస్తున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. రానున్న రోజుల్లో ఉద్యోగ ఉపాధి అవకాశాలు కనిపించకపోతే కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా మరింత ఆందోళన కార్యక్రమాలు చేయడానికి సిద్ధం అవుతున్నట్లు వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం నగర ప్రధాన కార్యదర్శి జి. రవీందర్ నాయక్, డివైఎఫ్ఐ నాయకులు వంశీ, నరేష్, సునీల్, లక్ష్మణ్, శేఖర్, సంఘం నాయకులు జి. శ్రీనివాస్, రాజు, రాజేందర్, రవి, తదితరులు పాల్గొన్నారు.

### విద్యా, యువజన రంగాలను

# విస్మరించిన కేంద్ర బడ్జెట్

### కరీంనగర్‌లో ట్రిపుల్ ఐటీ ఏర్పాటు ప్రతిపాదన లేకపోవడం సిగ్గుచేటు

**చిగురుమామిడి ఫిబ్రవరి 02 (ప్రజామంటలు):** కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2022-23 వార్షిక బడ్జెట్లో విద్యా రంగాన్ని కేంద్రం పూర్తిగా విస్మరించిందని ఏఐఎస్ఎఫ్ డిస్ట్రిక్ట్ జాయింట్ సెక్రెటరీ చట్ల సమ్మయ్య అన్నారు.

ఈ బడ్జెట్‌లో కరీంనగర్‌లో ట్రిపుల్ ఐటీ ఏర్పాటు ప్రతిపాదన వస్తుందని ఆశించిన కనీస స్పందన లేదని దీనిపై కేంద్రం పై ఒత్తిడి తీసుకురావడంలో ఎంపీ బండి సంజయ్ పూర్తిగా వైఫల్యం చెందరని అలాగే విద్య కు బడ్జెట్ లో కనీసం 10%నిధులు కేటాయించాలని కొఠారి కమీషన్ నివేదించిన 8% కూడా కేటాయింపు లేదని అంతే కాకుండా విద్యకు అధిక ప్రాధాన్యత లేదని కేంద్ర ప్రభుత్వనికి ప్రైవేటీకరణపై ఉన్న శ్రద్ధ ప్రభుత్వ రంగ సంస్థలు, ప్రభుత్వ విద్యాసంస్థల బలోపేతంపై లేదని ప్రభుత్వ విద్యాసంస్థల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కనీస ప్రాధాన్యత నిధులు ఇవ్వలేదని యూనివర్సిటీ విద్యా ర్థులకు పెలోషిప్‌ల పెంపు లేదని, డిజిటల్ విద్య అంటున్న కేంద్రం గ్రామీణ ప్రాంత విద్యార్థులకు డిజిటల్ విద్య సాధ్యమేన గత రెండు ఏళ్లుగా కరోనాతోనే ఆన్లైన్ తర గతులు జరిగిన చాలా మంది విద్యార్థులు ఆన్లైన్ తరగ తులకు దూరమయ్యారని ఆచరణలో సాధ్యం కాని హామీలు ఇవ్వడం సరికాదని విదేశీ యూనివర్సిటీలకు పెద్ద పీట వేస్తూ దేశీయ ప్రభుత్వ యూనివర్సిటీలను

నిర్వీర్యం చేస్తున్నారని అలాగే యువజనులకు కొత్తగా ఉపాధి అవకాశాల కల్పన చేయలేదని కేంద్ర ప్రభుత్వం చెప్పిన సంవత్సరానికి 2కోట్ల ఉద్యోగల భర్తీ ఊసే లేదని, ఈ బడ్జెట్ పేద, మధ్య తరగతి వర్గాల వారికి ఈ బడ్జెట్ తో ఒరిగింది ఏమి లేదని సమ్మయ్య అన్నారు.

# ఈ మండలానికి ఏమైంది?

### మూడు క్వార్టర్లు, ఆరు ఫుల్ బాటిళ్లుగా బెల్టు దందా!
### మరోవైపు మూడు ట్రాక్టర్లు, ఆరు ట్రాలీలు ఇసుక దందా!

**భీమదేవరపల్లి ఫిబ్రవరి 02 (ప్రజామంటలు):** భీమదేవర పల్లి మండలంలో బెల్ట్ షాపుల, అక్రమ కృత్రిమ ఇసుక వ్యాపారం యథేచ్ఛగా కొనసాగుతోంది. వ్యాపారులు ఇష్టా



రాజ్యంగా వ్యవహరిస్తూ చేస్తున్న ఈ నయా దోపిడీతో ప్రజల జేబులు గుల్ల అవుతున్నాయి. మద్యం వ్యాపారులేమో తమ దందాను మూడు క్వార్టర్లు, ఆరు ఫుల్ బాటిళ్లుగా కొనసాగిస్తుండగా, కృత్రిమ అక్రమ ఇసుక వ్యాపారులేమో మూడు ట్రాక్టర్లు, ఆరు ట్రాలీలుగా విజృంభిస్తున్నారు. యథేచ్ఛగా కొనసాగుతున్న ఈ దందాలపై ప్రజల నుంచి తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వ నిబంధనల మేరకు వైన్స్ షాపుల యజమానులు ఎమ్మార్పీ ధర కంటే అధికంగా అమ్మవద్దని నిబంధనలు ఉన్నప్పటికీ ప్రతి వైన్స్ షాప్ ఎమ్మార్పీ రేట్లకు మించి విక్రయి స్తున్నారు. ఇదిలా ఉండగా, నాసిరకం ఇసుకతో భవనాలు బీటలు వారుతాయని తెలిసి ప్రజలను మోసం చేస్తున్నారని మండల ప్రజలు ఆరోపిస్తున్నారు. మండలంలోని ప్రతి గ్రామంలో బెల్ట్ షాపుల దందా దర్జాగా కొనసాగుతుంది. వైన్స్ నిర్వాహకులు బెల్టుషాపులకు అమ్మే వారికి బాటిల్ కు అదనంగా వసూలు చేస్తున్నట్టు తెలుస్తోంది. దీనితో బెల్ట్ షాపు నిర్వాహకులు క్వార్టర్ బాటిల్ పై 40 నుండి 50 రూపాయల చొప్పున అదనంగా వసూలు చేస్తున్నట్లు మందు బాబులు ఆరోపిస్తున్నారు. కృత్రిమ అక్రమ ఇసుక వ్యాపారులు నదులు, వాగుల నుండి తెప్పించిన ఇసుక అని నమ్మిస్తూ నాసిరకం ఇసుకను అమ్ముతున్నారు. అధికారుల దృష్టికి ఎన్నిసార్లు తీసుక పోయినప్పటికీ ఫలితం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. గ్రామాలలో బెల్టుషాపుల దందాను కట్టడి చేయడంలో ఎక్సైజ్ శాఖ అధికారులు విఫల మవుతు న్నారనే విమర్శలు వస్తున్నాయి. ఎక్సైజ్ అధికారులకు పిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. వ్యాపారులకే ఎక్సైజ్ అధికారులు అండగా నిలుస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. ఇప్పటికైనా జిల్లా ఎక్సైజ్ శాఖ అధికారులు స్పందించి బెల్ట్ షాపుల్లో మద్యం విక్రయించ కుండా కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

### ఆసరా పింఛన్లు మంజూరు చేయాలని

## సిపిఐ ఆధ్వర్యంలో ధర్నా, వినతిపత్రం

**చిగురుమామిడి ఫిబ్రవరి 02 (ప్రజామంటలు):** మండలంలో అర్హులైన వికలాంగులకు, వృద్ధులకు, వితంతు వులకు, ఒంటరి మహిళలకు,బోదకాలు ఉన్న వారికి వెంటనే ఆసరా పింఛన్లు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ సిపిఐ పార్టీ మండల శాఖ కార్యదర్శి నాగెల్లి లక్ష్మారెడ్డి



ఆధ్వర్యంలో బుధవారం ఎంపీడీవో కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. అనంతరం మండల పరిషత్ సూపరెంటెంట్ ఖాజామొయినుద్దీన్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా నాయకులు, మాజీ జెడ్పిటిసి అందే స్వామి మాట్లాడుతూ.... గత నాలుగున్నర సంవత్సరాలుగా అధికారంలోకి వచ్చిన టిఆర్ఎస్ ప్రభుత్వం ఆసరా ఫింఛను ఇవ్వకపోవడం సిగ్గుచేటన్నారు. అర్హులైన పింఛన్దారులు గ్రామపంచాయతీల చుట్టూ, ప్రభుత్వ కార్యాలయల చుట్టూ చెప్పులరిగేలా తిరుగుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే మండలంలోని 17 గ్రామాల్లో ఆసరా పింఛన్ల కు అర్హులను వారిని గుర్తించి పింఛన్లను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు, ధర్నాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి నాగెల్లి లక్ష్మారెడ్డి, సీతారాంపుర్ సర్పంచ్ గోలి బాపు రెడ్డి, నాయకులు ఎనగందుల రాజయ్య, తెరాల సత్యనారాయణ, కయ్యం వీరన్న పటేల్, కయ్యం తిరుపతి పటేల్, మల్లారెడ్డి, మాజీ ఎంపిటిసి పరకాల కొండయ్య, గందే కొమురయ్య, ఇరాక్ శ్రీనివాస్, శ్రీనివాస్, ర్యాకం అంజవ్వ, రజిత తదితరులు పాల్గొన్నారు.



### కొత్తకొండ హుండీ లెక్కింపు

## రూ. 21,35,767 ఆదాయం

**భీమదేవరపల్లి ఫిబ్రవరి 02 (ప్రజామంటలు):** వీరభద్రస్వామి దేవస్థానం కొత్తకొండ ఈ రోజు హుండీ లెక్కింపు కార్యక్రమం నిర్వహించారు. ఇందులో నోట్లు 20,06,056 కాయిన్స్ 1,29,711 మొత్తం 21,35,767 రూ.ల హుండీ ఆదాయం వచ్చిందని ఈఓ వెంకన్న తెలిపారు. ఇవే గాక 71 గ్రాముల 800 మి. గ్రా. మిశ్రమ బంగారం, 5 కిలోల 200 గ్రాముల మిశ్రమ వెండి 77 విదేశీ కరెన్సీ నోట్లు వచ్చాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్స్పెక్టర్ అనిల్, ఆలయ చైర్మన్ మాడిశెట్టి కుమారస్వామి, ధర్మకర్తలు సిబ్బంది మరియు వేంకటేశ్వర సేవా సమితి వరంగల్, అర్చకులు సిబ్బంది పాల్గొన్నారు.

### రాజ్యాంగాన్ని కించపరిచిన

## కేసీఆర్ తీరుకు నిరసన

**భీమదేవరపల్లి ఫిబ్రవరి 02 (ప్రజామంటలు):** బుధవారం రేవంత్ రెడ్డి మరియు నాయిని రాజేందర్ రెడ్డి పిలుపు మేరకు కేసీఆర్ రాజ్యాంగాన్ని కించ పరిచిన తీరుకు నిరసన తెలిపారు. భీమదేవరపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఉసకోయిల



ప్రకాష్ అధ్వర్యంలో ఓద్దుల సంపత్, రంగు రాజు గౌడ్, మీస మహేష్, పోన్నాల మురళి, బొల్లంపల్లి రాజయ్య, రంగు మణీదీప్ గౌడ్, మాడుగుల యాదగిరి, మాడుగుల మహేష్, గనవేన కోమురయ్య, తాళ్లపల్లి కిరణ్, చిట్కురి రామచంద్రము, సదానందం, మాట్ల మొగిళి, ప్రభాకర్, పచ్చునూరి సదానందం, చిలుక ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.

## కేటీఆర్ సేవా సమితి జనగామ జిల్లా కమిటి

**జనగామ ఫిబ్రవరి 02 (ప్రజామంటలు):** కేటీఆర్ సేవా సమితి రాష్ట్ర కమిటీ ఫౌండర్ అద్యక్షులు ఎం.ఎ. ముజీప్ అధ్యక్షతన బుధవారం నిర్వహించి జనగామ జిల్లా



కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా ఎనుగుతల యాదగిరి, ప్రధాన కార్యదర్శులుగా వంగరి అశోక్ (డీజే), ఉపాధ్యక్షులుగా పంతులు ప్రభాకర్ రావు ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ సేవా సమితి కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సేవా సమితి రాష్ట్ర అధికార ప్రతినిధులు ఆకారపు మోహన్, తిరుమల గంటి సంతోష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### గ్రామాల్లో జోరందుకున్న

## బంగారాల తులాభారం

**చిగురుమామిడి ఫిబ్రవరి 02 (ప్రజామంటలు):** మండలంలోని 17 గ్రామాలలో జోరందుకున్న ఎత్తు బంగారాలు బుధవారం పెద్ద ఎత్తున మండలంలోని ఇందుర్తి



గ్రామంలో జోరందుకున్న సమ్మక్క, సారలమ్మ తమ ఎత్తు బంగారం లు ఇవ్వడం జరిగింది. రెండు సంవత్సరాలకు ఒకసారి జరిగే సమ్మక్క. సారలమ్మ జాతరకి పెద్ద ఎత్తున భక్తులు మొక్కులు చెల్లిస్తారు. మండల రైతు సంఘం అధ్యక్షులు కాంతాల శ్రీనివాస్ రెడ్డి తన ఎత్తు బంగారాన్ని తులాభారం వేశారు. మేడారం వెళ్ళినప్పుడు తన ఎత్తు బంగారాన్ని ఇస్తానని మొక్కలు మొక్కినట్లు తెలిపారు. ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉంటూ రైతులందరూ పంటలు పండి అభివృద్ధి చెందాలని కోరుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో యువసేన యూత్ అధ్యక్షులు రఘునాథ్ రెడ్డి గట్టు ఎల్లయ్య, కుట్ల శ్రీను, భరత్, శ్రీకాంత్ రెడ్డి, రాజు, రవి, తదితరులు పాల్గొన్నారు.

## మేడారం జాతరకు
# ఆర్.టి.సి ప్రత్యేక బస్సులు

**జనగామ ఫిబ్రవరి 02 (ప్రజామంటలు):** జనగామ జిల్లా ప్రజలు మేడారం మహా జాతరకు జనగామ ఆర్ టి సి డిపో ప్రత్యేక బస్సులు నడుపనున్నారు. ఈ బస్సులు ఫిబ్రవరి 13 తేది నుండి 19వ తేది వరకు 24 గంటలు జనగామ పట్టణము లోని ప్రిస్టన్ గ్రౌండ్ నుండి స్టేషన్ ఘన్‌పూర్ బస్సు స్టేషన్ నుండి బస్సులు వెళ్లుతాయి.

మేడారం మహా జాతర టికెట్ ధరలు: ప్రిస్టన్ గ్రౌండ్ నుండి జనగాం నుండి, స్టేషన్ ఘన్‌పూర్ బస్సు స్టేషన్ నుండి పెద్దలకు రూ. 290, 250 లు గా చిన్న పిల్లలకు రూ. 160, 140 లుగా నిర్ణయించారు. ఫిబ్రవరి 13 తేది నుండి 19 వ తేది వరకు పల్లెవెలుగు బస్సులు అన్ని పల్లెలకు తిప్పబడుతాయి. భక్తులు ఆర్.టి.సి. బస్సుల ద్వారా జనగామ లేదా స్టేషన్ ఘన్ పూర్ బస్సు స్టేషన్ చేరుకుకుని మేడారం వెళ్ళగలరని ఆర్.టి.సి విజ్ఞప్తి చేస్తుంది. ఫిబ్రవరి 12 వరకు 30 లేదా 40 మంది కలసి ఫోన్ చేస్తే మీవూరికి మీ ఇంటి వద్దకు మేడారం వెళ్ళుటకు బస్సులు పంపబడుతాయని కావలసినవారు ఫోన్ 9959226050 / 8500458443 లో సంప్రదింపులు జరపవచ్చు. ఆర్.టి.సి. బస్సులు గద్దెల వరకు వెళ్తాయి. కాని ప్రైవేటు వాహనాలు చాల దూరం ఆపబడుతాయి. సోడియం హైపో క్లోరైడ్ తో సానిటైజ్ చేసిన బస్సులను అందించబడును. మేడారం మహా జాతర కొరకు అదనముగా 245 బస్సులు జనగామ నుండి నడపబడుతాయని అధికారులు తెలిపారు.

## నిబంధనలు కాగితాల్లో....
# ప్రాణాలు ప్రమాదాల్లో....
### చేతలకు, అసలుకు పొంతన లేదు

**సికింద్రాబాద్ ఫిబ్రవరి 02 (ప్రజామంటలు):** హైదరాబాద్ సిటీని అంతర్జాతీయ స్థాయి నగరంగా తీర్చిదిద్దుతాము. ఇక్కడ ప్రమాదకరమైన పారిశుద్ధ పనుల్లో మానవ రహిత అత్యాధునికమైన యంత్రాలను వాడుతాం, రక్షణ చర్యలు చేపడతాం అంటూ ఊదర గొట్టే పాలకుల మాటలకు క్షేత్రస్థాయిలోని చేతలకు, అసలుకు పొంతన ఉండటం లేదు. ఇటీవల సిటీలోని పలు ప్రాంతాల్లో అండర్ గ్రౌండ్ డ్రేనేజీ కాల్వల్లో సిల్ట్



తీయడానికి కూలీలు వెళ్ళి ప్రాణాలు పోగొట్టుకున్న హృదయ విదారక సంఘటనలు చోటుచేసుకున్న సంగతి విదితమే. ఈ విషాద ఘటనల తర్వాత తేరుకున్న ఉన్నతాధికారులు ఇకపై డ్రైనేజీ కాల్వల్లోకి ఎవరు కూడ దిగకూడదని, కేవలం యంత్రాలను ఉపయోగించి మాత్రమే పనులు చేయాలని నిబంధనలు పెట్టారు. అయితే మంగళవారం బన్సీలాల్ పేట డివిజన్ లోని ఐడీహెచ్ కాలనీలో డ్రైనేజీ క్లీన్ చేసే సమయంలో కూలీలు ఎలాంటి రక్షణ చర్యలు తీసుకోకుండా అండర్ గ్రౌండ్ డ్రైనేజీలోకి దిగి పనులు నిర్వహించారు. గత అనుభవాలను మరిచి, తిరిగి అదే నిర్లక్ష్యాన్ని చూపుతున్న అధికారుల పనితీరుకు ఇది అద్దం పడుతోంది.

# బీసీలు ఆత్మగౌరవంతో జీవించాలి
### మంత్రి గంగుల కమలాకర్

**హైదరాబాద్ ఫిబ్రవరి 02 (ప్రజామంటలు):** ముఖ్యమంత్రి కెసిఆర్ ఆదేశాల మేరకు బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా నిర్మించనున్న ఆత్మగౌరవ భవనాల నిర్మాణం కోసం నేడు ఎంసిఆర్హెచ్ఆర్డి లో సహచర మంత్రులు తలసాని శ్రీనివాస్ యాదవ్, వి. శ్రీనివాస్ గౌడ్, ఎంపీ బీబీ పాటిల్, బీసీ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశంతో కలిసి బీసీ సంక్షేమ మంత్రి గంగుల కమలాకర్ మొదటగా 14



రిజిస్టర్డ్ కుల సంఘాలకు ఆత్మగౌరవ భవనాల నిర్మాణ అనుమతి పత్రాలను అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ బిసి ఆత్మగౌరవ భవనాల నిర్మాణం కల సాకారం కాబోతుంది. ముఖ్మంత్రి కేసీఆర్ సంకల్పించిన విదంగా వెనుకబడిన వర్గాల ఆత్మగౌరవం నిలిపేలా రాజదాని నడిబొడ్డున అద్భుత నిర్మాణాలు రూపుదాల్చబోతున్నాయి అన్నారు. ఇందులో ఏక సంఘంగా ఏర్పడిన పద్నాలుగు సంఘాలకు 1.దేవాంగ, 2. పట్కారీ, 3.పూసల, 4.లక్కీమారి కాపు, 5.రంగ్రీజ్ /భవసారా, 6.అగర్వాల్ సమాజ్, 7.నీలి, 8.జాన్డ్ర, 9.మేర, 10.చాత్తాద శ్రీవైష్ణవ, 11.ఎల్లాపు, 12.మేదరి, 13.బసవేశ్వర భవన్ (లింగాయత్), 14.భట్రాజు కుల ఏక సంఘాలకు మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల కేంద్రం హైదరాబాద్లో బిసి ఆత్మగౌరవ భవనాల అనుమతి పత్రాలను మంజూరు చేయడం జరిగింది.

## వికలాంగుల అవసరాలను విస్మరించిన కేంద్ర బడ్జెట్

**జనగామ ఫిబ్రవరి 02 (ప్రజామంటలు):** దేశ రాష్ట్రపతి ప్రసంగం స్ఫూర్తికి భిన్నంగా వికలాంగుల అవసరాలను విస్మరించె విధంగా కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ ప్రవేశ పెట్టిందని దీనితో వికలాంగుల సంక్షేమం గాలిలో దీపంగా మారిందని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక(ఎన్పిఆర్డి) తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు బిట్ల గణేష్ విమర్శించారు. బుధవారం జనగామ పట్టణ కేంద్రంలోని ప్రజాసంఘాల కార్యాలయంలో సంఘం జిల్లా అధ్యక్షులు పాముకుంట్ల చందు ఆధ్వర్యంలో నిర్వహించిన పత్రిక ప్రకటన విడుదల చేశారు.



2022 జనవరి 31న పార్లమెంటు ఉభయ సభల సంయుక్త సమావేశాన్ని ఉద్దేశించి రాష్ట్రపతి చేసిన ప్రసంగం వికలాంగులలో మళ్లీ ఆశలు చిగురించేలా చేసిందన్నారు. భారత రాష్ట్రపతి తన ప్రసంగంలో వికలాంగులకు "ప్రాదాన్యత, సమానత్వం గౌరవప్రదమైన జీవితం" "సమాజంగా మన సమిష్టి బాధ్యత" అని నొక్కిచెప్పారని గుర్తుచేశారు. 2022-23 బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన మరుసటి రోజే అటువంటి ఆశలు పూర్తిగా తుడిచి పెట్టుకుపోయాయని తెలిపారు. రాష్ట్రపతి కోవింద్ చాలా అనర్గళంగా ప్రతిపాదిస్తున్న "యాక్సెసిబిలిటీ", సమానత్వం, గౌరవప్రదమైన జీవితం" లక్ష్యాలు నీరుగారే విధంగా కేంద్ర బడ్జెట్ ఉంది. తక్షణమే కేంద్ర బడ్జెట్ సవరించి వికలాంగుల సంక్షేమానికి అవసరమైన నిధులు కేటాయించాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక జనగామ కమిటీ డిమాండ్ చేస్తుందన్నారు.





ఎల్. రమణ ఎమ్మెల్సీగా ప్రమాణ స్వీకారం చేసి, జగిత్యాల కు మొదటిసారి వచ్చిన సందర్భంగా, జిల్లా అధ్యక్షుడుగా ఎన్నికైన జిల్లా కేంద్రానికి వచ్చిన కోరుట్ల శాసనసభ్యులు విద్యా సాగర్ రావు, మంత్రి కొప్పుల ఈశ్వర్, స్థానిక ఎమ్మెల్యే సంజయ్ కుమార్ లకు బొడ్డెమ్మలతో, ఆటపాటలతో ఆహ్వానం పలికి గజమాలతో సత్కారం చేసిన 36 వ వార్డ్ కౌన్సిలర్ అదువాల జ్యోతి లక్ష్మణ్ మరియు వార్డు మహిళలు, కార్యకర్తలు.





# తెరాస జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్ రావు, ఎమ్మెల్సీ ఎల్. రమణలకు ఘన స్వాగతం

**జగిత్యాల ఫిబ్రవరి 02 (ప్రజామంటలు):** తెరాస జిల్లా అధ్యక్షునిగా జగిత్యాల జిల్లా కేంద్రంనకు విచ్చేసిన కోరుట్ల ఎమ్మెల్యే విద్యాసాగర్ రావు కు ఎమ్మెల్సీ ప్రమాణ స్వీకారం చేసి వచ్చిన ఎల్. రమణ లకు తెరాస శ్రేణులు ఘనంగా స్వాగతం పలికారు. పట్టణం లోని తెలంగాణా తల్లి, అంబేద్కర్ తదితర విగ్రహాలకు పూలమాలలు వేసి ర్యాలీ లో పాల్గొన్నారు. విద్యాసాగర్ రావు వెంట ఓపెన్ టాప్ వాహనములో మంత్రి కొప్పుల, ఎమ్మెల్యే సంజయ్, ఎమ్మెల్సీ ఎల్. రమణ, జడ్పీ చైర్ పర్సన్ దావ వసంత, మున్సిపల్ చైర్ పర్సన్ డాక్టర్ భోగ శ్రావణి ప్రవీణ్ తదితరులు ప్రజలకు అభివాదం చేస్తూ ర్యాలీ ని కొనసాగించారు. వార్డు కౌన్సిలర్ అదువాల జ్యోతి లక్ష్మణ్ ఆధ్వర్యంలో భారీ బతుకమ్మలతో మోచిబజార్, మార్కెట్ రోడ్ లో మహిళలు ర్యాలీ కి స్వాగతం ఫలికారు. అలాగే స్థానిక అంగడి బజార్ లో పద్మశాలి సేవా సంఘ సభ్యులు శాలువాలతో సన్మానం చేశారు. ర్యాలీ అనంతరం పద్మనాయక మండపంలో సభలో పాల్గొన్నారు.



## కేసీఆర్ తక్షణమే భారత సమాజానికి
# బహిరంగ క్షమాపణలు చెప్పాలి

**జనగామ ఫిబ్రవరి 02 (ప్రజామంటలు):** భారత రాజ్యాంగాన్ని అవమానించే విధంగా ముఖ్యమంత్రి కేసీఆర్ తన రాచరిక నిరంకుశ దొరల పాలనకు భారత రాజ్యాంగమే అడ్డువస్తుందని గ్రహించి అధికార అహంకార మత్తులో చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకుని తక్షణమే కెసిఆర్ భారత సమాజానికి బహిరంగ క్షమాపణలు చెప్పాలని, రాజ్యాంగాన్ని మార్చడం కాదు, తెలంగాణ సమాజం మారుస్తుందని, రాచరిక నిరంకుశ దొరల పాలన రాజ్యాంగం జోలికొస్తే అంత తేలుస్తామని ఎంఎస్ఎఫ్ రాష్ట్ర నాయకులు రాగల్ల ఉపేందర్ మాదిగ హెచ్చరించారు. జనగామ జిల్లా కేంద్రంలో మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ ఎం ఎస్ ఎఫ్ ఆధ్వర్యంలో భారత రాజ్యాంగం పట్ల కేసీఆర్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తూ కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేసి అంబేద్కర్ కి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన నిరసన ఆందోళన కార్యక్రమానికి ఎంఎస్ఎఫ్ జనగామ జిల్లా నాయకులు ఇనుముల అనిల్ మాదిగ అధ్యక్షత వహించగా ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ భారత రాజ్యాంగం వల్లనే ఆర్టికల్ 03 ద్వారా తెలంగాణ రాష్ట్రం సిద్ధిస్తే, ఆ సిద్ధించిన తెలంగాణ రాష్ట్రంలో భారత రాజ్యాంగాన్ని అవమానించే విధంగా పౌర హక్కుల్ని హరించేలా అధికార హంతో వ్యాఖ్యలు చేయడం అత్యంత హేయమైనదని మండిపడ్డారు. భారత రాజ్యాంగమే పరిపాలనా వ్యవస్థకు పౌరహక్కులకి దేశ మానవాళి మనుగడకు జీవనాధారమని, అలాంటి అతి పెద్ద లిఖిత రాజ్యాంగాన్ని ప్రపంచ దేశాలే కీర్తిస్తూ గౌరవిస్తూ ఉంటే కెసిఆర్ ఆర్ దేశంలోని పెరిగిపోతున్న సమస్యలకు కారణం రాజ్యాంగమే దాన్ని మార్చాల్సిందేనని మాట్లాడడం దీనిపై దేశవ్యాప్తంగా చర్చ పెడతాం అని చెప్పడం సిగ్గుచేటని మండిపడ్డారు. కెసిఆర్ దమ్ముంటే దేశం మొత్తం కాదు మా అధినేత మందకృష్ణ మాదిగ తో చర్చ కూర్చే తేల్చుకుందామని సవాల్ విసిరారు. భారత రాజ్యాంగాన్ని మార్చే కుట్రలో భాగంగానే హీడాన్ ఎజెండాలోనే కేసీఆర్ వాఖ్యాలు చేశారని మండిపడ్డారు. భారత రాజ్యాంగాన్ని మార్చడం అంటే భారత ప్రజల్ని ప్రమాదంలోకి నెట్టడమేనని గుర్తు చేశారు. ప్రజా పోరాటాల ద్వారానే భారత రాజ్యాంగాన్ని పరిరక్షించుకుందాం అని వ్యాఖ్యల్ని నిరసిస్తూ అన్ని వర్గాలను ఏకం చేసి వారం రోజుల పాటు నిరసన కార్యక్రమాలను కొనసాగిస్తామని, కెసిఆర్ ను తెలంగాణలో రాజకీయంగా బొంద పెడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్ఎఫ్ జిల్లా నాయకులు బొట్ల మహేష్ మాదిగ, ఎం.ఎస్.ఏఫ్. (స్టే) ఘనపూర్ నియోజకవర్గ కో-ఆర్డినేటర్ సందేన



మందకృష్ణ మాదిగ నాయకత్వంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ఎంఎస్పి జిల్లా కోఆర్డినేటర్ సీసా శ్రీధర్ గౌడ్ మాట్లాడుతూ.... భారత రాజ్యాంగం గురించి మాట్లాడడం అంటే పౌర సమాజాన్ని అవమానించడమే అని అన్నారు. కెసిఆర్ అహంకారపూరిత

రవీందర్ మాదిగ, జిల్లా నాయకులు కోట శోభాన్ మాదిగ, సందేపల్లి ప్రవీణ్ మాదిగ, సందీప్ మాదిగ, పులి నర్సింహా మాదిగ పట్టణ నాయకులు కల్లెపు చందు మాదిగ, శ్రావణ్ మాదిగ, కాంతి రాము మాదిగ, వి హెచ్ పి ఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు గడ్డం అంజయ్య, ఉదయ్, అఖిల్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

### పథకం ప్రకారం భారత రాజ్యాంగంపై
# దాడి చేస్తున్న మోడీ, కేసీఆర్

**కరీంనగర్ ఫిబ్రవరి 02 (ప్రజామంటలు):** కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ ప్రవేశపెట్టిన సందర్భంగా ఏర్పాటు చేసిన పత్రికా విలేకరుల సమావేశంలో భారత రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేద్కర్ ను అవమానపరిచే విధంగా ముఖ్యమంత్రి కేసీఆర్, భారత రాజ్యాంగాన్ని మార్చాలని చేసిన వ్యాఖ్యలను కాంగ్రెస్ పార్టీ పక్షాన తీవ్రంగా ఖండిస్తున్నామనీ కరీంనగర్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... భారత రాజ్యాంగం ఎంతో విశిష్టత గలది, దేశ రాజ్యాంగాన్ని, ప్రపంచ దేశాలు ప్రశంసించాయి, భారత రాజ్యాంగం వల్లనే కేసిఆర్ ఎన్నో పదవులు అనుభవించాడు, ఈ రాజ్యాంగం వలనే నేడు ప్రత్యక్షంగా ప్రజల చేత కాకుండా, ప్రజాప్రతినిధుల ద్వారా కెసిఆర్ కూతురు ఎమ్మెల్సీగా పదవి



చేపట్టిందని గ్రహించాలి. చిన్న రాష్ట్రాల ఏర్పాటు కోసం భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 371 ప్రకారం, నాటి యూపీఏ ప్రభుత్వ హయాంలో సోనియా గాంధీ నేతృత్వంలో తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు జరిగింది, ఈ రాజ్యాంగం వలనే నేడు కేసీఆర్ ముఖ్యమంత్రి హోదాలో ఉన్నాడన్న సంగతి మరిచి మాట్లాడుతున్నాడు. దళితులపై కపట ప్రేమ చూపిస్తున్న కేసీఆర్ రాష్ట్ర రాజధానిలో 125 అడుగుల అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామన్న హామీని ఎందుకు నెరవేర్చలేక పోయారో రాష్ట్ర ప్రజలకు చెప్పాలి. రాబోవు రోజుల్లో ముఖ్యమంత్రి కేసీఆర్ మరొకసారి రాజ్యాంగం మార్పు ప్రస్తావన తీసుకు వస్తే, దళితులను భారత రాజ్యాంగాన్ని కించపరిచే విధంగా వ్యాఖ్యలు చేస్తే,దళితుల చేతిలో భౌతిక దాడులకు గురికాక తప్పదు, దేశ వ్యాప్తంగా భారత్ బంద్ పిలుపు ఇచ్చి, పాలనను స్తంభింప చేస్తామని హెచ్చరిస్తున్నాం అన్నారు.

# హైకోర్టు జడ్జిగా జువ్వాడి శ్రీదేవి పేరు సిఫారసు

**ధర్మపురి ఫిబ్రవరి 02 (ప్రజా మంటలు):** ధర్మపురి మండలం తిమ్మాపూర్ స్వస్థలానికి చెందిన జువ్వాడి శ్రీదేవి హైకోర్టు జడ్జిగా సిఫారసు చేయబడినారు. ధర్మపురి దేవస్థానం మాజీ చైర్మన్ జువ్వాడి సూర్యారావు, భారతీ దేవి పెద్ద కూతురైన శ్రీదేవి, నిర్మల్ కు చెందిన కె. శ్రీహరి రావును వివాహమాడి, నిర్మల్ లో ఉంటూ 2004 నుండి 2007 వరకు నిర్మల్ అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ గా పని చేశారు. ఆ సమయంలో మైనర్ బాలికపై అత్యాచారంతో సహా పలు కేసులలో నేరస్తులకు శిక్ష పడడంలో చిత్తశుద్ధి, అంకిత భావంతో విధులు నిర్వర్తించడం జరిగింది. కొంతకాలంగా రాష్ట్ర హైకోర్టులో ప్రాక్టీస్ చేసిన శ్రీదేవిని 2014 జూలైలో జిపిగా రాష్ట్ర ప్రభుత్వం నియమించింది.



అలా తెలంగాణ ప్రభుత్వం తొలి మహిళకు హైకోర్టు ఎపిపిగా అవవకాశం కల్పించడం జరిగింది. ప్రస్తుతం హైకోర్టు జడ్జిగా జువ్వాడి శ్రీదేవి పేరును సుప్రీంకోర్టు కొలీజియం సిఫారసు చేసింది. శ్రీదేవి 31.10.2004 నుండి 10.02.2008 వరకు అవిభక్త ఆదిలాబాద్ జిల్లాలోని నిర్మల్ సెషన్స్ కోర్టులో అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ గా విధులు నిర్వర్తించారు. శ్రీదేవి 30.07.2014 నుండి 07.11. 2017 వరకు తెలంగాణ హైకోర్టులో గవర్నమెంట్ ప్లీడరుగా పని చేశారు. ప్రస్తుతం శ్రీదేవి తెలంగాణ రాష్ట్ర హైకోర్టులో 24.01.2018 నుండి అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ గా పని చేస్తున్నారు. తెలంగాణ రాష్ట్ర హైకోర్టు జడ్జిగా సిఫారసు చేయబడిన శ్రీదేవిని పలువురు అభినం దించారు.

# స్వయం ఉపాధికి ఐ కేర్ ఫౌండేషన్ చేయూత

**జగిత్యాల ఫిబ్రవరి 02 (ప్రజామంటలు):** ప్రతిమ ఫౌండేషన్ సహకారంతో జగిత్యాల జిల్లా రాయికల్ పట్టణంలోని చిన్నజీయర్ స్వామి ట్రస్ట్ భవనంలో ఉచిత కుట్టు మిషన్ శిక్షణ పూర్తి చేసుకున్న ధర్మాజిపేట గ్రామానికి చెందిన జి. లయకు జగిత్యాల జిల్లా స్కిల్ కమిటీ సభ్యుడు, ఐ కేర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు నాగిరెడ్డి రఘుపతి రెడ్డి బుధవారం కుట్టు మిషన్‌ను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ.... సమాజంలో మహిళలు ఆత్మగౌరవంతో, స్వశక్తితో తమ ఆర్థిక అవసరాలను తామే తీర్చుకో గలిగే నిరంతర జీవనాధార అవకాశాలు కల్పించుకోవాలని అందుకోసం ఐ కేర్ ఫౌండేషన్ చేయుతనిస్తుందని, విద్య ద్వారా విజ్ఞానం, విజ్ఞానం ద్వారా నైపుణ్యం, నైపుణ్యం ద్వారా ఆత్మవిశ్వాసం పెరుగుతుందని నైపుణ్యంతో కూడిన స్వయం ఉపాధిని పొందడం ద్వారా చైతన్యవంతమైన మహిళా సమాజం కుటుంబం యొక్క ఆర్థిక స్థితిగతులను మార్చడంతో పాటుగా సమాజ అభివృద్ధికి కృషి చేయాలని అన్నారు. ఈ కార్య క్రమంలో ఐ కేర్ ఫౌండేషన్ సభ్యులు రాజనాల మధుకుమార్, మోత్కూరి శ్రీనివాస్ పాల్గొన్నారు.



# పాన్ ఇండియా లెవల్లో విడుదల కానున్న శాకుంతలం




పౌరాణిక చిత్రంగా రూపొందుతున్న 'శాకుంతలం' షూటింగ్ ముగించుకొని పోస్ట్ ప్రొడక్షన్స్ వర్క్‌ను జరుపుకుంటోంది. అయితే, ఈ చిత్రాన్ని బాలీవుడ్‌లోనూ అత్యంత భారీ స్థాయిలో రిలీజ్ చేసేందుకు గట్టి ప్రయత్నాలు చేస్తున్నట్టు తాజా సమాచారం. స్టార్ హీరోయిన్ సమంత ప్రధాన పాత్రలో గుణశేఖర్ దర్శకత్వం వహించిన 'శాకుంతలం' పాన్ ఇండియన్ రేంజ్‌లో పలు భాషలలో రిలీజ్ చేయనున్నారు. ఇందులో సమంత టైటిల్ రోల్ పోషించగా, ఆమెకు జంటగా మలయాళ నటుడు దేవ్ మోహన్ కనిపించబోతున్నారు. ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ కూతురు అల్లు అర్హ చైల్డ్ ఆర్టిస్ట్‌గా ఈ సినిమాతో సిల్వర్ స్క్రీన్ ఎంట్రీ ఇస్తోంది. మణిశర్మ దీనికి సంగీతం అందిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇప్పుడు సమంత 'శాకుంతలం' చిత్రాన్ని అక్కడ భారీగా ప్రమోషన్స్ నిర్వహించి అంతే భారీ స్థాయిలో రిలీజ్ చేయడానికి గుణ శేఖర్ బృందం ప్లాన్ చేస్తున్నారు. దీంతో సమంతకు బాలీవుడ్‌లో క్రేజ్ మరింతగా పెరగడం ఖాయం. దిల్ రాజు సమర్పణలో గుణ టీమ్ వర్క్స్ బ్యానర్‌పై నీలిమ గుణ భారీ బ్జడెట్‌తో నిర్మిస్తున్నారు. గత ఏడాది 'ది ఫ్యామిలీ మేన్ సీజన్ 2'తో సమంత డిజిటల్ ఎంట్రీతో పాటు బాలీవుడ్ ఎంట్రీ కూడా ఇచ్చారు. ఈ వెబ్ సిరీస్‌తో సమంతకు హిందీ ప్రేక్షకులలో మంచి క్రేజ్ వచ్చేసింది. ప్రస్తుతం హిదీలో కొన్ని ప్రాజెక్ట్స్ చర్చల దశలో ఉన్నాయని వార్తలు వస్తున్నాయి.

# కబడ్డీ నేపథ్యంలో ఎన్టీఆర్ తదుపరి చిత్రం

యంగ్ టైగర్ యన్టీఆర్ తాజా చిత్రం 'ఆర్.ఆర్.ఆర్' ను మార్చ్ 25న విడుదల చేయబోతున్నట్టు మేకర్స్ ప్రకటించిన సంగతి తెలిసిందే. తదుపరిగా తారక్.. కొరటాల శివతో కబడ్డీ ప్లేయర్ గా నటిస్తున్నాడట. గ్రామీణ నేపథ్యంలో సినిమా ఉంటుందట. యన్టీఆర్ మార్క్ యాక్షన్ ఉంటూనే ఎమోషనల్ వేలో కథ సాగుతుందట. మైత్రీ మూవీ మేకర్స్




30వ చిత్రాన్ని చేయబోతున్నాడు. ఈ సినిమా త్వరలోనే ప్రారంభమై.. ఆపై రెగ్యులర్ షూటింగ్ కూడా మొదలుకానుంది. ఇదిలా ఉంటే.. తారక్ మరో సినిమాని కూడా లైన్ లో పెట్టుకున్నాడు. 'ఉప్పెన' ఫేమ్ బుచ్చిబాబు సాన ఈ సినిమాకి దర్శకుడుగా ఖరారు అయినట్లు సమాచారం. స్పోర్ట్స్ బ్యాక్ డ్రాప్ లో సాగే ఎమోషనల్ స్టోరీ ఇంప్రెసివ్ గా ఉండడంతో యన్టీఆర్ నుంచి గ్రీన్ సిగ్నల్ వచ్చింది. ఈ క్రమంలో ఈ సినిమాకి సంబంధించిన ఓ ఆసక్తికరమైన వార్త అభిమానుల్ని ఊరిస్తోంది. ఈ సినిమాతో తారక్ బ్యానర్‌లో ఈ సినిమా నిర్మాణం జరుపుకోనుంది. మార్చ్‌లో కొరటాల శివ సినిమా షూటింగ్ ప్రారంభమవుతుంది. ఆ తర్వాతే ఈ సినిమా సెట్స్ పైకి వెళ్ళనుందని సమాచారం.

ప్రస్తుతం స్క్రిప్ట్‌ను లాక్ చేసే పనిలో ఉన్నాడు దర్శకుడు బుచ్చిబాబు. ఇదివరకు కబడ్డీ నేపథ్యంలో వచ్చిన 'కబడ్డీ కబడ్డీ, ఒక్కడు, సీటీమార్' చిత్రాలు ఘన విజయం సాధించిన నేపథ్యంలో ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి.

## మరోమారు పోలీసాఫీసర్ పాత్రలో నాగ్


తమిళ హీరో అజిత్, బోనీకపూర్, హెచ్.వినోద్ కాంబినేషన్‌లో ఇప్పటి వరకూ 'నేర్కొండ పార్వై', విడుదలకు సిద్ధమైన 'వలిమై' చిత్రాలు నిర్మాణం జరుపుకున్నాయి. ఇటీవల ఈ కాంబినేషన్‌లో మూడో సినిమా కూడా అనౌన్స్ అయింది. ప్రస్తుతం ఈ సినిమా




స్క్రిప్ట్ ను లాక్ చేసే ప్రయత్నంలో దర్శకుడు వినోద్ ఉన్నాడు. త్వరలోనే సినిమా సెట్స్ పైకి వెళ్ళబోతోంది. అజిత్‌కిది 61వ చిత్రం. ప్రస్తుతం కథానాయిక అన్వేషణలో మేకర్స్ ఉన్నారు. దొంగతనం నేపథ్యంలో ఈ సినిమా తెరకెక్కనుంది. ఈ మూవీలో ఓ సీనియర్ పోలీస్ కమిషనర్ పాత్ర సినిమాకి కీలకమైనదిగా భావిస్తున్నారు. ఆ పాత్ర కోసం నిర్మాత బోనీ కపూర్ నాగార్జునను సంప్రదించారట. నాగ్‌కు కథ బాగా నచ్చడంతో గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని సమాచారం. నిజానికి ఈ పాత్రకోసం మాలీవుడ్ మెగాస్టార్ మోహన్ లాల్‌ను అనుకున్నారట. అయితే ఫైనల్ గా నాగార్జునను ఎంపికచేశారని తెలుస్తోంది. తమిళ, తెలుగు, హిందీభాషల్లో విడుదల కానున్న ఈసినిమాలో ఓ మాలీవుడ్ స్టార్ ప్రధాన పాత్ర పోషించబోతున్నారని టాక్. ఇక ఈ సినిమాలో అజిత్ నెగెటివ్ షేడ్స్ తో కూడిన పాత్ర ధరిస్తున్నారట. మరి ఈ వార్తల్లో నిజానిజాలేంటో చూడాలి.


## అశోకవనంలో అర్జున కల్యాణం టీజర్ విడుదల

టాలీవుడ్‌కి లవర్‌బాయ్‌గా పరిచమయమై మాస్ హీరోగా అభిమానులను సంపాదించుకున్నాడు విశ్వక్ సేన్. వెళ్లిపోమాకే, ఈ నగరానికి ఏమైంది, ఫలక్‌నూమా దాస్, హిట్, పాగల్ వంటి చిత్రాలతో అలరించిన విశ్వక్ సేన్ తాజాగా నటిస్తున్న చిత్రం అశోకవనంలో అర్జున కల్యాణం. ఈ సినిమాలో వడ్డీ వ్యాపారిగా అలరించనున్నాడు విశ్వక్ సేన్. ఈ సినిమా ప్రమోషన్స్‌ను మొదటి నుంచి విభిన్నంగా చేస్తుంది చిత్రబృందం. ఇటీవల విడుదల చేసిన ఫస్ట్‌లుక్, సాంగ్‌ఆకట్టుకున్నాయి. 'ఓ ఆడపిల్లా' పాటతో విశ్వక్ సేన్ సరసన నటించే హీరోయిన్ రుక్సార్ దిల్లాన్ అని రివీల్ చేశారు మేకర్స్. తాజాగా 'అశోకవనంలో అర్జున కల్యాణం' సినిమా టీజర్‌ను విడుదల చేసింది చిత్రబృందం. 'ఇంటర్‌క్యాస్ట్? అరేంజ్‌డ్ మ్యారెజ్ సినిమాల్లో అయినా అయితదారా.. ఇదే ఫస్టా' అంటూ ప్రారంభమైన సినిమా టీజర్ ఆద్యంతం ఆకట్టుకునేలా ఉంది. సంభాషణలు, సీన్లు, పెళ్లి కోసం విశ్వక్ సేన్? చేసే ప్రయత్నాలు అలరించాయి. ఈ సినిమాతో సరైనా సమయంలో పెళ్లి చేసుకోకుంటే ఎలాంటి సమస్యలు తలెత్తుతాయో హ్యూమరస్‌గా చూపించనున్నట్లు తెలుస్తోంది. టీజర్ చివరిలో విశ్వక్‌సేన్ చెప్పే డైలాగ్ ఆకట్టుకునేలా ఉంది. మార్చి 4న ప్రేక్షకులముందుకు రానున్నాడు ఈ గోదావరి అల్లుడు..



## బీమ్లా నాయక్ ప్రివ్యూ చూసిన పవన్ ?

పవన్ కళ్యాణ్, రానా తాజాగా 'భీమ్లా నాయక్' మూవీ ప్రివ్యూ చూసినట్టు సోషల్ మీడియాలో ఓ వార్త వచ్చి వైరల్ అవుతోంది. సాగర్ కె చంద్ర దర్శకత్వంలో పవర్ స్టార్ పవన్ కళ్యాణ్, రానా హీరోలుగా రూపొందిన మల్టీస్టారర్ 'భీమ్లా నాయక్' చిత్రాన్ని ఈ నెల 25న లేదా ఏప్రిల్ 1న ప్రేక్షకుల ముందుకు తీసుకు వచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు. దాదాపుగా ఫిబ్రవరి 25నే భారీ స్థాయిలో రిలీజ్ చేసేలా మేకర్స్ గట్టిగా ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్ ప్రసాద్స్ ల్యాబ్‌లో 'భీమ్లా నాయక్' చిత్రాన్ని ప్రదర్శించగా.. చిత్రబృందంతో కలిసి హీరోలు పవన్, రానా వీక్షించినట్టు సమాచారం.సినిమా పవన్‌కు బాగా నచ్చిందని, అవుట్ పుట్ పట్ల ఆయన ఎంతో సంతృప్తిగా ఉన్నట్టు చాలా ఎగ్జైట్ అవుతూ భారీ హిట్ ఖాయమని మేకర్స్‌తో చెప్పారట. దాంతో దర్శక, నిర్మాతలు చాలా ఉత్సాహంగా ఉన్నారట. మలయాళంలో బ్లాక్ బస్టర్ హిట్ సాధించిన 'అయ్యప్పనుమ్ కోషియమ్' తెలుగు రీమేక్‌గా రూపొందిన 'భీమ్లా నాయక్' ఇక్కడ ఎలాంటి సరికొత్త రికార్డ్స్ క్రియేట్ చేస్తుందో చూడాలి. సితార ఎంటర్‌టైనెంట్స్ నిర్మించిన ఈ సినిమాకు త్రివిక్రమ్ శ్రీనివాస్ స్క్రీన్ ప్లే, డైలాగ్స్ అందివ్వగా..ఎస్ ఎస్ థమన్ సంగీతం అందిస్తున్నారు. నిత్యా మీనన్, సంయుక్త మీనన్ హీరోయిన్స్‌గా నటించారు.



## దూకుడు మీదున్న మాస్ మహారాజా

ప్రస్తుతం మాస్ మహారాజా రవితేజ 'ఖిలాడి, రామారావు ఆన్ డ్యూటీ, ధమాకా, రావణాసుర' చిత్రాలతో పాటు 'టైగర్ నాగేశ్వరరావు' బయోపిక్ లోనూ నటిస్తున్నారు. వీటిలో 'రావణాసుర' చిత్రం షూటింగ్ ప్రారంభమైంది. 'స్వామిరారా, దోచేయ్, కేశవ, రణరంగం లాంటి క్రైమ్



థ్రిల్లర్స్‌ను తెరకెక్కించిన సుధీర్ వర్మ దీనికి దర్శకుడు. గ్రే షేడ్స్ కలిగిన పాత్రలో రవితేజ నటిస్తుండగా.. రామ అనే పాత్రను యంగ్ హీరో సుశాంత్ పోషిస్తున్నాడు. మేఘా ఆకాశ్, అను ఇమ్మాన్యుయేల్, ఫరియా అబ్దుల్లా, పూజితా పొన్నాడ, దక్షా నగార్కర్ కథానాయికలుగా నటిస్తున్నారు. అభిషేక్ నామా నిర్మాణంలో సినిమా రూపుదిద్దు కుంటోంది. ఇక ఈ సినిమా షూటింగ్ లో పాల్గొన్న రవితేజ మొదటి రోజు షూటింగ్ పై సూపర్ ఎగ్జైట్ అవుతూ 'రావణాసుర' టీమ్ తో దిగిన సెల్ఫీని సోషల్ మీడియాలో షేర్ చేశారు. ఫరియా అబ్దుల్లా, దర్శకుడు సుధీర్ వర్మ తదితరులు ఫోటోలో కనిపిస్తున్నారు. ఇక ఈ మూవీలో రవితేజ డాన్‌గా అలరించబోతున్నారు. 'డిస్కోరాజా' చిత్రంలో ఈ తరహా పాత్రనే చేసిన రవితేజ ఆ సినిమా రిజల్ట్‌తో నిరాశచెందారు. ఇప్పుడు 'రావణాసుర' చిత్రంతో మంచి సక్సెస్ అందుకోవాలనే పట్టుదలతో ఉన్నారు. మరి ఈ సినిమా రవితేజకు ఏ స్థాయి సక్సెస్ అందిస్తుందో చూడాలి.

# మార్చి 11న రాధేశ్యామ్ రిలీజ్

### బ్యాట్‌మెన్ విడుదలతో యూస్ కలెక్షన్లపై ఆందోళన

కరోనా మూడోవేవ్ మెల్ల మెల్లగా కనుమరుగవుతోంది. పరిస్థితులు అన్ని చోట్లా చక్కబడుతుండటంతో సాధారణ వాతావరణం నెలకొననుంది. దీంతో వాయిదా పడిన భారీ బ్జడెట్ సినిమాలు అన్నీ వరుసగా విడుదలను ఖరారు చేసుకుంటున్నాయి. ఇప్పటికే 'ఆర్‌ఆర్‌ఆర్' మార్చి 25న రిలీజ్ అవుతుందని



అధికారికంగా ప్రకటించగా ఈ రోజు 'రాధే శ్యామ్'ను కూడా మార్చి 11న విడుదల చేస్తామని మేకర్స్ ఎనౌన్స్ చేశారు. ఇదిలా ఉంటే డిసి కామిక్ సూపర్ హీరో 'బ్యాట్ మేన్' సినిమాను మార్చి 4న యుఎస్ లో విడుదల చేయబోతున్నారు. నిజానికి గతేడాది మార్చిలో విడుదల కావలసిన ఈ సినిమా కూడా కరోనా పాండమిక్ వల్ల వాయిదా పడింది. యు.స్ మార్కెట్ లో మార్చి 4న భారీ స్థాయిలో విడుదల కాబోతోందన్నమాట. మన తెలుగు సినిమాలకు కూడా యుఎస్ పెద్ద మార్కెట్. ఒక వేళ సూపర్ హీరో 'బ్యాట్ మేన్'కి మంచి రెస్పాన్స్ లభిస్తే ఆ ప్రభావం హాలీవుడ్ బాక్సాఫీస్ వద్ద 11న రానున్న 'రాధేశ్యామ్'పై పడే అవకాశం ఉంది. మాట్ రీవ్స్ దర్శకత్వం వహించిన 'బ్యాట్ మేన్'లో రాబర్ట్ పాటిన్ సన్, జెఫ్రీ రైట్, జో క్రావిటిజ్ ముఖ్య పాత్రలను పోషించారు. మరి 'రాధేశ్యామ్'కి 'బ్యాట్ మేన్' దెబ్బ తగులుతుందా అన్నది చూడాలి.

## సెహరి ట్రైలర్ విడుదల

హర్ష్ కనుమిల్లి, సిమ్రాన్ చౌదరి జంటగా తెరకెక్కిన చిత్రం సెహరి. ఈ సినిమాకు జ్ఞానసాగర్ దర్శకత్వం వహించారు. వర్గో పిక్చర్స్‌పై అద్వయ జిష్ణురెడ్డి నిర్మించిన ఈ మూవీ నుంచి బుధవారం ట్రైలర్ రిలీజైంది. 'సెహరి అంటే ఏంటి భయ్యా సెహరి అంటే సెలబ్రేషన్స్, నీ ముఖానికి పెళ్లవడమే ఎక్కువ', 'ఆలియాను చేసుకోమంటే అక్కను తగులుకున్నావేంట్రా' వంటి డైలాగులు బాగున్నాయి. హీరో పార్ట్‌నర్ కోసం వెతకడం, ఎంగేజ్‌మెంట్ నుంచి పారిపోవడం... వంటి సన్నివేశాలు ఆసక్తికి కలిగిస్తున్నాయి. యూత్‌ఫుల్ రొమాంటిక్ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన ఈ చిత్రం ఫిబ్రవరి 11న ప్రేక్షకుల ముందుకు రానుంది. ప్రశాంత్ విహారి సంగీతం అందిస్తున్న ఈ చిత్రానికి రవితేజ గిరిజాలా ఎడిటర్‌గా వ్యవహరిస్తున్నారు. ఈ సినిమాలో అభినవ్, గౌతమ్ కీలక పాత్రల్లో నటిస్తున్నాడు. ఇదిలా ఉంటే అప్పట్లో ఈ సినిమా ఫస్ట్ లుక్‌ను నటసింహం నందమూరి బాలకృష్ణ విడుదల చేశారు. ఆ కార్యక్రమంలో హర్ష్ కనుమిల్లిని వర్జిన్ స్టార్ అని బాలకృష్ణ అనడం వైరల్ కూడా అయింది.



PRINTED AND PUBLISHED BY V.NARSINGAM, ON BEHALF OF CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI SHARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE.
EDITOR : CH V. PRABHAKAR RAO, RNI T.C. TELTEL01938. FILE NO.1349985
PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com